అంఆ

అమ్మ సూక్తులు - వివరణ



- రామకృష్ణ

ఆనందాశ్రమము

లక్ష్మీపురం R.H.C., వడ్లపూడి పోస్టు, విశాఖపట్నం-46.

అమ్మ సూక్తులు - వివరణ



అమ్మా నీ సూక్తులకున్

కమ్మని భావములొసగిన కరుణాకరణీ

ఇమ్మని నిను వేడకనే

కమ్మని కరుణామృతముతో కాచెదవమ్మా !

- **రామకృష్ణ**

ఆనందాశ్రమము
లక్ష్మీపురము (ఆర్.హెచ్.సి.),
వడ్లపూడి (పోస్ట్),
విశాఖపట్నం – 46.

అమ్మ సూక్తులు - వివరణ

ప్రథమ ముద్రణ : అక్టోబరు 24, 2001.

వేయి ప్రతులు

మూల్యం : 20 రూ॥లు

ప్రతులకు : **రామకృష్ణ**
ఆనందాశ్రమము,
లక్ష్మీపురము (ఆర్.హెచ్.సి),
వడ్లపూడి (పోస్ట్),
విశాఖపట్నం – 530 046.

(మరియు)

ఎ. కుసుమా చక్రవర్తి,
అశోక్ హౌస్,
4–45–1, పెద వాల్తేరు, విశాఖపట్నం – 530 017.
ఫోన్ : (0891) – 530 346.

ముద్రణ : ధర్మతేజ ప్రింటింగ్ వర్క్స్,
శ్రామికనగర్, గాజువాక, విశాఖపట్నం – 530 026.
ఫోన్ : 0891–514985

ఓం శ్రీ గురుభ్యోనమః

విషయ సూచిక

ఓం శ్రీ గురుభ్యోనమః

ప్రార్థన

1. ధర్మ మెరుంగని నాకున్
నిర్మల జ్ఞానము నొసగిన నిను మది తలతున్
మర్మము తెలియన్ జేసిరి
కర్మము తొలగన్ గురువర కరుణామూర్తీ !

2. గళమున్ విప్పిన తోడనె
జలధార వలే పలుకులు జారును దేవా
కలమున్ పట్టిన తోడనె
బలమున్ యిచ్చి గురుదేవ బ్రోచిరి నన్నున్ !

3. దృష్టిలో దోషము ఉన్నను
కష్టము నిను గాంచలేము కరుణా రూపా
దృష్టిలో భేదమె గానీ
సృష్టికి మూలము నెరిగిన సృష్టియు నీవే !

4. జగమంతా నీవున్నను
జగడం బీడదు మనంబు జగదాధారా
రాగమొదలి నిన్ను గనే
యోగమె మోక్షంబు నిచ్చు యోగానందా !

అంకితం

నాలో "నేనై"

భావతరంగమై

శరవేగంతో

జాలువారి

అక్షర రూపం దాల్చిన

అమ్మ చరణాలకు

ఈ గ్రంథ మందారం అంకితం

- రామ కృష్ణ

సద్గురు వర్యులైన పూజ్య శ్రీ యోగానంద స్వామి వారి అమృతాశీస్సులు

జయంగురం

రామకృష్ణ దైవసేవ చేయుటకు నిమిత్త మాత్రంగా నియ మితుడు. అందుకే అతనిలో ఆ వెలుగు దిమ్ము తుంది. ఎందరో హృదయ తాపాలను చల్లార్చ గలుగుతున్నారు. వాసనామయ జగత్తులో ఉపాసనా బలాన్ని నాట గలుగుతున్నారు. ''మానవ తనువు దుర్లభం'' తత్వ చింతన కలిగిన ఈ కవి రవి కిరణాలను భక్తుల హృదయాలపై ప్రసరింపచేసి పాప తిమిరాలను పారద్రోలుతున్నారు. మహాత్ముల, పరమాత్మని కృపను పొందిన ధన్యుడు, మాన్యుడు, దైవం అతనిని దీవించి బ్రోచుగాక!

సత్యం శివం.

శుభాశీస్సులు

మానవ మనుగడకు శాంతియే గమ్యము. అట్టి శాంతి పొందుటకు ఆధ్యాత్మిక విజ్ఞానం, జీవిత అవగాహన చాలా ముఖ్యం. అట్టి ఉద్దేశ్యంతో కూడుకున్నదే మన భారతీయ సాంప్రదాయం (ఆర్ష సంస్కృతి). ఎంతో మంది మహానుభావులు అనుభవ వేద్య సత్యాలతో అమూల్య సందేశాలను మానవాళికి అందించారు. అట్టి దివ్య మూర్తులకు ఎల్ల వేళలా కృతజ్ఞులమే. అట్టి దివ్య మూర్తులలో **జిల్లెళ్ళమూడి అమ్మ** ఒకరు. ఆ అమ్మ అందించిన సూక్తులకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. సువర్ణమునకు సుగంధం అబ్బినట్టుగా చిరంజీవి రామకృష్ణ ఆధ్యాత్మిక ఆరాటంతో అందరికీ అర్థమయ్యే పద్ధతిలో సరళ భాషలో, సుమధుర భావాలతో ఆ సూక్తులకు వివరణను అందించారు. ఆ సూక్తుల యొక్క వివరణ చదువుచున్నంత కాలము నా హృదయాన్ని ఎంతో ఆహ్లాదపరచినవి.

''నేను నేనైన నేను'', ''గుడిలో దేవుడు గుడి మీద కోతులు'', ''ఇతరులతో తగాదా ఆడటం పోరాటం! తనతో పోరాటమే ఆరాటం!'' వంటి సూక్తులకు పరమార్థాన్ని, అంతరార్థాన్ని అద్భుతమైన రీతిలో వివరించారు. ఆ సూక్తులకు వివరణ చదువుతున్న ప్రతీ వారికీ హృదయ స్పందన, ఆధ్యాత్మిక స్ఫూర్తి కలుగక తప్పదు. ఇంత చిన్న వయస్సులో ఆధ్యాత్మిక సత్యాలను చెప్పగలగడానికి ఒక అద్భుత శక్తి ప్రేరణ ఉండాలి, ఉన్నది కూడా. మున్ముందు సద్గురు అనుగ్రహముతో మానవ సమాజానికి ఉత్తమ సందేశాల్నిచ్చి తన జీవితం సఫలీకృతమగు గాక ! దివ్య శక్తి ఎల్లప్పుడూ తనను తేజోమయ పథం వైపుపయనింపజేయుగాక !

ఇట్లు
సర్వభూత హితాభిలాషి,
శ్రీస్వామి కూర్మానంద
శ్రీ రామానంద యోగాశ్రమము.
వి.ఆర్.పురం, మందస (మండలం),
శ్రీకాకుళం (జిల్లా),ఆంధ్రప్రదేశ్.

అమ్మ వాక్య వైభవం

ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం మన్నవలో రుధురోద్గారి చైత్రశుద్ధ ఏకాదశి బుధవారం 1923, మార్చి 28వ తేదీన అమ్మ ఈ భూమిపై అవతరించింది. అమ్మ భూమి మీద కన్ను తెరచిన క్షణం నుంచీ అన్నీ అత్యద్భుత విశేషాలే జరిగాయి. వాటిని గుర్తించిన వాళ్ళలో మంత్రసాని నాగమ్మ, అమ్మ చిన తాతగారు చంద్రమౌళి చిదంబరరావు గారు, తాతమ్మ మరిడమ్మ గారు, పోలీసులు అంకదాసు, మస్తాను మొదలగువారు.

అమ్మ చిన్నతనం నుంచీ అందర్నీ తన బిడ్డలగానే భావించింది. ఎవరిని చూచినా తన బిడ్డే అనిపించేది. కులభేదం, గుణభేదమనేది ఎరుగదు. స్వపర భేదం అంతకంటే లేదు. అమ్మది "సరే" మంత్రం అన్నింటికీ సరే అంటూ తాను కోరుకున్న విధంగా మనలని నడిపిస్తుంది.

"లోకంలో ఎవరూ నా ఒడి విడిచిలేరు" అని చిన్న తనంలోనే ప్రకటించి విశ్వజననిగా, జగదారాధ్యగా పూజలను అందుకున్నది. ఆ స్థితే హిమాలయ శిఖరాగ్రాన సింహాసనాన్ని అధిష్టింపచేసింది. ఆ స్థితి నుండే అమ్మ "ఈ సృష్టి నాది" అనగలిగింది.

ప్రఖ్యాత గాయత్రీ ఉపాసకులు, సిద్ధులు అయిన శ్రీలక్ష్మీకాంత యోగి అమ్మను "గాయత్రీ దేవిగా" దర్శించారు. ప్రసిద్ధ పండితులు శ్రీ కాశీ కృష్ణమాచార్యులు గారు అమ్మను "రాజరాజేశ్వరిగా", గుర్తించారు. సిద్ధ పురుషులు రంగన్న బాబుకు అమ్మ పాదాల్లో పార్వతీ పరమేశ్వరుల సాక్షాత్కారమైంది. కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్యులుగారు అమ్మను "రిజర్వాయర్ ఆఫ్ పవర్"గా అభివర్ణించారు. భగవాన్ సత్యసాయి బాబా గారు "అమ్మను సాక్షాత్తు రాజరాజేశ్వరీ అవతారంగా ప్రకటించారు.

అమ్మ రూపం కూడా అద్భుతమైంది. పాదం నుండీ ఫాలం వరకు యావత్ శరీరం దివ్యతేజో విలసితమైనట్లుండేది. ప్రతి అవయవం లావణ్యానికి, సౌందర్యానికీ ప్రతీకగా విరాజిల్లేది. దర్శించిన ప్రతి ఒక్కరికీ అమ్మ రూపంలో అలౌకికత గోచరించేది. అమ్మ పుట్టింది హిందూమత సంప్రదాయంలో అయినా అమ్మ అన్ని మతాలను సమ్మతించింది. అలాగే అన్ని మతాల వాళ్ళు అమ్మను అంగీకరించారు.

అమ్మది వైకల్యం లేని మనస్సు, సచ్చిదానంద స్థితికాబట్టే అమ్మ సన్నిధికి రాగానే అందరి మనస్సులకు ప్రశాంతత చేకూరేది. హరేరామ నామ సంకీర్తనతో ఉర్రూతలూగించిన నామయోగి శ్రీరఘువరదాసు గారు, ప్రభుదత్త బ్రహ్మచారి గారు అమ్మ సన్నిధిలో పసిపిల్లల మాదిరి సంచరించారు.

ఆవేద వేద్యుడే రాముడు, ఆ రాముడే లలిత, ఆ లలితయే మన అమ్మ. కోటి నామ పారాయణ నాడు ముముక్షుజన పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రుల వారు "అమ్మ అమృతమూర్తిగా వుండి మనలని మృణ్మయ మూర్తులుగా వుంచటం ఇష్టం లేక మన చేత కోటి నామ పారాయణ చేసి మనలను కూడా లలితా మూర్తులుగా చేయ సంకల్పించిందని" ప్రవచించారు.

హటకేశ్వరం శ్రీశ్రీశ్రీ పూర్ణానంద స్వామీజీ అనేక సంవత్సరములు తపస్సు చేసి ఆత్మ సాక్షాత్కారం పొందిన మహాతపస్వి. అమ్మను సాక్షాత్తు రాజరాజేశ్వరిగా కొలిచి అమ్మ సన్నిధిని శ్రీశ్రీశ్రీ లలితా పరాభట్టారికా మహా సామ్రాజ్యంగా అభివర్ణించారు. అమ్మ స్థాపించిన అన్న పూర్ణాలయాన్ని తమ ఆశ్రమంలో కూడా నిరాటంకంగా సాగించిన సిద్ధ పురుషులు.

శ్రీ పాద గోపాలకృష్ణమూర్తిగారు అమ్మతో ''అమ్మకి తానే అయి వుండటానికి కంటే, లోకం వైపు చూడటానికి ఎక్కువ ఖర్చు అవుతుంది.'' అన్నారు. వెంటనే అమ్మ ''ఈ వ్యాపారంలో లాభ నష్టాలు లేవు నాన్నా! '' అన్నది. తానే అయి ఉండటం, లోకం వైపు చూడటమూ రెండూ ఒకటే అమ్మకు. ఇది సహజస్థితి. ఈ సర్వ సమాన స్థితినే అమ్మ ''సహజ సమాధి'' అన్నది. అమ్మకు గల ఈ స్థితే శ్రీపాద వారిని జిల్లెళ్ళమూడికి బంధించింది. ''ఎక్కడైనా ఆధ్యాత్మిక గగన తలంలో నెలవంకలనే చూడగలం కానీ జిల్లెళ్ళమూడిలో మాత్రమే పూర్ణచంద్రుణ్ణి చూడగలం'' అన్న డాక్టర్ శ్రీపాదవారి ప్రవచనం ప్రత్యక్ష సత్యం.

అమ్మ వాత్సల్య యాత్రలో ఏలూరు సెయింటు థెరిస్సా కాలేజీని దర్శించింది. ప్రిన్సిపాల్ జోసఫిన్ ''అమ్మలో దైవత్వం, మానవత్వం స్పష్టంగా కనిపిస్తున్నాయని, ఆడ పిల్లలు అమ్మలోని ప్రేమ, వాత్సల్యాలను పుణికి పుచ్చుకొని తద్వారా తమ జీవితాలను చక్కదిద్దుకోవాలని '' ఉద్బోధించారు.

అమెరికా దేశస్థుడైన రిచెర్డ్స్ షిఫ్‌మెన్ ''జిల్లెళ్ళమూడి మానవుని అంతర అవలోకానికి, ప్రగతికి అద్వితీయమైన పరిసరాలను సమకూరుస్తుందని అనుభవంతో అమ్మ భోధిస్తున్న విలువలను అక్కడే నేర్చుకున్నానని'' వివరించాడు. వెస్టర్లండ్ అనే విదేశీయుడు అమ్మ దగ్గరకు రాకపోయినా, తానే అతనికి దర్శనమిచ్చి అతనిలో భక్తి భావాన్ని అంకురింపచేసి ''గార్డెన్ ఆఫ్ ఫ్లవర్స్'' అనే పద్యకావ్యాన్ని రాయించింది అమ్మ.

నెదర్లాండ్ నుంచి అమ్మను దర్శించడానికి వచ్చిన నీలెండ్ అనారోగ్యంతో హైదరాబాద్ ఆసుపత్రిలో చేరాడు. అమ్మే అతని దగ్గరకు వెళ్ళి తన కరుణా వృష్టిని అతనిపై కురిపించి స్వయంగా అరిటిపండు ఒలిచి నోటికి అందించింది. అమ్మ ఎవరి ఇష్టదైవంగా వారికి కనిపించింది. అమ్మ కరుణా రస సాగర. బిడ్డలపై అమ్మకు గల వాత్సల్యం అనంతం.

సందర్భవశాన అమ్మ పలికిన వాక్కులే అమ్మ ప్రతిపాదించిన సూక్తులు. ఆ సూక్తులకు ఎవరైనా వివరణ రాస్తే బాగుంటుందను కుంటున్న సమయంలో చిన్నవాడైనా మర్రాపు రామకృష్ణకు అమ్మ ఆ అవకాశాన్ని ఇచ్చింది. దీనికి ముందుమాట రాసే భాగ్యాన్ని అమ్మ నాకు ప్రసాదించింది. "నాకు కావలసిన వారిని నేనే ఎంచుకుంటానని" అమ్మ ప్రకటించింది. "అమ్మ దయవుంటే అన్నీ వున్నట్లే" అమ్మ మలచిన మృణ్మయ పాత్రలమే మేము. అమ్మ యొక్క అవ్యాజానురాగంలో మునకలు వేస్తూ మా ఆనందాన్ని నలుగురికి పంచాలన్న తాపత్రయమే ఈ గ్రంథ రచనకు ముందు మాటకు దారితీసింది. 'నేను నేనైన నేను" అనే అమ్మ సూక్తి రామకృష్ణ తనకు అమ్మతోపించినట్లుగా వివరించాడు. దాన్నే నాకు అనుగ్రహించిన విషయం ఇక్కడ వ్రాయటం అప్రస్తుతం కాదనుకుంటాను.

ప్రపంచం వేరు, నేను వేరు అనుకున్నప్పుడు అందరూ వేరు వేరుగా కనిపిస్తారు. అందరూ ఒక్కటిగా కలిసిన రోజు అమ్మ చెప్పిన 'నేను నేనైన నేను" అవుతుంది. 'నేను నేనైన నేను"లో ఒక పెద్ద నేను, ఒక చిన్న నేను ఉన్నాయి. గంగోత్రి దగ్గర జన్మించిన ఒక చిన్న ఏరు చుట్టూ వున్న చిన్న చిన్న గుంటలలో నీరును తనతో కలుపుకుంటూ అలకానంద,

భగీరథిలతో పాటు డోలానందా, మందాకినీలను కలుపుకొని హరిద్వార్ దగ్గరకు వచ్చేటప్పటికి గంగానదిగా ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆ చిన్న చిన్న గుంటల్లోకి నీరు వ్యష్టి చైతన్యంగా, ప్రవాహం సమిష్టి చైతన్యంగా గోచరిస్తుంది. గంగా ప్రవాహం హిమనీ నదాలను కూడా తనలో కలుపుకొని పైన హిమనీనదంలా గోచరించిన, అడుగు భాగాన ప్రవాహం వుంటుంది. పై భాగం చిన్న నేను, అడుగు ప్రవాహం పెద్ద నేను. హిమం కరిగినప్పుడు ప్రవాహంలో కలిసిపోయినట్లే పెద్ద నేనుతో చిన్న నేను కలిసిపోయి తన అస్తిత్వాన్ని కోల్పోతుంది. అమ్మ చెప్పిన ''నేను నేనైన నేను'' సమిష్టిగా చూడక పరిమితమైన అమ్మగా అనగా వ్యష్టిగా చూస్తాము. విశ్వ చైతన్యంలో తాదాత్మ్యం చెందిన వారు ''తానైన తానుగా'' రూపొందుతారు అమ్మ చెప్పినట్లుగా 'నేను నేనైన నేను' అన్ని 'నేనులు నేనైన నేను'' అన్న అమ్మ విశ్వ చైతన్యమే అయివున్నది.

''జరిగింది ముహూర్తం, పెట్టింది ముహూర్తం కాదు'' అన్న అమ్మ సూక్తికి నిదర్శనమే ఈ క్రింది సంఘటన. మా అమ్మాయి అనురాధ పెళ్ళి 1982 జూన్ 11న జిల్లెళ్ళమూడిలో జరిపించింది. ఆ ఉదయం 7.58 ని..లకు ముహూర్తం 7 గం..లకు అమ్మ దగ్గరకు వెళ్లాను. అమ్మ 'నేను రెడీగానే వున్నాను. మీరు ఎప్పుడు రమ్మంటే అప్పుడు వస్తానని, అంటూ ''పెట్టింది ముహూర్తం కాదు, జరిగిందే ముహూర్తం'' అని శుభలేఖల్లో టైమ్ అందరూ ఆ సమయానికి అక్కడికి చేరటానికని'' విపులీకరించింది. అంతా నీ ఇష్టప్రకారమే చేయమ్మా'' అని అంటుండగా శ్రీ ఎస్.ఆర్.వై. ప్రసాదు గారు అమ్మ దగ్గరకు వచ్చి ''ఫోటో గ్రాఫర్‌ని బాపట్ల నుంచీ తీసుకురావాలి. అంతదాక క్రిందకు రాకమ్మ'' అని ప్రార్థించారు. సాధారణంగా అమ్మ సమక్షంలో అన్ని ఫంక్షన్స్ మిట్ట

మధ్యాహ్నం మిడసరలగ్నం అన్నట్లుగా మధ్యాహ్నం 12 గంటలకు జరిగేవి. అలాగే 12 గంటల తర్వాతే బాబు ఒడుగు, అమ్మాయి వివాహం జరగటం విశేషం. వాళ్ళు హాయిగా పిల్లా పాపలతో సుఖమయ జీవనాన్ని గడుపుతున్నారు.

చీకటే వెల్తురుకాధారం :- చీకటి లేకపోతే వెల్తురు యొక్క అవసరం, విలువ తెలియదు. లోకమంతా చీకటిలో మునిగినప్పుడు మానవుడు చిన్న వెలుగుకై ఆరాటపడతాడు. ఆ ఆరాటంలో చిరు దీపాన్ని గాంచినా అతని ఆనందానికి అవధులుండవు. ప్రకృతిలోని అందచందాలను గ్రోహించాలన్నా, తన దైనందిన కార్యక్రమాలను జరుపుకోవాలన్నా వెలుగు అవసరం.

బరువు బాధ్యతలతో సుఖమనేది తెలుసుకోలేక విషయలోలుడైన మానవుడు వెలుగుకై ప్రాకులాడుతాడు. అది ఎక్కడ లభిస్తుందో తెలియక అశాంతితో అలమటిస్తాడు. ఆ విషయాల్లోనే శాంతికై, కాంతికై వెదుకులాడుతాడు, రాగ ద్వేషాల, కష్ట నష్టాల, బరువు బాధ్యతలలో పెనవేసుకున్న మానవుడు, ఆ వెలుగు రేఖకై తపిస్తాడు. అజ్ఞానమనే చీకటి ఆవరించినప్పుడు వెలుగు రేఖలు ఉదయించవు. మనలోని ఆత్మ జ్యోతిని తెలుసుకోవటానికి ముందుగా మనలో ఆవరించియున్న అజ్ఞానమనే తిమిరాన్ని ఆశ్రయించక తప్పదు. "Known to Unknown" అన్నట్లుగా మనలోని అజ్ఞానాన్ని ఆధారం చేసుకొని దాన్ని భేదించుకుంటూపోతే ఆవలవున్న జ్ఞాన జ్యోతిని గాంచగల్గుతాము.

అజ్ఞానాంధకారంలో జ్ఞానమనే ఆశాజ్యోతి వెలుగులు ప్రసరించాలంటే మానవుడు సత్కర్మలనాచరించాలి. మొదట

కామ్యంతోనైనా మొదలుపెడితే తరువాత కాల క్రమేణా కామ్య కర్మలతో విసిగి నిష్కామ కార్యం బలపడుతుంది. నిర్గుణత్వమే సగుణోపాసనకు మార్గం. జ్ఞానోదయం కొరకే మానవుడు నిరంతరం కృషి చేయాలి. అదే తపన, తపస్సు అవుతుంది. దానికే అమ్మలాంటి వెలుగు ప్రసరించినప్పుడు మనలోని అజ్ఞానాంధకారం, అల్పత్వం సమసిపోయి జ్ఞాన జ్యోతి ప్రకాశించి ముక్తికి సోపానమవుతుంది. ఆ అమ్మ యొక్క వాత్సల్యాంభోనిధిలో మునిగిన వారికి చీకటి అన్న ప్రసక్తే వుండదు. అంతా వెలుగే.

అవిద్యలో నుంచి విద్య, అజ్ఞానంలోంచి జ్ఞానం, శూన్యంలో నుంచి సృష్టి, జడంలోంచి చైతన్యం వచ్చినట్లే చీకటే వెల్తురుకు ఆధారమవుతుంది. ఆ వెలుగు వెంట మానవుడు పయనించి తన గమ్యానికి చేరుకోవాలి. ఆజ్యోతి ఉదయించినప్పుడు ఉదయభానుని కిరణాల కాంతితో మొదలై మధ్యాహ్నం మార్తాండుడి వలే వెలుగులు విరచిమ్ముతుంది.

ఇట్లు

అమ్మ చరణ సేవలో

అయ్యగారి కుసుమా చక్రవర్తి

అమ్మ కృపే ఈ (ఆ)కృతి

ఓం శ్రీ గురుభ్యోనమః

చిరంజీవి రామకృష్ణతో నాపరిచయం చాలా తక్కువ అతనికి అమ్మయందు గల భక్తి, ప్రగాఢ విశ్వాసమే మా పరిచయానికి కారణం. ఒక రోజు శ్రీ కుసుమ హరనాథ మందిరంలో కొంతమంది మహిళలతో, సంభాషించుచుండగా జిల్లెళ్ళమూడి అమ్మ ప్రసక్తి వచ్చింది. వారు లక్ష్మీపురం ఆనందాశ్రమానికి చెందిన భక్తులు. ఆశ్రమ కార్యక్రమాలు, సత్సంగాలు చిరంజీవి రామకృష్ణ ఆధ్వర్యంలో జరుగుతూ ఉంటాయట వారు చెప్పారు. రామకృష్ణ నోరు కదిపితే అమ్మగురించి ప్రసంగము, పాటలు పలుకుతూ ఉంటాడని చెప్పారు. నేను కూడా అమ్మయందు శ్రద్ధా భక్తులు కలిగి యుండటం వలన ఏకోదరుడుగా భావించి అతనిని చూడాలనే నాకోర్కెను వారికి తెలిపాను. మరుసటి రోజు రామకృష్ణ మానివాసానికి రావడం జరిగింది.

అమ్మచే నాకు ప్రసాదింపబడిన (అమ్మ వాడినవి) పాదుకలను దర్శింపజేశాను. ఆపాదుకులను శిరస్సుననిడుకొని ఎంతోసేపు తన్మయత్వంతో కనులు మూసుకొని బాహ్యస్మృతి కోల్పోయి ఆనందానుభూతి పొందినాడు. మరి ఆపాదుకా దర్శన స్పర్శ నాదులతో అమ్మ అతనికి ఏ సందేశాలను, ఆశీస్సులను అందించినదో, తాను ఏ అనుభూతిని పొందాడో అనూహ్యం.

అది మొదలుకొని అమ్మ పాదుకాదర్శనం కొరకు తపిస్తూ తరచూ వచ్చి దర్శన స్పర్శ నాదులతో తృప్తిచెంది మహదానందంతో వెళ్లే వాడు. ఒకరోజు వచ్చి చాలమంది అమ్మ వాక్యాలకు వివరణ వ్రాయవలసినదిగా

తనను కోరుతున్నట్లు నాతో చెప్పాడు. అప్పుడు అమ్మ సందేశం నాకు గుర్తుకు వచ్చింది. "నాచరిత్ర పండితుడైన పామరుడు వ్రాయడు! పామరుడైన పండితుడు వ్రాస్తాడు! అని. అదియును కాక అతడు భౌతికంగా అమ్మను దర్శించలేదు, స్వయముగా అమ్మ వాక్కులను వినలేదు. అయినా అందరి కోర్కెను మన్నించి కార్యోన్ముఖుడైనాడు. అందుకు తొలి మాటగా అమ్మ యొక్క మహావాక్యమొకటి వ్రాయ వలసినదిగా నన్ను కోరాడు అంతకు పూర్వమెప్పుడూ అమ్మ గురించి వ్రాయాలనే ఆలోచన నేను చేయలేదు. ఇది కూడా అమ్మ ప్రేరణగానే నేను భావించాను. "నేను నేనైన నేను" అని వ్రాసి ఇచ్చాను.

ఇంతకు పూర్వం ఎందరో ఎందరెందరో అమ్మ చరిత్రలు, వ్యాసాలు, కవితలు, రచనలు చేశారు. కాని అమ్మ నోట వెలువడిన మాటల మూటలైన మహావాక్యాలకు వివరణ వ్రాయలేదు. దేవిచే నాల్కపై బీజాక్షరములు లిఖింపబడి కవిగా మలచబడిన కాళిదాసు మహాకవికి సరిసాటి మన రామకృష్ణ. కారణం! అనితర సాధ్యమైన ఇంతటి మహత్కార్యాన్ని నిర్వహించి కృతకృత్యుడు కావడం కేవలం అమ్మ అనుగ్రహము, ఆశీస్సులు మాత్రమే. దైవం తలిస్తేనే తాను తలుస్తాడని అమ్మ ఏనాడో వక్కాణించినది కదా !

కొండముది రామకృష్ణ అన్నయ్యకు పునర్జన్మనిచ్చి తనకు ఉపకరణంగా నియమించుకున్న విషయం అమ్మ బిడ్డలందరికీ తెలిసిన నగ్న సత్యం. ఈ కర్తవ్య నిర్వహణకు ఉపయోగించి రామకృష్ణను కూడ చిరంజీవిని చేసింది అమ్మ. లేకుంటే అంతటి అవతారమూర్తియైన అమ్మ మహావాక్యాలకు వివరణ వ్రాయడానికి సామాన్యులకు సాధ్యమైన విషయం కాదు. అంతేకాక ఎందరో అవతార మూర్తుల, మహనీయుల సందేశాలను అనుభవాలను చాటిచెప్పి జీవిత పరమావధిని చేరడానికి

సూచన లిచ్చాడు. "**అవధూత గీతిక , సత్యానంద భజనావళి**" అను రచనలు చేసి భక్తుల కరకమలాలకందించాడు. ఇంతటి చిన్న వయస్సులో అంతటి జ్ఞాన సంపదను ఏ విధంగా ఆర్జించాడో ఊహలకందని విషయం. సద్గ్రంథ పఠనానికి గాని, మహనీయుల దర్శనాలకు గాని తగిన వయస్సు, సమయం అతనికి లేవు. ఎన్నో సత్కార్యాలు చేపట్టి, సత్సంగాలు నిర్వహిస్తూ దైవానుగ్రహానికి పాత్రుడై పెద్దల మన్నలను, సద్గురువుల ఆశీస్సులను పొందగలిగిన వైనం పరిపూర్ణమైన అమ్మ అనుగ్రహంతో కూడిన ఆశీస్సులుగానే వ్యక్తమౌతున్నది. ఒకరోజు తన గురువుగారైన శ్రీశ్రీశ్రీ యోగానంద స్వామీజీ ఒకరితో చెప్పారు రామకృష్ణ దర్శనం చేసుకోమని. వారు నాతో చెప్పారు. అప్పుడు నాకనిపించింది. ఇతను ఎంతటివాడు కాకుంటే అంతటి మహనీయులు అలా చెప్పి ఉంటారని. ఆనాటి నుండి చిరంజీవి రామకృష్ణయందు గౌరవభావం ఇనుమడించినది అని తెలియజేయడానికి గర్విస్తున్నాను. ఎందరో అతని ప్రసంగాలను విని ఆనందించడానికి, తరించడానికి, అనుసరించి, ఆచరించి ధన్యులు కావాలని ఆకాంక్షిస్తున్నారు. నాటి **ఆదిశంకరాచార్యుల** వారి నుండి నేటి **శ్రీ సత్యసాయిబాబా, శ్రీ ఎక్కిరాల కృష్ణమా చార్య** మొ॥లగు వారి సూక్తులను, సందేశాలను, మహత్తులను తన ప్రసంగాలలో విశదపరుస్తూ దశదిశల వెదజల్లు చున్నాడు. ఆధ్యాత్మిక స్ఫూర్తిని, ఆనందాన్ని అమృత వాహినిగా అందజేస్తున్నాడు.

"కాలువ నిండుగా ప్రవహిస్తున్నా దాహం వేస్తే దిగడానికి రేవు కావాలి" సముద్ర గర్భంలో నున్న సంపదను వెలికి తీయాలంటే జాలరులు, విజ్ఞానులు, నిపుణులు కావాలి, అమ్మ యొక్క పరిపూర్ణ అవతార ప్రజ్ఞను వెలికి తీసి, ముందు తరాల వారికి అందించి, పదిల పరచాలంటే కవులు, గాయకులు, పండితులు, రచయితలు ఇంకా ఎందరో ఉపకరణాలు కావాలి. శ్రీపాద గోపాలకృష్ణగారు, పన్నాల రాధాకృష్ణ శర్మ గారు, పి.ఎస్.ఆర్. ఆంజనేయ శర్మ గారు, డాక్టరు ప్రసాదరాయ కులపతి ఇంకా ఎందరో మహానుభావులు అమ్మ అవతార విశిష్టతను వేనోళ్ల చాటి చెప్పారు. చిరంజీవి రామకృష్ణ కూడా ఈ కోవకు చెందినవాడు. "అందరూ మహానుభావులే" అని తన బిడ్డలందరినీ ఉన్నత శిఖరాలనధిరోహింపజేసి, తన మాతృ వాత్సల్యాన్ని చాటిచెప్పి విశ్వజననిగా విఖ్యాతిగాంచినది అమ్మ. చిరంజీవి రామకృష్ణను అగ్రగణ్యులైన తన బిడ్డలలో ఒకనిగా ఒడి చేర్చుకొని మాతృవాత్సల్యామృతమును పంచి దివ్యాశీస్సులను ప్రసాదించవలసినదిగా వాగ్దేవియైన అమ్మను ప్రార్థిస్తున్నాను.

ఈకృతికి సమీక్ష వ్రాయవలసినదిగా రామకృష్ణ కోరగా ఏమి చేయాలో తెలియక అమ్మను వేడుకొన్నాను. ఆశ్రిత కల్పవల్లియైన అమ్మ సందేశానుసారం నాకు తెలిసినవి, విన్నవి, కన్నవి మీ ముందుంచాను. ఇది కేవలం అమ్మ ప్రేరణ మాత్రమే అని సవినయంగా విన్నవించు కుంటున్నాను.

నిరంతరము అమ్మస్మరణలో ..

శ్రీమతి సరస్వతి అప్పారావు

నివేదన

ఓం శ్రీ గురుభ్యోనమః

ప్రేమామృత వర్షిణి అయిన శ్రీ జిల్లెళ్ళమూడి అమ్మను భౌతికంగా ఉన్నప్పుడు నేను చూడలేదు. నేను 6వ తరగతి చదువుచున్నప్పుడు మా స్వగ్రామమైన 'జమదాల' (పార్వతీపురం మండలం, విజయనగరం జిల్లా)లో ఒక మాస్టారు గారి ఇంట్లో అమ్మ చిత్ర పటాన్ని చూడడం జరిగినది. అంతకు మించి అమ్మ గురించి అప్పటికి నాకేమీ తెలియదు. 1999 ఏప్రిల్ 11న ఏలూరులో నిర్వహించిన శ్రీ పాకలపాటి గురువు గారి పాదుకా మహోత్సవములో ప్రసంగించటానికి, గానం చేయడానికి నన్ను ఏలూరు వాస్తవ్యులు ఆహ్వానించారు. అప్పుడు అమ్మ భక్తులు శ్రీ రామకృష్ణ మాస్టారు గారు (ఏలూరు) పరిచయమయ్యారు. అమ్మ గురించి ఎన్నో విషయాలు కార్యక్రమము అనంతరం నాకు తెలియజేసారు.

1999 జూన్‌లో అనుకోకుండా జిల్లెళ్ళమూడి వెళ్ళడం జరిగినది. అమ్మను చూసినంత ఆనందాన్ని, అనుభూతిని కలిగించింది అక్కడి వాతావరణం. అక్కడి గోడలపైన వ్రాసియున్న అమ్మ సూక్తులను డైరీలో నేను వ్రాసుకుంటున్న సందర్భములో అమ్మ భక్తులు శ్రీ శ్యామ్ గారు పరిచయమయ్యారు. అమ్మ గురించిన ఎన్నో విషయాలు రాత్రి 8 గం.. నుండి 10 గం..ల వరకు తెలియజేశారు. తరువాత విశాఖపట్టణంలో ఉంటున్న కుసుమ అక్కయ్యగారి గురించి తెలియజేసి అడ్రస్ ఇచ్చారు. ఆ తరువాత కుసుమ అక్కయ్యగారితో నాకు పరిచయ మేర్పడినది.

ఒకరోజు ఆశ్రమ భక్తులతో కలసి ''అమ్మ సినిమా'' చూడటానికి కుసుమ అక్కయ్య గారింటికి వెళ్ళాను. ఆ సినిమా చూస్తున్నంతసేపు ప్రత్యక్షంగా అమ్మ సన్నిధి అనుభవించినంత దివ్యానుభూతి కలిగి వెంటనే అమ్మ గురించి 'జయ జయ జననీ' అనే పాట వ్రాయటం జరిగింది. సత్సంగములో సందర్భానుగుణంగా అమ్మ గురించి, అమ్మ సూక్తులు గురించి ప్రస్తావన వస్తూ ఉండేది. ఆ వివరణ చాలా మందికి నచ్చినది ఎంతో మంది అమ్మ సూక్తులకు వివరణ వ్రాయమని నన్ను కోరారు. అంతటి అర్హత, భాషా పరిజ్ఞానము నాకు లేదని చెప్పి ఊరుకున్నాను.

అసంకల్పితంగా ఈ మధ్యనే జూన్ నెలలో అమ్మ పూర్ణ అనుగ్రహానికి నోచుకొన్న సరస్వతి అక్కయ్యతో నాకు పరిచయ మేర్పడినది. అమ్మ ఆమెకు ప్రసాదించిన పాదుకలను దర్శించడం నా అదృష్టం. వాటిని స్పృశించిన పిమ్మట అలౌకికమ్మైన దివ్య చైతన్య ప్రవాహం నాలో సాగినది. ఇది మాటలకు అందని దివ్యానుభూతి. ఇది అమ్మ ప్రసాదించిన భాగ్యం. మాటల సందర్భములో చాలామంది అమ్మ సూక్తులకు వివరణ వ్రాయమంటున్నారన్న సంగతి సరస్వతి అక్కయ్యకు నేను చెప్పగా, ''ఇది అమ్మ సంకల్పమే, అమ్మ నీచే చేయించుకుంటుంది ప్రారంభించు'' అని నుదుట తిలకందిద్ది, ఆశీర్వదించి ''నేను నేనైన నేను'' అనే సూక్తిని వ్రాసి ఇవ్వడం జరిగినది. ఈ విషయాన్ని కుసుమ అక్కయ్యకు తెలియజేస్తే చాలా సంతోషించి ''ఎవరైనా అమ్మ సూక్తులకు వివరణ వ్రాస్తే బాగుండును'' అన్న సందర్భములో ''అమ్మ నిన్ను ఎంచుకుంది. తప్పకుండా వ్రాయు! ఇది అమ్మ ప్రేరణే!'' అని దీవించి 51 సూక్తులను నాకు పంపించారు. ఈ విధముగా నాలో ప్రేరణ కలిగించి అంతర్వర్తినియై నన్ను ఒక ఉపకరణము చేసికొని అమ్మ తన సూక్తులకు

తనే వివరణ వ్రాయించుకుంది. ఇంతటి అనుగ్రహాన్ని ప్రసాదించిన 'అమ్మ'కు అనంతకోటి ప్రణామాలు, అమ్మగురించి, అమ్మ దివ్యత్వము గురించి తెలియజేసిన శ్రీ రామకృష్ణమాష్టారికి (ఏలూరు), శ్రీ శ్యామ్ గార్కి వందనములతో కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ప్రేమతో తనదరికి చేర్చుకొని, తత్వ జ్ఞానాన్ని ప్రబోధించి, సత్యాన్ని ఉపదేశించి, అమృతాశీస్సులు ప్రసాదించి, నీవు కలం పడితే గురువు బలమిస్తారని దీవించి, నా జీవితాన్ని దీపింపజేసిన నా గురుదేవులు **పూజ్య శ్రీ యోగానంద స్వామి** వారికి **వందన చందనాలర్పిస్తున్నాను.** ప్రేమతో నన్ను ఆశీర్వదించి, తాత్విక జిజ్ఞాసను కలిగించిన అమ్మ **(మాతాజీ)** కు, శుభాశీస్సులు అందించిన **శ్రీ కూర్మానందస్వామి** వారికి నా హృదయ పూర్వక నమస్కారములు తెలియజేస్తున్నాను. అమ్మ చరణ సన్నిధిలో వికసించిన ''కుసుమ''మై, తన గ్రోలి తన హృదయ గదిలో దాచుకున్న ''మధుర స్మృతుల'' మకరందాన్ని ''దివ్యానుభూతుల'' నవ్యరుచులను, ''అనసూయ వ్రత'' ప్రసాదాన్ని ''అమ్మ సచ్చరిత్రామృతాన్ని'' గ్రంథాల రూపంలో వడ్డిస్తున్న ధన్యురాలు కుసుమ అక్కయ్య. అమ్మ సూక్తులకు వివరణ వ్రాయమని ఆశీర్వదించి, 51 సూక్తులను నాకు పంపించి, తను, తన కుటుంబ సభ్యులు సర్వ విధములా ఈ గ్రంథముద్రణకు సహకరించారు. ఈ గ్రంథానికి **''అమ్మ వాక్య వైభవం''** అన్న పేరుతో ''ముందు మాట'' వ్రాసి నందులకు కృతజ్ఞతా పూర్వక నమస్కృతులర్పిస్తున్నాను.

అమ్మను ఆర్తితో దర్శించవచ్చిన సరస్వతి అక్కయ్యను అక్కున చేర్చుకొని, కంటతడిని తుడిచి, నీకెందుకు భయమమ్మా 'నేను నీతో, నీలో ఉంటానని అభయమిచ్చి, తన కరుణా కరంతో దీవించి, తన చరణాలను సరస్వతి అక్కయ్య శిరస్సుపై ఉంచి, అపార అనుగ్రహాన్ని ప్రసాదించింది అమ్మ''. అంతటి కృపను పొందిన సరస్వతి అక్కయ్య మృదు భాషిణి, నివురు గప్పిన నిప్పులా నిగూఢంగా ఉంటూ, అమ్మ స్మరణలో జీవనయానం సాగిస్తున్న అదృష్టవంతురాలు. నన్ను పిలిపించి అమ్మ పాదుకలను నా శిరస్సుపై ఉంచి విజయోస్తు! ''అమ్మ సూక్తులకు వివరణ వ్రాయు ! ఇది అమ్మ సంకల్పమే నీచే వ్రాయించుకుంటుంది'' అని దీవించి, ''నేను నేనైన నేను'' అనే అమ్మ సూక్తిని వ్రాసి యిచ్చి, నాలో ప్రేరణ కలుగజేసి, ఈ గ్రంథానికి **''అమ్మ కృపే ఈ (ఆ)కృతి''** సమీక్షను వ్రాసి యిచ్చినందులకు సరస్వతి అక్కయ్యకు మరియు వారి శ్రీవారైన శ్రీ అప్పారావు గార్కి సర్వదా కృతజ్ఞుడను.

చల్లని దీవెనలిచ్చి, నా నడకలో సహకరిస్తూ, ప్రేమాభిమానాలతో నన్ను ఆదరిస్తున్న గురు బంధువులకు, ఆర్యులకు, విజ్ఞులకు, సోదరీ సోదరులకు, ఈ గ్రంథ విషయములో సర్వ విధముల సహకరించిన సోదరులు B. అప్పారావు మరియు R.Ch. పెంటం నాయుడు గార్లకు నా హృదయ పూర్వక ధన్యవాదములర్పిస్తున్నాను. మరియు ఈ గ్రంథాన్ని అందంగా ముద్రించి ఇచ్చిన ధర్మతేజ ప్రింటింగ్ వర్క్స్ అధినేత శ్రీ బి. వెంకటరావు గార్కి వినమ్రతతో కృతజ్ఞతాభివందనములర్పిస్తూ, మీ నిత్యాశీస్సులనాశిస్తూ ...

మీ

రామకృష్ణ

నేను నేనైన నేను

ఓం శ్రీ గురుభ్యోనమః

ఆకారము లేని అనంత పరబ్రహ్మము (పరమాత్మ) తన విలాసం కోసం అవని రూపుదాల్చి అలరారుచున్నది. అదే సత్యమైన నేను. అణువణువున నిండి అఖండమై భాసించే దివ్యత్వమే ఆ నేను. అన్ని జీవులలో ప్రాణశక్తిగా, నిగూఢంగా ఉంటూ ప్రతీ కదలికలలో ప్రకటితమౌతూ ఉన్నదే ఆ నేను. అది ఏకం, పూర్ణం, అనంతం. ఆ పరబ్రహ్మమైన ''నేను'' సకల జీవరాశిలో, దేహోపాధులలో ఉన్న ''నేను''గా (ఆత్మగా) ప్రకాశిస్తుంది. సకల ఇంద్రియాలకు ఆధారమైఉంది. మేనుకు, ఆపాదించే ''నేను అహంకారం''. అనంతత్వమైన ఆ ''నేనే'' నాలో ''నేను''గా భాసిస్తుందన్నది సత్యం. అది జ్ఞానం, పూర్ణ జ్ఞానం. అంతేకాని ఆ ''నేను''ను మేనుకు అన్వయించి పరిమితం చేయడం అజ్ఞానం.

శ్రీ కృష్ణుడు ''నేనే'' సర్వం అన్న ''నేను''. శ్రీరాముడు ''నేనే ప్రత్యగాత్మ'' స్వరూపుడను అన్న ''నేను'', క్రీస్తు నేనే మార్గము, నేనే జీవము, నేనే సత్యము అన్న నేను, పూర్ణజ్ఞానులైన మహనీయ మూర్తులు అంటున్న నేను, అమ్మ అంటున్న ''నేను నేనైన నేను'' ఒక్కటే. అదే సచ్చిదానంద స్వరూపమైన సత్య నేను. అమ్మ అనే నేను దేహోపాధులలో నేనుగా నేనై సాక్షిగా నిలిచిన విశ్వచైతన్యమైన నేను. అదే అంతర్యామిగా, ఆధారంగా ఉంటుంది. ఆ నేను (ఆత్మ) యందు ఆరోపించబడింది ఈ మలిన నేను, ఈ మిథ్యానేను. ఇది దేహాత్మ బుద్ధిని కలిగించి, అసలు స్వరూపమైన ''నేను''(ఆత్మ)ను మరిపించి, పెత్తనం చెలాయించి దుఃఖితున్ని చేస్తుంది ఈ నేను. ఇదే మనస్సు, అహంకారం. నిజగురు బోధచే మేల్కొన్న నాడు ఈ ''నేను'' తన ఉనికిని కోల్పోతుంది. అప్పుడు ఉన్నదే ఆ ''నేను'' అదే సత్యం.

శ్రీ పరాత్పరికీ జై !!

తిథులు విధిని మార్చలేవు

"తను చేసిన కర్మమే జీవునకు విధి" అన్నది శృతి వాక్యము. జన్మ కర్మాను భవానికి వచ్చింది. కర్మను అనుభవించక తప్పదు, తప్పించు కుందామన్నా తప్పనిది కర్మఫలం. అందుకే రమణ మహర్షి ఇలా అన్నారు "ఏది జరిగవలసి ఉన్నదో అది జరుగక మానదు ఎంతమంది అడ్డుపడినా అది ఆగదు ఏది జరుగకూడదో అది ఎంతమంది ప్రయత్నం చేసినా జరుగదు". పాంచభౌతిక దేహాన్ని ధరించిన తరువాత కర్మానుభవం తప్పదు. అసలు దేహం వచ్చింది అందుకే. రాముడు రాక్షస సంహారంగావించి ధర్మ బద్ధమైన, శాంతియుతమైన పాలన అందించడానికి వచ్చాడు. ఆ దేహం ద్వారా తొలుత రాక్షసంహారం గావించవలసి వున్నది. కనుకనే పట్టాభిషేకానికి ముహూర్తం నిర్ణయించినా దాని ప్రకారం పట్టాభిషిక్తుడై రాజ్యమేలలేదు. అరణ్యాలకు పయనమయ్యాడు రాముడు. తిథి ప్రకారం పట్టాభిషిక్తుడు కాలేదు. విధి ప్రకారమే అరణ్యాల కేగి రాక్షససంహారం చేసి, అయోధ్యకు వచ్చి, ప్రజాపాలన గావించి ధర్మాన్ని ప్రతిష్ఠించాడు. సిద్ధార్థుని పెంచి విద్యా వంతున్ని చేసి, అస్త్ర శస్త్ర విద్యానిపుణిడిగా తీర్చిదిద్దించి రాజ్య మేలించాలని ముహూర్తం పెట్టించి విద్య నేర్పించాడు శుద్ధోధనుడు కానీ అలా జరగలేదు. ఆ తిథి, ముహూర్తముల ప్రకారం జరిగి రాజ్యమేల లేదే! సంసార త్యాగం చేసి యోగిగా మారి బుద్ధు డయ్యాడు. కనుక జరుగవలసినది విధి ప్రకారమే జరుగుతుంది గాని తిథి ప్రకారం కాదని అమ్మ చెప్పిన సత్యం. జరగవలసినది జరుగకమానదు కనుక జరుగుచున్న దానిని అంగీకరించడమే దివ్యజీవనము.

శ్రీ పరాత్పరికీ జై !!

విధి వర్షం లాంటిది కొందరికి అనుకూలం మరికొందరికి ప్రతికూలం

సకల జీవుల మనుగడకు అవసరమైనది జలము. జలము లేనిదే జీవనము లేదు. అటువంటి జలాన్నిచ్చే వర్షము కురిస్తే కొన్ని కార్యక్రమములు బాహ్యంగా జరిపినవారికి అంటే వివాహాది శుభకార్యములు, బహిరంగ ప్రసంగాది కార్యక్రమములు నిర్వహించే వారికి వర్షం ప్రతికూలిస్తుంది. అదే వర్షం రైతుకి హర్షాన్ని కల్గిస్తుంది. తాను నమ్మిన నేల తల్లి ఒడిలో విత్తులు చల్లి పంటలు పండిస్తాడు. మండుటెండకు ఎండిపోయి క్షీణ స్థితిలో నున్న మొక్కలు నూతన జీవనాన్ని వర్షం కురవటం వలన పుణికి పుచ్చుకుంటాయి. చెట్లు క్రొత్త చిగురులు తొడిగి పుష్పాలతో శోభిల్లుతాయి. ఆధ్యాత్మిక పరిభాషలో ''విధి'' అనగా జీవుడు చేసిన ''కర్మ'' అని అర్ధం. ఆ కర్మ కొందరికి ఆనందాన్ని మరికొందరికి అవరోధాన్ని కల్గిస్తుంది. ఉదాహరణకు రాముని అవతారం సత్కర్మలనాచరించే సాధుసజ్జనులకు, ఆర్తితో ప్రార్థించే భక్తులకు, సాధకులకు, తపోధనులకు ఆనందాన్నిచ్చి, ధర్మబద్ధమైన జీవన విధానానికి నాంది పలికితే, రావణాది రాక్షసులకు ఆయన అవతారం తమ ఆగడాలకు, తమ అధికారదుర్వినియోగానికి అవరోధమై ప్రతికూలించింది. అదే రావణుని తమ్ముడైన, సంస్కారవంతుడైన, విభీషణునికి రామనామము, రామావతారము అనుకూలమైంది. రాముని రాకవలన రావణుడు సంహరింపబడితే అతని తమ్ముడైన విభీషణుడు రామానుగ్రహాన్ని పొంది పట్టాభిషిక్తుడయ్యాడు. ధ్యానాది సత్కర్మల నాచరించడం వలన చంచలమైన మనస్సు స్థిరత్వాన్ని పొంది ఆనందానికి చేరువవుతుంది. అంటే మనోవృత్తులకు ధ్యానాదికర్మలు ప్రతికూలమైనా వాటి నిర్మూలనం వలన ఆనందం సంప్రాప్తమౌతుంది. కనుక విధి అందరికీ అనుకూలం కాదు, అలాగని అందరికీ ప్రతికూలం కాదని అమ్మ భావన.

శ్రీ పరాత్పరికీ జై !!

దేవులాడినా దొరకనివాడు దేవుడు

దైవం తన ఆటకోసం అవనిరూపుదాల్చింది. పంచ మహా భూతములైన ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృధ్వి తానే అయ్యింది. ఆకాశం తానై మేఘానికి అవకాశమిచ్చింది. మేఘంలో ఆర్ద్రత ఇమిడి అవసరాన్ని బట్టి చినుకైకురిసింది కూడా ఆపరమాత్మే. సూర్యుడు తానై వెలుగును వేడిమిని ప్రసాదిస్తున్నాడు, చంద్రుడు తానై ఆహ్లాదం కలిగించే చల్లని వెన్నెలై తాపాన్ని తొలగిస్తున్నాడు. ప్రాణవాయువై దేహొపాధులలో నిలిచి చలనాన్ని, శక్తిని ప్రసాదిస్తున్నాడు. అగ్నితానై వేడిమిని ప్రసాదించి ఆహారాన్ని ఉడికిస్తున్నాడు. రుచులను అందిస్తున్నాడు. మలినాలను, కళేబరాలను దగ్ధం చేసి విభూతిగా మారుస్తున్నాడు, జఠరాగ్నిగా దేహంలో ఉండి తిన్న ఆహారాన్ని జీర్ణం చేస్తున్నాడు. జీవుల దేహాలకు, చెట్టుకు, చేమలకు కావలసిన వేడిమిని, నిగూఢంగా దేహొపాధులలో ఉండి ఆరోగ్యాన్ని అందిస్తున్నాడు. జలమై జీవశక్తిని ప్రసాదిస్తున్నాడు, దాహం తీరుస్తున్నాడు, సశ్యాలను సంరక్షించి పంటలను జీవకోటికి అందిస్తున్నాడు. భూమి తానై 84 లక్షల జీవరాశికి ఆధారమై, ప్రగతి సాధించడానికి అవకాశమై అలరారుచున్నాడు, ఆయనకానిది, ఆయన లేనిది ఏమీలేదు. అణువణువుతాను, ఆత్మతాను, సాక్షితాను, కదలికలకు ఆధారమైన చైతన్య శక్తి తాను, సకల జీవస్వరూపుడు అయిన పరమాత్మ తనే సృష్టిగా ప్రకటమై, తానే ఉంటే అజ్ఞానంచేత, అహంకార వృత్తుల చేత ఆయన మనకంటే దూరంగా, వేరుగా ఉన్నాడనే మనోభావంచే, మనం దేహాభిమానంతో కూడుకొని ఉన్నాము. కనుక ఆయనకు మనలాగే దేహముంటుంది, అలాగే ఉండాలి అనే భ్రమచేత ఆకారాలు కల్పించి స్థలానికి, కాలానికి, వస్తువుకు పరిమితం చేసి దైవాన్ని చూడాలని కోరుకుంటే ఆ దర్శనమెలా

అవుతుంది ! ద్వంద్వభావంచేత ఆయన వేరుగా ఉన్నాడనుకున్నంత వరకు ఆయన మనకు తెలియడు, తెలియబడడు. ఎందుకు ? ఆయన నీలో నేనుగా (ఆత్మగా, ఉన్నాడన్న నిజం తెలియనంత వరకు, అన్ని రూపాలు తనవన్న భావం కల్గనంతవరకు ద్వయ భావం రహితమై సర్వత్రా దైవభావం కల్గనంత వరకు ఎంతవెదకినా జపతపాలు చేసినా, సర్వ సంపదలను త్యాగం చేసినా, దొరకదు దైవం. అది వేరుగా లేదు కనుక. ఉన్నది దైవం తప్ప అన్యం లేదు. అది తనలో ఆత్మ (నేను)గా ఉంది. ఈ జ్ఞానం కలిగి ఆచరణాత్మకమైన ఆత్మానుభవం కలగనంతవరకు దేవులాడినా దొరకడు దైవమని అమ్మ మాటల అర్థం.

శ్రీ పరాత్పరికీ జై !!

చీకటే వెల్తురుకాధారం

లోకమంతా చీకటి అలుముకున్నప్పుడు త్రోవ కనిపించక, ఎటుపోతున్నామో తెలియక వెలుగుకై ఆరాటపడక తప్పదు. లేకపోతే ఆ పయనం అగమ్యం గోచరమవుతుంది. దీపంకై వెదకక తప్పదు. వెదకటంలో చిరుదీపమైనా దొరకక తప్పదు. అప్పుడే ఆ దీపం తన వెలుగుతో చీకటి తెరత్ఫంచి త్రోవజూపుతుంది. అప్పుడు ప్రయాణం సులభమవుతుంది. నడుస్తున్న కొద్దీ గమ్యం చేరువవుతుంది. చీకటిలో మునిగి ఉన్న పరిసరాలు వెలుగు సోకగానే కనిపిస్తాయి. ఆహ్లాదాన్ని కలుగజేస్తాయి. బాటసారికి ధైర్యాన్నిస్తాయి. ఏ తడబాటు లేకుండా గట్లను, చెట్లను, వాగును, ఏరును దాటి తను చేరవలసిన చోటుకు చేరుకుంటాడు. ఇదే విధంగా బాధ్యతలతో, భారంతో, జీవనాన్ని సాగిస్తూ, వపోల్లుతూ, నిట్టూరుస్తూ, దుఃఖిస్తున్న జీవునికి జీవితం అగమ్యగోచరంగా తోస్తూ ఉంటుంది. శాంతి లేక సుఖం లేక రోదిస్తూ ఉంటాడు.

విషయలోలుడై విషయాల కోసం ప్రాకులాడి అవి ప్రాప్తంకానప్పుడు విచార గ్రస్తుడై బాధపడుతుంటాడు. ఆశలు పెంచు కుంటూ ఉంటాడు, మమకారంతో, వ్యామోహంతో శాంతిని పోగొట్టు కుంటున్నాడు. సుఖానికి పొంగి, కష్టానికి కృంగు చున్నాడు, కానీ శాశ్వితానందం కావాలనే తపన పడుతుంటాడు. అది ఎక్కడ లభిస్తుందో తెలియక విషయాలలో వెదకటం ప్రారంభిస్తే వీటిలో దొరకనప్పుడు తన జీవితం చీకటిలా ఉందని వేదన చెందుతాడు. చీకటితో పోరాటం సల్పి వెలుగుకై ఆరాటపడటం ప్రారంభించిననాడు, రాగద్వేషాలు, ఈర్ష్య అసూయలు, మమకారం, దేహాభిమానం ఇవన్నీ కలిసి చీకటిగా పరిణమించి శాంతి లేకుండా చేస్తున్నాయనే అవగాహన కల్గినప్పుడు, కాంతికై, శాంతికై, తపన పడిననాడు, ''అమ్మ'' లాంటి వెన్నెల దీపం జాలితో దరిచేరి, ప్రేమతో నిమిరి అజ్ఞాన తిమిరాన్ని దూరంచేస్తుంది. సత్యవస్తువును చూపిస్తుంది. అజ్ఞానమనే చీకటి అలుముకున్నప్పుడే వస్తువు కానరాక దేవులాడటం ప్రారంభ మౌతుంది. ఆ దేవులాటలో జ్యోతిర్మయ రూపం దర్శనమిస్తుంది. యదార్థం గోచరమౌతుంది. చీకటి ఉన్నంతవరకు వెలుగు విలువ తెలియదు, వెలితి తీరదు, దాని నుండి బయటపడే ప్రయత్నంలో ప్రాతః సంధ్యా రాగ మాధుర్యాన్ని చవిచూసి సూర్యోదయాన్ని గాంచెదము. నిర్గుణత్వమే త్రిగుణాత్మకమైన ప్రపంచానికి ఆధారమైంది. అందుకే కాబోలు అమ్మ చీకటే వెలుగుకు ఆధారమన్నారు. అజ్ఞానమనే తిమిరం జ్ఞానమనే సత్యోదయానికి ఆధారమౌతుంది ఆ జ్ఞానోదయం కోసమే జీవన పోరాటం. అందుకే గదా కోరుకుంటున్నాము అమ్మలాంటి దీపాల సహకారం.

శ్రీ పరాత్పరికీ జై !!

అనుకున్నది జరగదు తనకున్నది తప్పదు

అనుకున్నది జరిగినప్పుడు ఆనందం. అలా జరగనప్పుడు దుఃఖం ఇదే మనిషి మనోలక్షణం. ఆశలు, ఆశయాలు, ప్రణాళికలు, ప్రయత్నాలు ఎన్ని చేసినా ఫలితం తన చేతిలో లేదు. తన గతకర్మపై ఆధారపడియున్నది. ఆకర్మఫలాన్నే అందిస్తుంది దైవం. అంతేకాని మనం ఊహించినదంతా నెరవేరదు. అశోకుడు తన సోదరులను హతమార్చాడు. గొప్ప భారత సామ్రాజ్యాధినేతగా పరిణమించాలను కున్నాడు, అప్పటికి ఆయన ఆశయానికి తగ్గ ధైర్యముంది, సాహసముంది, వీరత్వముంది, అలాగే జయిస్తూ వచ్చాడు కానీ ! కళింగయుద్ధం తన ధృడ సంకల్పాన్ని, మనో నిశ్చయాన్ని తారుమారుచేసింది, ఆలోచింపచేసింది. యుద్ధానంతరం ప్రజా జీవన మెలా ఉంటుందో పరిశీలింపజేసింది. తనని పశ్చాఃతాపానికి గురిచేసింది. తత్ఫలితంగా రజోగుణ ప్రభావపూరితమైన యుద్ధ కాంక్షనుదునుమాడింది. ధర్మ మార్గం వైపు అడుగులు వేయించింది. భౌద్ధ మతావలంబిగా చేసింది, ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టించింది ఆ యుద్ధపలితం. కానీ ఆశోకుడు అనుకున్నట్లు జరుగలేదు. ఇప్పుడు మనం అనుభవిస్తున్నది. భోగమైనా, భాగ్యమైనా, ఆరోగ్యమైనా, అనారోగ్యమైనా, మరేదైనా గత ఫలితమే కాని ఇప్పటిది కాదు. అది అనుభవానికి రావలసియున్నప్పుడు మనకు ప్రేరణ కలిగించి, ప్రయత్నం చేయించి ఫలితాన్ని అందజేస్తుంది. ఇప్పుడు మనం అనుభవిస్తుంది ప్రారబ్ధం. అందుకే ప్రారబ్ధాన్ని ఎవ్వరూ తప్పించుకోలేరు అన్నది శృతి వాక్యం. దీనిని అనుభవిస్తూ, సత్కర్మలనాచరిస్తూ ఉంటే, ప్రారబ్ధానుభవం

తరువాత సత్కర్మల యొక్క సత్ఫలితాన్ని అనుభవించ గలుగుతాము. తాను తలపెట్టిన దేదైనా జరిగితే తన ప్రతిభ అనుకుంటాడు మనిషి, కానీ తలపెట్టిన ప్రతీదీ జరగనప్పుడు, నా "కర్మ" అంటాడు, అంటే జయాపజయాలు, తన ఇచ్ఛ ప్రకారం జరగవని తనకున్నదే తనకు జరుగుతుందని, తనకులేనిది తనకు జరగదని అమ్మ ప్రబోధించారు. మన ప్రారబ్ధంలో ఉంటే మనం వద్దనుకున్న మనకు అందక మానదు. లేకుంటే ఎన్ని చేసినా అది అనుభవానికి రాదు. అన్న సత్యాన్ని గ్రహించి సర్వవేళలలో దైవంపై భారం వేసి బాధ్యతలను నెరవేర్చుకోవాలి.

శ్రీ పరాత్పరికీ జై !!

ఇది ఏమిటి ? పంచాక్షరి

బాహ్యానికి "ఇ-ది-ఏ-మి-టి" అనే పదములో ఐదు అక్షరాలున్నాయి. అంటే పంచాక్షరాలన్నమాట. క్షరము కానిదే అక్షరం కనుక ప్రతీ అక్షరం నాశరహితమైనది.

అమ్మ చెప్పిన పంచాక్షరి యొక్క భావం నిగూఢమైనది. ఆకాశవము, వాయువు, అగ్ని -జలవము-పృధ్వీ మొదలగునవి పంచభూతములు. వీటి ఐక్యము వలననే సకల జీవులు ఆవిర్భవించినవి. ఈ పంచ మహాభూతములకు ఆధారం పరమాత్మ. ఆయననే సదా శివుడని కీర్తిస్తున్నాము. అంటే ఎల్లప్పుడూ ఉండువాడు అని అర్థం. సర్వకాలముల యందు ఉండువాడని స్పష్టంగా తెలుస్తున్నది. అతనే శంకరుడని కూడా పిలువబడుచున్నాడు. "శంకరోతి శంకర" అన్నది శాస్త్ర నినాదం "శం" అనగా శుభము, ఆనందము అని అర్థం. అంటే

సుఖాన్ని, ఆనందాన్ని ప్రసాదించువాడే శంకరుడని స్పష్టమగుచున్నది. పంచాక్షర మహామంత్రము న-మ-శి-వా-య అను అక్షరములతో కూడుకున్న మంత్రం 'న'భూతత్వాన్ని, 'మ' జలతత్వాన్ని, 'శి' అగ్నితత్వాన్ని, 'వా'వాయుతత్వాన్ని, 'య' ఆకాశతత్వాన్ని తెలియజేస్తున్నది. 'భూ'తత్వం సకలా జీవుల మనుగడకు ఆధారంగా ఉండి విత్తులను ధరించి, పంటలను, ఫలాలను ఔషధాలను అందిస్తున్నది. చర్మము-మాంసము-ఎముకలు భూతత్వానికి సంభంధించినవి. జలము-జీవనాధారంగా ఉంటూ సకల జీవులకు జీవశక్తిగా పని చేస్తున్నది, రక్తము, శ్లేష్మము, అమ్లము జలతత్వానికి సంబంధించినవి. అగ్ని వెలుగును వేడిమిని అందిస్తూ ఉన్నది. జీవులలో జఠరాగ్నిగా ఉంటూ జీర్ణ క్రియ సల్పుచున్నది. వాయువు ప్రాణి కోట్లకు, ప్రాణవాయువుగా ఉపయోగపడుతూ ప్రాణులలో రక్తప్రసరణకు, స్పర్శనెరుగుటకు, విసర్జన క్రియకు ప్రాధాన్యతను వహిస్తూ పంచప్రాణాలుగా మనలో పనిచేస్తున్నది. ఆకాశము మేఘాలకు, గ్రహగోళాదులకు అవకాశమిచ్చి విశ్వానికి మహోపాధిగా నిలచినది. కనుక మనలో ఉన్న జ్ఞాత ఆకాశతత్వానికి చెందినది, పంచభూతాత్మకమైనప్రపంచమే పంచాక్షరి - పంచాక్షరే పరమ శివుడు. సకల భూతములకు నాధుడు, సకల భూతనివాసి శివుడు కనుక అతనిని భూత నాధుడన్నారు. అతడే అంతటా, అన్నిటా, అందరిలో, సాక్షిగా, ఉన్నాడు అందుకే ఇది ఏమిటి ? అని అమ్మనడిగితే పంచాక్షరి అన్నారు. కారణం శివుడే పంచభూతములు కనుక, పంచభూతములు తనవే కనుక. ఆయన తప్ప వేరేమీ లేదని అమ్మ చెప్పిన పంచాక్షర సత్యం.

శ్రీ పరాత్పరికీ జై !!

అసలు ఇది ఏమిటి ? - అష్టాక్షరి!

అసలు ఇదేమిటవమ్మా అంటే అష్టాక్షరి అన్నారు అమ్మ. అ-స-లు-ఇ-ది-ఏ-మి-టి మొత్తం ఎనిమిది అక్షరములు ఈ వాక్యములో ఇమిడియున్నవి. అష్టాక్షరి మహామంత్రం నారాయణ తత్వాన్ని తెలియజేస్తున్నది. ''ఓం నమోనారాయణాయ'' అన్నది అష్టాక్షరీ మహామంత్రము. ఇందులో ''ఓం'' అనునది సత్వరజస్తమో గుణ నిర్మితమైన విశ్వానికి, సృష్టి, స్థితి, లయలకు మూలమైన త్రిమూర్తిత్వానికి మూలమైనది. సర్వభూతాంతరాత్మగా, పనిచేయుచున్నది పరమాత్మయే, అతడు ఆది మధ్యాంతములు లేనివాడు. అతడే ఓంకార స్వరూపుడైన ఆదినారాయణుడు ఆయనే ఈ ప్రపంచంగా ప్రకటమయ్యాడు ఆయనకు అన్యంగా ఏమీలేదు. ఆయన అన్యంగా లేడు, అనన్యమైయున్నాడు. పదార్థము, పరమాణువు, అందులో ఇమిడి ఉన్న చైతన్య శక్తి తానే కనుక ఆయన చైతన్య స్వరూపుడు. సర్వత్రావ్యాపించి ఉన్నవాడు, అంతరమందు, బాహ్యమందు తానే ఆత్మగా పరమాత్మగా వ్యవహరిస్తున్నాడు,తానే గురువై వస్తాడు, సత్య జ్ఞానాన్ని ఎరిగిస్తాడు, మాయ నుండి విడుదల చేస్తాడు, తన స్వరూపజ్ఞానాన్ని కలిగిస్తాడు, విముక్తుడ్ని చేస్తాడు. ఆ పరమాత్మ తనకు తానే సమస్తమై ఆడుకుంటున్నాడు, ఆడిస్తున్నాడు ఆది నారాయణుడై. నేననే అహంభావంచేత ఈ నిజాన్ని నిజంగా గుర్తించి నడుచుకొనక దేహభ్రాంతి చేత సుఖ దుఃఖాలను అనుభవిస్తున్నాం. వాడు వేరుగా ఉన్నాడని తలుస్తున్నాం. నిజమైన అవగాహన కల్గిన నాడు భేదవర్జితమై సత్యం గోచర మౌతుంది. జీవన ప్రయాణం సులభ మౌతుంది. జీవితం బృందావనమై ఆనంద నిలయమౌతుంది.

శ్రీ పరాత్పరికీ జై !!

హద్దులేమడి

"మా గురు వర్యులైన" **పూజ్య శ్రీ స్వామి యోగానందగారు** (భీమిలి) ఒక సారి ఏకత్వాన్ని గురించి ప్రబోధిస్తూ ఇలా అన్నారు. సర్వ జీవాధారమైన భూమిని నీవెవరు ? అని ప్రశ్నిస్తే నేను భూమినంటుంది కానీ .... నేను భారత భూమిని అనదు. అమెరికాలో అడిగినా, చైనాలో అడిగినా, ఎక్కడ అడిగినా "నేను భూమి"నే అంటుంది గాని, విశాఖపట్నం భూమినని, ఆంధ్రా భూమినని, మహారాష్ట్ర భూమిని అని అనదు. కారణం తాను ఏకమై యున్నది కనుక తనకు భేదం లేదు, స్వార్థం లేదు, కుటిలత్వం లేదు. ప్రాణికోట్లకు ఆధారంగా ఉంటూ, సహనంతో, వ్యవహరించడం తప్ప తనకు అన్యం తెలియదు. అదే తన ఏకత్వ ధర్మం అని చెప్పారు" మరి మనమో ... ? నాది, మాది, అనే భేద బుద్ధి చేత విభజనను కల్పించు కుంటున్నాం. సౌలభ్యం కోసం ఇలా చేయటం తప్పు కాదు కాని ధనిక, బీద, హెచ్చు తగ్గులనే విభేదాలు సృష్టించుకొని కలహించుకుంటూ, వైషమ్యాలు మనకు మనమే సృష్టించుకొని వినాశనానికి నాంది పలుకుచున్నాము. ఒకరి ప్రాంతాన్ని ఒకరు ఆక్రమించు కోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాము. తాత భూమిని పంచి గట్టేసి స్వంతమడిని చేసుకుంటున్నాము ప్రక్క మడికి నీరు ఇవ్వడానికి, సోదరుడు బాగుపడటానికి ఇష్టపడని కుటిల-గుణాన్ని పెంచుకుంటున్నాం. ఇదేమడి, ఇదే పరిధి, మన దేహాలు పోయినా భూమి అలాగే ఉంటుంది. మరి దైవమార్గానికొస్తే మతాలు మతాలు కలహించుకుంటున్నాయి. మూలాధారమైన పరమాత్మ యొక్క ఏకత్వాన్ని, సమత్వాన్ని, మరచి, విడచి మా మతం గొప్పంటే మా మతం గొప్పది అంటున్నాము ఇదే మతోన్మాదం. తమ తమ అభిప్రాయాలతో అడ్డుగోడ కట్టుకొని ఏర్పాటు చేసుకొన్న హద్దులేమడి. సత్యానికి హద్దులేదు, దానికి పరిమితి లేదు, పరిధి లేదు కాలానికి లోబడి లేదు, స్థలానికి లోబడి లేదు, కల్పించు కున్న రూపానికి లోబడి లేదు,

సర్వకాలాలకు అతీతమైనది, అపరిమితమైనది, అనంతమైనది, స్వార్థ రహితమైనది, ప్రేమమయమైనది, అవధులకు ఆవలిది ఆ సత్యం. కల్పితాలు, సంకల్పాలు మనవే కాని ఆయనవి కావు. ఆయన నిర్మలుడు, మతాలు గోడలు కాకూడదు. పశుత్వభావాలతో బ్రతుకుచున్న వానికి మాధవత్వ లక్షణాలను కలుగజేసి, సత్వగుణ ప్రధానుడిగా మలచి, మాధవత్వం వైపు, ఏకత్వం వైపు దృష్టి సారించే వాడిగా చేసి విముక్తి కలుగ జేసి ముక్తున్ని చేసేదిగా మతం ఉండాలి గాని, విభేదాలను సృష్టించి నరకతుల్యమైన జీవనాన్ని అందించకూడదు. భేదమే మడి, నాది మాది అనే స్వార్థబుద్ధే హద్దు అదే మడి, స్వార్థ భావం వీడితే పరమార్థం సంప్రాప్తమౌతుందని ఇదే అమ్మ అందించిన అపరిమితమైన ప్రబోధ.

శ్రీ పరాత్పరికీ జై !!

గుడిలో దేవుడు! గుడిమీద కోతులు!

మానవ జన్మ ఉత్తమమైనది, ఉత్కృష్టమైనది. ఏ ప్రాణికి లేని విచక్షణా జ్ఞానం ఒక్క మానవునికే వుంది. మోక్షజ్ఞానాన్ని పొంది, జరామరణాలను జయించడానికి, జీవన్ముక్తిని పొందటానికి, అనుకూలమైన జన్మ. నిత్యానిత్య వస్తువివేకం మనలో ఉంది. తద్వారా ఆనందాన్ని పొందటానికి, ఆనంద జీవనానికి అవకాశం ఉంది. అందుకే ఈ జన్మకు అంత గొప్ప ప్రాధాన్యతను ఇచ్చారు. ఈ దేహం మహావరం. దుర్గుణాలను, విడనాడి దగ్గరలో నున్న పరమాత్మ భావంతో జీవించిన నాడు జన్మ ధన్య మౌతుంది. అందుచేతనే ఈ దేహాన్ని దేవాలయం అన్నారు. అందులో దేవదేవుడు ఆత్మగా, ప్రకాశంగా, సత్యంగా, భాసిస్తున్నాడు. తాను ''నేను''గా మనలో అలరారుచున్నాడు.

అమ్మ "గుడిలో దేవుడు గుడిమీద కోతులన్నారు" దాని అర్థం ఏమనగా దేహమే గుడి, మనోచిత్తా హంకారాలనే చలించే ఇంద్రియాలే కోతులు. కోతి లక్షణం క్షణికానందాన్నిచ్చే విషయాలకోసం, పరుగులు తీయటం, ఒక చోట నిలకడగా ఉండక పోవటం, ఒక కొమ్మ నుంచి మరొక కొమ్మకు గెంతడం, ఒక చెట్టు నుంచి మరొక చెట్టుకు ఎగరటం దాని లక్షణాలు. వనాన్ని ధ్వంసం చేస్తాయి కోతులు, ఫలాలను పాడు చేస్తాయి. తోట మాలికి చికాకును చింతను కలుగజేస్తాయి. గుడిలో పండును తీసుకుపోయి గుడిమీద గంతులు వేస్తూ తింటాయి. ఇది వాటి లక్షణం. మనలో ఉన్న ఇంద్రియాలు కోతుల్లాగా విషయ సుఖాల కోసం బహిర్గతమై పరుగులు తీస్తాయి. ఒక కోర్కె ఒక విషయం ద్వారా తీరకమునుపే మరొక కోర్కెను సంకల్పించుకొని మరొక విషయంవైపు గంతులు వేస్తాయి. ఒకచోట నిలకడ ఉండదు. దొరికితే, అనుకున్నది జరిగితే ఆనందాన్ని, జరగకుంటే దుఃఖాన్ని కలుగజేస్తాయి. లోన ఉన్న అనంత ఆనందాన్ని విడచి బయటకు చరిస్తాయి. నందన వనమైన నూతన జీవితాన్ని ధుఃఖమయం చేస్తాయి. ఆనందఫలం కోసం తపించే జీవునికి దుఃఖాన్ని మిగులుస్తాయి. దేహాభిమానమే చంచలస్వభావియైన మనో కోతి లక్షణం. కనుక దేహాభిమానాన్ని వీడి లోనఉన్న ఆత్మారామున్ని నిజ గురు బోధచే దర్శిస్తే ఆనందం. అప్పుడే దేహం దేవాలయం అవుతుంది. అంతా ఆనందమయంగా గోచరిస్తుంది. అలా కాకుంటే భావం బాహ్యమైనదైతే ద్వంద్వమై ఆనందానికి దూరం చేస్తుంది. భావం అంతర్ముఖమైతే నిర్ద్వంద్వమై గుడి (దేహం)లో దేవుడి దర్శనమౌతుంది, జీవిత సుఖమయం అవుతుంది. అప్పుడే దేహం దేవాలయం, అలా కాకుంటే దుఃఖ మయం అవుతుందని అమ్మ భావన.

శ్రీ పరాత్పరికీ జై !!

ఎన్నిసార్లు గీత చదివినా
మన గీతను బట్టి జరుగుతుంది.

భగవదవతారము ధర్మాన్ని ప్రతిష్ఠించడానికి, అధర్మాన్ని నిర్మూలించడానికే వస్తుంది. వచ్చే ప్రతీసారి ధర్మం యొక్క, సత్యం యొక్క, విశిష్టతను తెలియజేస్తూ, రుజువు చేస్తూ ఉంటుంది. మానవ జన్మ యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ, విశదపరుస్తూ భ్రాంతి రహితమైన శాంతి సందేశాన్నిస్తుంది. ఆచరించే వాడికి ముక్తి కరతలామలకమౌతుందని ప్రబోధిస్తుంది. అలా వచ్చిన అవతారమే ద్వాపర మందు కృష్ణావతారం, ఆ అవతారం ధర్మానికి, అధర్మానికి జరిగిన సమరంలో ధర్మమే జయిస్తుందన్న సత్యాన్ని తెలియజేసింది. భగవంతుడు ధర్మబద్ధమైన జీవనాన్ని కొనసాగించే వారి వైపు ఉంటాడని కృష్ణావతారం స్పష్టీకరించింది. మనస్సు అర్పించుకున్న వారికి మాధవ సాక్షాత్కారం ఎలా లభిస్తుందో గోపికల భక్తి ద్వారా నిరూపణ కాబడింది. ఆపదలో వేడిన వెంటనే ఎలా దైవం ఆదుకుంటాడో, ఆపదనుంచి ఎలా గట్టెక్కిస్తాడో ద్రౌపదిని వివస్త్రను చేస్తున్న తరుణంలో నిరూపించాడు. క్షత్రియుడైయుండి బంధు జనంపై, మమకారం పెంచుకొని వైరాగ్యాన్ని పొంది యుద్ధం చేయనన్న అర్జునునికి కర్తవ్యాన్ని బోధించి కార్యోన్ముఖున్ని చేసి క్షత్రియ ధర్మమైన యుద్ధం చేసేట్లు చేసాడు. కర్మ చేయడమే నీవంతు ఫలితం అందించడం నా వంతు అని అర్జునునికి బోధించాడు, సర్వం తానే చేస్తున్నట్లు, తన ద్వారానే జరగుచున్నట్లు, తనలోనే జరుగుచున్నట్లు విశ్వరూప సందర్శనా భాగ్యాన్ని అర్జునునికి ప్రసాదించాడు, భక్తి, జ్ఞాన,

వైరాగ్యాలను ప్రబోధించి మానవాళికి అందించాడు. సర్వమతాల సారాన్ని, సకల ధర్మాల్ని తెలియజేసిన పంచమ వేదం భగవంతుడే చెప్పిన గీత. కనుక ఆ భగవద్గీత అది మానవ జీవితాన్ని మహోన్నతంగా తీర్చి దిద్దు కోవడానికి అవసరమైన గ్రంథం. గీతలో కృష్ణుడు చెప్పినట్లు మానవుడు తన కర్తవ్యాన్ని సక్రమంగా నెరవేర్చుకోవాలి కానీ ! కర్మఫలం కోసం ఆశలు పెట్టుకొని, ఫలితం తన మనోభీష్టం ప్రకారం ప్రాప్తం కానప్పుడు దుఃఖించ కూడదు.

ఇప్పుడు మనం అనుభవిస్తున్న జీవితం గతంలో మనం చేసిన సత్కర్మ, దుష్కర్మల యొక్క ఫలితం. ఇది అనుభవించక తప్పదు. కర్మఫలాన్ని నిర్ణయించే నిర్ణయాధికారం మనకు,లేదు. కర్మఫలితాన్ని ధిక్కరించలేము. కర్మఫలాన్ని అనుభవించక తప్పదు. ఫలితం అనుకూలంగా ఉంటున్నప్పుడు సుఖ సంతోషాలు కల్గుతాయి, ప్రతి కూలమైన ఫలితం అనుభవమునకు వచ్చినప్పుడు దాని నుంచి తప్పించుకోవడానికి, మొక్కుబడులు, వ్రతాలు, పూజలు, జపాలు చేస్తాము. ఇవి చేసినంత మాత్రాన, కర్మఫలానుభవం నుంచి తప్పించుకోలేము సాక్షాత్ అవతారుడైన కృష్ణుడు ప్రవచించిన గీత చదివిన ప్పటికీ, ఎంత వల్లించినప్పటికీ మన గీతను బట్టే జరుగుతుందని అమ్మ బోధించారు. మనం చేసిన గత కర్మయే మనకు విధియై నొసట గీతగా పరిణమిస్తుంది దాన్ని అనుభవించక తప్పదు. పంచభూత సమ్మిళితం వలన ఏర్పడిన ఈ దేహాన్ని ధరించిన నరుడైనా, నారాయణుడైనా కర్మ నుండి తప్పించుకోలేరు. రామునిగా అవతరించినప్పుడు చెట్ల చాటు నుండి బాణం వేసి వాలిని సంహరిస్తే, కృష్ణావతారంలో బోయవాడు చెట్ల చాటునుండి బాణం వేస్తే అది శ్రీకృష్ణుని పాదానికి తగిలితే కృష్ణుడు

దేహాన్ని చాలించాడు. గత కర్మఫలితం ఆయనే అనుభవించాడు. ఈ శరీరం వచ్చింది కర్మ అనుభవించడానికి, కర్మతీరిపోగానే ఒక్క క్షణం ఈ నేలపై నిలువదు శరీరం. పంచభూతాలు పంచ భూతాలలో విలీనవౌతాాయి. కనుక సర్వం పరమాత్మ నిర్ణయం ప్రకారం జరుగుచున్నదని, అనుభవిస్తున్న సుఖదుఃఖాలు గతంలో మనం చేసిన కర్మ ఫలాలని భావించి, ఈశ్వరార్పణ బుద్ధిని కలిగి, అనుభవిస్తూ, కర్తృత్వ భావన లేకుండా సకల కర్మలను నిర్వహిస్తే జీవితం మాధుర్యాన్ని సంతరించు కుంటుంది. అంతే కాని గీత చదివినంత మాత్రాన మన గీతమారదు. గీతా చార్యుడు చెప్పిన వాక్యాలను జీవితానికి అన్వయింప చేసుకుంటూ జీవించాలని అమ్మ చెప్పిన సూక్తిసారం.

శ్రీ పరాత్పరికీ జై !!

అన్నం పరబ్రహ్మామైతే అశుద్ధం ఎందుకు కాదు !?

తన సంకల్ప మాత్రాన వింత రూప ప్రపంచంగా రూపు దాల్చింది దైవం. ఇలా జరిగినది తన సృష్టి. సృష్టికి భిన్నంగా తాను లేడు. తనకు అన్యంగా సృష్టిలేదు. మొదట తాను ఏకం. విలాసం కోసం అనేకమయ్యాడు. అయినా అనేకంలో ఏకంగానే ఉన్నాడు. జీవులలో ఆత్మగానే ఉన్నాడు. పంచ భూతాలు-సకల జీవులు, సకల రూపాలు, సకల నామాలు తనవే. సృష్టి-స్థితి-లయ కారకుడు తానే అయినా తనను గుర్తించడానికి వీలు లేకుండా ఆవరణగా, అడ్డుగా, నిలచి 'నేను'' అనే ప్రత్యేకమైన అహంకార పూరితమైన ఉనికిని ఏర్పాటు చేసుకొని పెత్తనాలు చెలాయిస్తుంది అజ్ఞాన పూరితమైన మన మనస్సు. దీనినే అహంకారమని కూడా అనవచ్చు. తన నుండి (ఆత్మ) వచ్చినప్పటికీ తనని మరచి, విడచి ద్వంద్వమై, పరమాత్మ సృష్టిని వేరుగా చూస్తుంది.

సుఖ దుఃఖాలలో ముంచి శాంతి లేకుండా చేస్తుంది. అణువణువూ తానైనప్పుడు అవిద్య చేత విశ్వం వేరుగా కనిపిస్తుంది. మంచి–చెడు, శుచి–అశుచి, శుద్ధం–అశుద్ధం అనే ద్వంద్వాలను కల్పించి, దైవం యొక్క ఏకత్వాన్ని మరిపింప చేస్తుంది. అవసరమైనది ప్రీతిగా స్వీకరిస్తాడు – కాని దాన్ని నిరాకరిస్తాడు మానవుడు. కానీ సృష్టి అంతా దైవమయం కనుక మన అవసరానికి ఉపయోగపడనంత మాత్రాన వ్యర్థం కాదు. ఉదాహరణకు మనం తీసుకున్న ఆహారం మన శరీరాన్ని చేరగానే జీర్ణమయిన పిదప కొంత భాగం రక్తంగా మారితే మిగిలిన భాగం అశుద్ధమై విసర్జింపబడుతుంది. అశుద్ధాన్ని మనం అసహ్యంచుకుంటున్నాము. కాని ఆ అశుద్ధమే ఇంకొక ప్రాణికి కుక్క లేదా పందికి ఆహారమై ప్రీతిగా వాటిచే స్వీకరించబడుతుంది. పశువులు విసర్జించిన పేడ మొక్కకు ఎరువై–సారవమై, మొక్కకు సత్తువనిచ్చి ఫలసాయానికి ఉపయోగపడుతుంది. మరి మొదట మనం తీసుకున్న ఆహారం శుద్ధం. మన నుంచి విసర్జింపబడిన తరువాత దాన్ని చూసి మన మనస్సు, ద్వంద్వభావాన్ని కల్పించి అశుద్ధమని పేరు పెట్టింది. కాని అది ఇంకో జీవికి శుద్ధమైంది. ఆహారమైంది. పచ్చగడ్డి మనం తినడానికి పనికి రాదు. ఎవరైనా పొరపాటుగా మాట్లాడితే గడ్డి తింటున్నావా ? అని తిడతాం వారిని. మనకు ఆహారం కాకపోవచ్చు కానీ అది పశువుకు ఆహారమౌతుంది, పాలుగా మారుతుంది. కనుక అన్నం పరబ్రహ్మమయినప్పుడు అశుద్ధం కూడా బ్రహ్మమే అని అమ్మ సూచించారు. భావంలో ద్వంద్వం ఉంది కానీ దైవంలో లేదు. ఉన్నది ఒకటే అదే దైవం.

శ్రీ పరాత్పరికీ జై !!

సంసారమంటే సంకల్పమే

తల్లి, తండ్రి, భార్య పిల్లలు, బంధువర్గాలు, ఆస్థిపాస్తులు, కష్ట నష్టాలు, యాతనలు, బాధ్యతలు– బంధాలు –సమస్యలు – సర్దుబాట్లు వీటితో పెనవేసుకొని బరువుగా సాగే జీవన ప్రయాణమే సంసారమను కొంటాము. ఇది బంధమనిపిస్తుంది. ఇదే తన జీవితం అనుకొని సతమతమవుతూ స్వేచ్ఛలేక రోదిస్తూ ఉంటాడు మనిషి. వాస్తవానికి ఇది బాహ్య సంసారం. ఇది గత ఋణానుబంధాన్ని బట్టి ఏర్పడింది. ఇది నిజానికి బంధం కాదు. బాధ్యతాయుతమైనది. భయానికీ, బంధానికి మూలం సంకల్పమే. సంకల్పానికి మూలం మన మనస్సు. ఇది ఎప్పుడూ చంచల స్వభావాన్ని కలిగి ఉంటుంది. ఒక చోట స్థిరంగా నిల్వదు. అందుకే మనస్సును వాయువుతో పోల్చెదరు. భ్రాంతిని కలుగజేసి మనిషికి శాంతి లేకుండా జేస్తుంది. నిరంతరం ప్రవహించే నదిలా ఆలోచనలతో పరుగులు తీస్తుంది. ఎడతెగని సంకల్పాలు చేస్తూ ఉంటుంది. ఇంద్రియాలతో కూడి విషయాభోగాలను కోరుకుంటుంది, అనుభవిస్తుంది. అనుభవానికి రానప్పుడు దుఃఖిస్తుంది. గతాన్ని చింతిస్తూ ఉంటుంది. భవిష్యత్తును ఊహించుకుంటూ వర్తమానాన్ని వ్యర్థం చేసుకొంటుంది.

సంకల్పాలే సంసారం. సంకల్పాలు చేసి సంసారము సృష్టించు కుంటుంది మన మనస్సు. సుఖ దుఃఖాలు అనుభవిస్తూ ఉంటుంది. దేహాభిమానం, అహంభావం, కర్తృత్వం, భోక్తృత్వం, రాగం, ద్వేషం, మోహం, మొదలగునవి అన్నీ ఈ మనస్సుకు సంబంధించినవే. ఇది

సృష్టించినవే. ఈ మనస్సే సంసారానికి కారణం. మనస్సంటే సంకల్పాల సముదాయమే. నిజగురు బోధలేనిదే, సత్యబోధలేనిదే, మనిషి మనస్సుకు లోబడి బంధీకృతుడై దుఃఖ మయమైన జీవితాన్ని అనుభవించక తప్పదు. సద్గురు బోధచే దాని నిజరూపాన్ని తెలుసుకుంటే సుఖమయ జీవితాన్ని అనుభవించ గలడు.

మా గురువు గారైన **శ్రీ స్వామి యోగానంద గారు** ఒకసారి మనస్సు, దాని సంకల్పం గురించి ప్రబోధిస్తూ ఇలా అన్నారు. లేడిని రాముడు చూశాడు, లక్ష్మణుడు చూశాడు, సీత చూసింది. కానీ సీత మనస్సు లేడిని కావాలని సంకల్పించింది. రాముణ్ణి పట్టుకు తెమ్మని కోరింది. రామలక్ష్మణులు వద్దన్నారు. కానీ సీత మనస్సు పట్టు పట్టింది. దానితో ఆనందంగా ఆడుకుంటానంది. తుదకు ఆ సంకల్పం వలన విపత్కర పరిణామాలు సంభవించాయి. రావణుడు సీతను అపహరించాడు, ఒక చెట్టు క్రింద రాక్షసుల నడుమ ఉంచాడు. ఇప్పుడు సీత పరిస్థితి రామునికి దూరమయ్యింది. జీవితం శోకసాగర మయ్యింది. రామ రావణ సంగ్రామానికి దారితీసింది. దీనికి కారణం సీత మనస్సు. ఆ మనస్సు చేసిన సంకల్పం. అందుకే అమ్మ "సంసారమంటే సంకల్పమే" అన్నారు. విచక్షణా జ్ఞానం కల్గి మంచీ చెడులను పరిశీలించి అవగాహనతో జీవించడం నేర్చుకోవాలి. అప్పుడే జీవితం ఆనంద పరిమళమవుతుంది.

శ్రీ పరాత్పరికీ జై !!

ప్రజ్ఞానం బ్రహ్మ అయితే అజ్ఞానం ఎందుకు కాదు ?!

కనిపించే జగమంతా పరమాత్మ మయంగా గోచరం కావడం ప్రజ్ఞానం. ఆ ప్రజ్ఞానమే బ్రహ్మ లేదా బ్రహ్మం. అది తప్ప రెండవది లేదు అని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నవాడు బ్రహ్మమే అవుతాడు. అలా అనుభవించి ఆ సత్యజ్ఞానాన్ని వర్ణించిన వారు పూర్ణజ్ఞానులని, అవతారులని, సద్గురువులని కీర్తింపబడతారు. రమణ మహర్షి, ఆదిశంకరాచార్యులు, ఆనందమయి అమ్మ, జిల్లెళ్ళమూడి అమ్మ, ఇంకా ఎందరెందరో ఈ కోవకు చెందిన వారున్నారు. వీళ్ళంతా బ్రహ్మజ్ఞానులు. సర్వ జీవులను తమలో, సర్వ జీవులలో తమను చూచుకుంటారు, దేహాభిమానం ఉండదు. సర్వత్రా సమభావమే, సమత్వమే ఉంటుంది. ఆ సత్య జ్ఞానాన్ని మానవాళికి అందిస్తూ జీవన్ముక్తులుగా ఆరాధింపబడతారు. వాళ్ళకు రెండులేవు. అన్నీ తామై, తామే అన్నీ అయిన ఏకస్థితి వాళ్ళది. అదే బ్రహ్మానుభూతి. ఆ ప్రజ్ఞానమే బ్రహ్మ.

దేహాభిమానంచేత నేను వేరు, దైవం వేరు అనే ద్వంద్వభావం ఏర్పడుతుంది. దీనివలన సంకుచితత్వం ఏర్పడి తనచుట్టూ పరిధిని ఏర్పాటు చేసుకుంటాడు. తన దేహానికి సంబంధించిన తల్లిదండ్రులు, అక్కాచెల్లెల్లు, అన్నదమ్ములు, చుట్టాలు, బంధువుల చుట్టూ రాగమోహాలను ఏర్పర్చుకుంటూ పరిమిత జీవనాన్ని సాగిస్తాడు. ప్రపంచాన్ని వేరుగా చూస్తాడు. ఎందుకు ? అజ్ఞానం వలన సత్యం తెలియకపోవడం వలన భ్రమిస్తాడు. భవిష్యత్తును ఊహించుకొని భయపడతాడు. కారణం? అవిద్యావరణ వలన, అవిద్యే చిత్తం. దీనివలన చింత ఏర్పడుతుంది. అశాంతి కలుగుతుంది.

నిజానికి పరమాత్మ తప్ప అన్యం ఏమీ లేదు. అన్యం ఏమీ కాదు. మరి ఈ అజ్ఞానం ఎక్కడిది ? బ్రహ్మము యందు (ఆత్మయందు) లేక తోచి భ్రమనుకల్గిస్తున్నది. అంతే గాని అజ్ఞానమంటూ ఏమీలేదు.

జరుగుచున్న సంఘటనలన్నీ ప్రజ్ఞానానికి సంబంధించినవే అయినప్పటికీ మనస్సు గమనించక కొన్ని తనవని, కొన్ని దైవానివని విభజన చేస్తుంది. ప్రతీది బ్రహ్మమయమే కాని వేరుకాదు. వేరు చేస్తున్నది అజ్ఞాన పూరితమైన మనస్సు. దీని ఉనికి చేతనే వేరు అనిపిస్తుంది. కానీ దీని స్వస్థలాన్ని వెదకితే, అదే ఆత్మగా మారిపోతుంది. ఆ వెదకటానికే గురుజ్ఞానం అవసరం. ప్రతీ కదలిక తనదే అనుకోవటం వలన అజ్ఞానమైంది కాని అనుకోకుంటే అజ్ఞానమే ప్రజ్ఞానమవుతుందని అమ్మ చెప్పిన సూక్తికి అర్థం.

శ్రీ పరాత్పరికీ జై !!

శబ్దం బ్రహ్మ అయితే నిశ్శబ్దం బ్రహ్మా....

తూర్పు దిక్కున బాలభానుడు లేలేత కిరణాలతో రాకమునుపే కోడి ''కొక్కొరొకో''..... అని కూస్తుంది. ఆ కూతకు శ్రమజీవి నిద్రనుంచి మేల్కొంటాడు. చేతులు ముకిళించి హేరామా.... అంటూ దైవాన్ని స్మరించి తన దైనందిన కార్యక్రమాన్ని నిర్వర్తించడానికి సంసిద్ధుడౌతాడు. ఆ కూత తనకు అవసరం, ఆ కూత తనకు సహకారం చేస్తుంది. నిద్ర నుంచి మేల్కొల్పుతుంది. కర్తవ్యాన్ని బోధిస్తుంది. ఆ శబ్దం తన పాలిట బ్రహ్మయే.

పక్షుల కిలకిలలు, సెలయేటి పరుగులో వినిపించిన గలగలలు, కోకిల గానం, కాకి కూత, కుక్క అరుపు, మన మాటలు, పాటలు, వాహనాల రోత, కడలి తరంగాల హోరు. ఒకటేమిటి, అన్ని శబ్దాలు ఓంకార జనితమైనవే. అన్ని శబ్దాలు ఓంకార మయమైన నాదబ్రహ్మా.... రక

రకాలు లేవు. నిజ జ్ఞానం లేక అన్నీ-ఇన్నీ అని అనిపిస్తున్నాయి అనేకానే కంగా గోచరి స్తున్నాయి.

అమ్మ సన్నిధిలో ఓ కుక్క "జయహో మాతా శ్రీ అనసూయ రాజరాజేశ్వరి శ్రీపరాత్పరి" అని నామగానం చేసింది. మనలా స్పష్టంగా అక్షరాలు పలుకకపోయినా రాగయుక్తంగానే అరిచింది. దానికి ఆజ్ఞానం అమ్మ సాన్నిధ్యం లభింపచేసింది. ధన్యురాలయింది. మూగ జీవైనా వేగమే గమనించి శరణాగతితో గానం చేసింది. అందుకే వినడంలో భేదం గాని నాదమంతా ఒకటే, శబ్దాలన్నీ ఒకటే ఓంకార బ్రహ్మకు సంబంధించినవే. అందుకే అమ్మ శబ్దము బ్రహ్మ అన్నారు.

ఆ విధంగానే "నిశ్శబ్దం"ను కూడా బ్రహ్మే అన్నారు. నిశ్శబ్దమే బ్రహ్మ స్వరూపమని, బ్రహ్మమని శృతి నినాదం. చంచలమైన మనస్సు శాంతిని కోరుకుని బహిర్గతమై, తిరిగి తిరిగి వేసారి, తిప్పలు పడినప్పుడు శాంతి మార్గాన్ని అన్వేషిస్తుంది. సాధుసత్పురుషుల సాన్నిధ్యానికిచేరి శాంతిమయ జీవితాన్ని కోరుకుంటుంది మనస్సు. ఆ మహానుభావుల సందేశం మేరకు యోగము, ధ్యానం వంటి సాధనలు చేసినప్పుడు మనోవృత్తి నిరోధింపబడి మౌనం ఏర్పడుతుంది. ఆ మౌనమే నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దం కూడా బ్రహ్మయే. మౌనం వలననే బ్రహ్మం ప్రకటిత మౌతుంది అనేది దక్షిణామూర్తి తత్వం. నిశ్శబ్దమే బ్రహ్మమని అది బ్రహ్మానుభూతి కలుగజేసి బ్రహ్మానంద జీవనాన్ని అందిస్తుందని అక్షరసత్యాన్ని పెద్దలెందరో చెప్పారు.

అందుకే అమ్మ శబ్దం బ్రహ్మ అయితే నిశ్శబ్దం బ్రహ్మ ఎందుకు కాదు?! అని నుడివి శబ్ద నిశ్శబ్దాలు బ్రహ్మమని బోధించారు.

శ్రీ పరాత్పరికీ జై !!

మారేది మారని దాన్లోంచి పుట్టింది

మన కంటికి గోచరమవుతున్న ఈ చరాచర ప్రపంచమంతా పరమాత్మే ఉన్నప్పటికీ ఇది స్థిరమైనది కాదు. అనుక్షణం మారుతూ ఉంటుంది. దీనికి పుట్టుక, వృద్ధి, క్షయములనే నియమం ఉంది. ఇది ఎప్పుడూ చలిస్తూనే ఉంటుంది. పరిమాణంలో, పరిణామంలో మార్పులు సంభవిస్తూనే ఉంటాయి. అందుకే "యద్దృశ్యం తన్నశ్యం" అన్నది శాస్త్ర వాక్యం. అనుభవవాక్యం. మనల్ని మనం చూసుకుందాం, మనల్ని మనం పరిశీలించుకుందాం. శైశవదశనుండి వృద్ధికలిగి వృద్ధాప్యం నుండి క్షీణదశకు వస్తుంది మనశరీరం. తరువాత .....వచ్చిన పని అయిన పిదప.... ?! మట్టిలో చేరిపోతుంది. మనలాగే అన్నీ జంతువులు, క్రిములు, పాములు, చెట్లు కూడా ఇదే వరుస. వీటన్నింటికీ మూలం చైతన్య శక్తి. ఆ చైతన్య శక్తే ఈశ్వరుడు. దీనినుండి ఈ సమస్తం వచ్చింది. ప్రపంచంగా వ్యవహరిస్తుంది. వీటన్నిటికీ మార్పు ఉంది కాని వీటికి ఆధారమైన బ్రహ్మానికి మార్పులేదు. దానిని ఆధారం చేసుకొనే సమస్తం నడుస్తుంది. ఆ మారనిది మనలో ఆత్మగా, సాక్షిగా, జ్యోతిగా ఉంది. దాని నుండి ఏర్పడినవే మనోచిత్తహంకారాది ఇంద్రియములు, ఇవి ఎప్పుడూ మారుతూ ఉంటాయి. స్థిరత్వాన్ని కోల్పోతూ ఉంటాయి. సంకల్ప వికల్పములు చేస్తూ ఇంద్రియాల ద్వారా సుఖదుఃఖములు అనుభవిస్తాయి. కర్తగా, భోక్తగా పరిణమిస్తాయి. కానీ వీటన్నిటికి ఆధారమైన ఆత్మ తాను తానుగానే నిర్గుణమై, నిరంజనమై, అకర్తగా, అభోక్తగా ఉంటుంది. కనుక మారనిది అయిన బ్రహ్మ (ఆత్మ) నుండే ఈ మారే జగత్ పుట్టినదని అమ్మ చెప్పారు. అందుకే ఇదంతా శాశ్వితం కాదని అనుభవజ్ఞులు తెల్పుచున్నారు. శాశ్వితమైన ఆత్మ జ్ఞానాన్ని పొంది ఆత్మానందమును పొందమని అమ్మ అందర్నీ చేరదీస్తూ అమృత జ్ఞానాన్ని గోరుముద్దలు చేసి తినిపించుతుంది. ఆనందంతో నింపుతుంది, అమృతమయులుగా మలుచుతుంది.

శ్రీ పరాత్పరికీ జై !!

అన్ని రూపాలు ఒకటేనన్న స్థాయి రావటమే దైవత్వం

ఈ దృశ్య ప్రపంచం చిత్ర విచిత్రంగా ప్రకటమయి వుంది. ఎన్ని రూపాలు, ఎన్నెన్ని నామాలు, ఎన్ని జీవులు, ఇదంతా ఎంత వైవిధ్యంగా కనిపిస్తుంది. మనదృష్టికి అనేకంగా గోచరమవుతుంది. ఖండఖండాలుగా కనిపిస్తుంది, సత్యానికి ఇవన్నీ ఒకటే. ''ఏకం అనేకమయ్యింది అనేకంలో ఏకంగా ఉన్నది ఆ పరమాత్మే''.

ఒక్కటైన బ్రహ్మంనుండే ఇదంతా వచ్చింది. ఇన్ని విధాలుగా మారింది. విత్తనంలో వృక్షమున్నట్లు మరి ! ఆ వృక్షం ప్రకటమవ్వటానికి అవిత్తులో పరిణామంచెందే శక్తి ఇమిడి ఉంది. చివురుటాకులు తొడిగి క్రమంగా పెరిగి మొక్కై – కొమ్మలతో రెమ్మలతో పెరిగి తన నుంచి ఏర్పడిన వ్రేళ్ళను దృఢంచేసుకొని భూమిని బలంగా పట్టుకొని గాలినుండి వాన నుండి వరద నుండి తను పడిపోకుండా నిలిచే శక్తి ఆ వ్రేళ్ళలో నిగూఢంగా ఉంటుంది. ఆహారం, నీరు వాటి ద్వారాన్నే స్వీకరించే ఏర్పాటు ఆ చెట్టులో ఉంది. బలాన్ని పుంజుకుంటూ పెరుగుతుంది. పచ్చని శరీరాన్ని కలిగి, శోభించే పుష్పాలను, మధురమైన ఫలాలను కల్గి ఉంటుంది. శాఖోపశాఖలుగా ప్రకటమై, వృక్షంగా రూపాంతరం చెందింది ఆ విత్తు. ఆ విత్తు ఏకం కాని దాని నుండి పరిణామక్రమంలో ప్రకటమయ్యే వృక్షానికి ఎన్ని ఆకులు, ఎన్ని కొమ్మలు, మరెన్ని రెమ్మలు, పుష్పాలు వాటిలో సుగంధం, పరిమళం, అందులో మకరందం, పిందెలుగా రూపాంతరంచెంది కాయలు, ఫలాలు ఇవన్నీ అనేకంగా కనిపిస్తున్నాయి. కానీ వీటన్నింటికీ మూలమైన ''విత్తు'' ఒక్కటే.

ఆ విధంగానే ఉవ్వెత్తున ఉద్వేగంతో కదలాడే కడలి తరంగాలు అనేకం. అందులో పుట్టుక, వృద్ధి, క్షయం కనిపిస్తున్నాయి. వేరుగా ఉన్నట్లు అనిపిస్తున్నాయి. యదార్థానికి అలలన్నీ సముద్రానివే. అలలు సముద్రాన్ని విడిచి లేవు. విడిస్తే వాటికి మనుగడలేదు. విడిగా ఉంటే

అవి అలలు కావు. అందుకే అలలన్నీ సముద్రాధీనమైనవే. ఆ విధంగా విభిన్నంగా కనిపిస్తున్న సమస్త ప్రపంచం యొక్క మనుగడ పరమాత్మపై ఆధారపడి ఉంది. పరమాత్మే ప్రపంచంగా మారింది. అంతా తానై ఉంది. ప్రత్యేకంగా, ఆయనకంటే భిన్నంగా ఏమీలేదు. పరమాత్మే సకల రూపాలుగా రూపాంతరం చెంది సకల నామాలను కలిగి ఉన్నాడు. అంతటా ఉన్నది ఒకే ఒక చైతన్య శక్తి. అదే పరమాత్మ. అదే జీవశక్తిగా అణువ ణువునూ ఆక్రమించుకుని వుంది. అజ్ఞానం వలన, దేహ మోహం వలన నేను అనే వేరుభావం వలన ప్రపంచం భిన్నముగా కనిపించినా నిజానికి ఉన్నది సత్యమైన పరమాత్మ ఒక్కటే. ఎందుకు ? తనే ఆత్మగా, జీవంగా, ప్రాణంగా ఉన్నాడు కనుక. మహా పురుషుల, సద్గురువుల సమాశ్రయము వలన సత్య జ్ఞానం తెలియబడినప్పుడు ప్రపంచ భావన పోయి ఉన్నది ఒకే ఒక సత్యం, అదే పరమాత్మ అనే దివ్యమైన మార్పు కల్గుతుంది. అప్పుడు అజ్ఞాని విషయాన్ని చూడక ఉన్న దైవాన్ని చూస్తాడు. అలా చూడగలిగే స్థాయికి రావటమే దైవస్థితి అని అమ్మ ఉద్ఘాటించారు. ఈ స్థితిలో ఉన్నవారికి ద్వయభావం ఊడిపోతుంది. దేహాభిమానం వీడిపోతుంది, అదే నిజమైన స్వరూపం, అదే సత్య దర్శనం, అదే నిజస్థితి.

శ్రీ పరాత్పరికీ జై !!

భరించలేనిది బాధ

మానవుడు ఎల్లవేళలా ఆనందముగా ఉండాలనుకుంటాడు. ఆ ఆనందాన్ని పొందడం కోసం సర్వవిధాలా ప్రయత్నం చేస్తూ ఉంటాడు. అలా ప్రయత్నం చేసేటప్పుడు అనుకున్న దానిని పొందగలననే విశ్వాసాన్ని పెంచుకుంటాడు. ఆ ఊహలతోనే కాలాన్ని గడుపుతుంటాడు. తను అనుకున్నది పొందే ప్రయత్నంలో ఏవైనా అవరోధాలు వస్తే

భరించలేడు, బాధ చెందుతాడు. ఒకవేళ అన్ని విధాల ప్రయత్నం చేసి తనుపొందవలసినది పొందనప్పుడు ఎంతో వ్యధకు గురవుతాడు. తను అనుభవించి ఆనందాన్ని పొందాలనుకునేది వేరొకరి సొంతమైతే తట్టుకోలేక తల్లడిల్లిపోతాడు. ఈ భరించలేని తనమే తీవ్రమైన బాధకు గురిచేస్తుంది. తనకు జరుగకపోయినా భరించలేడు. తనకు దక్కనిది వేరొకరికి దక్కినా భరించలేడు. ఇది త్రిగుణాలతో కూడి జీవిస్తున్న మానవ నైజం. గుణాలకు అతీతమైన ఆ పరమాత్ముని కృప, ఆయనను గురించిన జ్ఞానం లేనిదే ఈ ఓర్వలేనితనము తొలగదు. తనను బ్రహ్మర్షిగా గుర్తించలేదని కోపాన్ని భరించలేక విశ్వామిత్రుడు వశిష్ఠమహర్షి కొడుకుల్ని సంహరించాడు. దైవిక లక్షణాలను పుణికిపుచ్చుకున్న వశిష్ఠ మహర్షి సర్వం ఈశ్వర నిర్ణయం ప్రకారం జరుగుచున్నదిగా భావించి ఆ దారుణ మారణకాండను భరించగలిగాడు. విశ్వామిత్రునిపై ఇంచుకైనా ద్వేషం లేక తిరిగి సలహా యిచ్చాడు. నీలో రజోగుణం మిగిలి ఉంది. హృదయ శుద్ధి చేసుకుని సాత్వికమైన తపస్సు చేస్తే గాని బ్రహ్మర్షి పదవికి అర్హుడవుకావని దివ్య సందేశాన్నిచ్చాడు విశ్వామిత్రునికి. ఇలాంటి దివ్యగుణం దైవజ్ఞానం కలవారికి సహజంగా ఉంటుంది. ఎటువంటి ఆటుపోటులనైనా భరించగలరు.

ఏమి జరిగినా సర్వం పరమాత్ముని ఆజ్ఞమేరకు జరుగుచున్నదని భావించి, లభించిన దానిని ప్రసాదబుద్ధితో స్వీకరించి జీవిస్తే జన్మే ధన్యమవుతుంది. సుఖాన్ని ఆనందంగా స్వీకరించగలం, మరి కష్టాన్ని ఆనందంగా స్వీకరించలేము ఎందుకని ?! సత్యజ్ఞానం లేకపోవడము వలననే. సుఖదుఃఖాలను మనమనస్సే కల్గిస్తున్నది. సుఖదుఃఖాలకు స్పందించేది మనస్సే. అది భౌతిక జ్ఞానంతో బాహ్యా సుఖాన్ని, గౌరవాన్ని, ఆదరణను కోరుకుంటుంది. తనకు అనుకూలంగా

అవి లభ్యంకానప్పుడు భరించలేక బాధపడుతుంది. కానీ మనంకోరుకున్న సుఖమైనా, కోరని దుఃఖమైనా మనం అనుభవించవలసి ఉన్నప్పుడు అవి రాకమానవు. వాటినుంచి తప్పుకోలేము. వాటిని అనుభవించ వలసినదే. అవి మన గత కర్మ ఫలాలు. కనుక ప్రాప్తమైనది మంచిదైనా దుఃఖాన్ని కలుగజేసేదైనా అంగీకరించవలసినదే. ఈ సత్యాన్ని గమనించి పరమాత్మ స్మరణచే జీవించేవాడు దుఃఖానికి కృంగిపోడు, సుఖానికి పొంగిపోడు. సహజంగా ఉంటాడు. భరించే శక్తిని కలిగి ఉంటాడు. ఇలా ఉండటమే భవ్యజీవనమవుతుంది.

శ్రీ పరాత్పరికీ జై !!

సహించలేనిది హింస

సహనం సముద్రంకన్నా గొప్పదంటారు ఆర్యులు. ఎందుకంటే సముద్రం ఎంతలోతైనదైనా, ఎంత విశాలమైనదైనా, ఎంతపొడవైనదైనా దీనిలో మత్స్యాలున్నాయి, ముత్యాలున్నాయి. తీరాన అలలు హోరెత్తి ఊగిసలాడుచున్నాయి. మనిషి తనలో ఏమాత్రం దుర్గుణమున్నా, వికృత భావం ఉన్నా శాంతిగా జీవించలేడు, పూర్ణ పురుషుడిగా రాణించలేడు, మానవజీవితాన్ని అర్ధంచేసుకుని, జన్మను సార్ధకం చేసుకొనే సలక్షణాన్ని కల్గిన మానవుని హృదయం శుద్ధిగా ఉంటుంది. ఎటువంటి వికారగుణాలు లేకుండా ఉంటాడు. ఎటువంటి ఒడుదుడుకులు వచ్చినా చిరునవ్వుతోనే సహిస్తాడు. అలాంటి పూర్ణ పురుషుడు సముద్రం కన్నా గొప్పవాడు, ఆతని భావం సముద్రంకన్నా లోతైన సత్యవచనమై యుంటుంది.

ఏమి జరిగినా సహించే గుణం ఆతనిలో సత్య సంస్కారంగా ఉంటుంది. పసితనమున పరమ పావనమైన నారాయణ నామాన్ని హృదయంలో అనుష్ఠించి, అంతటా అందరిలో, అన్నిటిలో ఆ అంతర్యామియైన నారాయణుని చూడగలిగిన ప్రహ్లాదుడ్ని రాక్షసుడైన తన తండ్రి హిరణ్యకశిపుడు ఎన్ని హింసలకు గురిచేసాడు ? నీటిలో పడవైచాడు, అగ్నిచే కాల్పించాడు, ఏనుగులచే తొక్కించాడు ఎన్నో... ఇంకా ఎన్నో.... బాధలకు గురిచేశాడు, కానీ సర్వ లోకరక్షకుడైన నారాయణునే ప్రార్థించి, శరణాగతుడై సహించాడు. కాని ఇదంతా హింసగా భావించి బాధ పడలేదు. మరి తన తండ్రి తన కుమారుని వ్యతిరేక ప్రవర్తనకు కృంగిపోయాడు. సహించలేక తీవ్ర మనోవ్యధకు గురయ్యాడు. శత్రునామస్మరణ చేసిన కుమారునిపై విరుచుకుపడ్డాడు. నిద్రాహారాలకు దూరమయ్యాడు. గొప్ప వీరుడై, చక్రవర్తియై, ముల్లోకాలను గజగజలాడించగల ప్రహ్లాదుని తండ్రికి శాంతిలేదు. సుఖంలేదు. సంతోషం లేదు. ఎందువలన ?! శత్రువుని తన కుమారుడు కీర్తించడం వలన, ఆ పరంధాముని దివ్యగుణాలను గానంచేయడం వలన, నారాయణుని దివ్యత్వాన్ని విని సహించలేకపోయాడు. ఇదే హింస. ఆ సహించని తనం తన నాశనానికి గురిచేసింది. సర్వ బాధలను సహించగల ప్రహ్లాదునికి తన సహనం, సర్వజగద్రక్షకుడైన నారాయణ దర్శన-సంభాషణా భాగ్యాన్ని ప్రసాదించి జీవన్ముక్తున్ని చేసింది.

కాబట్టి ''సహించలేనిదే హింస'' అని అమ్మ అన్నారు. సర్వేశ్వరుని శరణువేడి, స్మరణచేసి ''ఏమి జరిగినా సహించగలిగితే హంస అవ్వగలము''.

శ్రీ పరాత్పరికీ జై !!

ఇష్టంలేనిది కష్టం

మోహ రాగాలతో కూడుకున్నదే మానవజన్మ. సుఖదుఃఖాలు, విషాద వినోదాలు, రాగద్వేషాలు, ఇష్టాయిష్టాలు ఈ ద్వంద్వాలన్నీ జీవ భావంతో కూడుకున్న మనకు తప్పవు. మన ఉద్దేశ్యానికి, మన ఆలోచనకు, మన ఇష్టానికి విరుద్ధంగా ఏది ఉన్నా భరించలేము. ఏమి జరిగినా కష్టంగా ఉంటుంది. అన్నీ మన ఇష్టప్రకారము జరగాలను కుంటాము. ఆ విధంగా జరగకపోతే మనస్సుకు కష్టం అనిపిస్తుంది. దిగ్భ్రాంతికి గురవుతుంది. మన ఇచ్ఛ నెరవేర్చుకోవడం కోసం ఏదైనా, ఏమైనా చేయడానికి వెనుకాడము. కారణం! మన ఇచ్ఛ ప్రకారం జరిగితేనే మనకు ఆనందము, అందులోనే మనకు తృప్తి ఉంది. మనకు ఇష్టంలేనిది కష్టమనిపిస్తుంది.

అయోధ్యాధిపతి దశరథ మహారాజుని తన యాగసంరక్షణార్థం రామలక్ష్మణులను తన వెంట పంపించమన్నాడు విశ్వామిత్ర మహర్షి. కానీ! తన పిల్లల్ని పంపించమన్న మాట తనలో కలత రేపింది. తన అంతరంగం కల్లోలమయ్యింది. కంఠం మూగవోయింది. తన పంచప్రాణాలైన, పసిబాలురైన రామలక్ష్మణులను యాగరక్షణార్థం విశ్వామిత్రుని వెంటపంపటం ఏమాత్రం దశరథునికి ఇష్టంలేదు. కనుకనే అంతరంలో చెప్పుకోలేని కష్టమనిపించింది. ఒకవైపు విశ్వామిత్రుని మాటను ధిక్కరిస్తే వారి కోపానికి, శాపానికి గురవుతామేమోనన్న దిగులు దశరథునిలో అలముకుంది. కానీ చేయునది లేక తన కులగురువైన వశిష్ఠమహర్షి సలహాను అడిగాడు దశరథుడు. వశిష్ఠుడు రామలక్ష్మణులను విశ్వామిత్ర ఋషి

వెంట పంపటం కళ్యాణప్రదమవుతుంది. అటు యాగసంరక్షణం, ఇటు రాక్షసులను హతమార్చడం వలన లోక కళ్యాణం సంభవిస్తుంది అని అభయమిచ్చి, ఆశీర్వదించినప్పుడు దశరథుని మనస్సులో అలుముకున్న అయిష్టత తొలగి విశ్వామిత్రుని వెంట రామలక్ష్మణులను పంపుటకు అంగీకరించాడు.

అందువలన ఏదీ మన ఇచ్ఛప్రకారం జరగదు. ఈశ్వరేచ్ఛ ప్రకారమే జరుగుతుంది. ఈ గమనికతో కూడిన జ్ఞానం మనలో లేనప్పుడు ఇష్టాయిష్టాలకు లోనై సంతోష, సంతాపాలను అనుభవించక తప్పదు. గాంధీ మహాత్ముడు ఇంగ్లాండులో బారిష్టరు చదువు చదివి గొప్ప న్యాయవాది కావాలనీ, తనకు, తనకుటుంబానికి గొప్పపేరు తేవాలని అనుకున్నాడు. కానీ! తన ఇష్టప్రకారం బారిష్టరు పనిచేయలేకపోయాడు. ఖాదీ దుస్తులు ధరించి శాంతి గుణాన్ని ఆపాదించుకుని దేశ ప్రజల స్వాతంత్ర్యం కోసం తన సుఖాలను సహితం త్యాగంచేసి తెల్లదొరలతో పోరాడాడు. శాంతిమయ పోరాటాన్ని జరిపి, జాతిపిత అనిపించుకున్నాడు. మహాత్మా గాంధీగా కీర్తిని ఆపాదించుకున్నాడు. ఇది ఎలా జరిగింది?! తన ఇష్టప్రకారం బారిష్టరుగా ఉద్యోగాన్ని చేయలేకపోయాడు. ఈశ్వరేచ్ఛ ప్రకారం సమర యోధుడయ్యాడు. కనుక మన ఇష్టాయిష్టాలకు తావులేదు. ఇది యదార్థం. ఈ సత్యాన్ని గమనించి జీవన ప్రయాణము సాగించుకుంటే శాంతిమయ జీవితాన్ని అనుభవించగలము.

శ్రీ పరాత్పరికీ జై !!

ధ్యాసే ధ్యానం

సంసారంపై ఆశ దుఃఖాన్ని కలిగిస్తుంది. భగవంతునిపై ధ్యాస మోక్షాన్నిస్తుంది. సంసారాన్ని నిరంతరం చింతించడం వలన సత్యం మరుగునపడుతుంది. శాంతికి దూరమవుతుంది మన జీవితం. అంటే! సంసార బాధ్యతలను, పనులను వదలమని కాదు. బాహ్య సంసారం మనకి బంధం కాదు. ఆ బాహ్య సంసారాన్ని భావములలో దృఢంగా నిలుపుకోవడం బంధమవుతుంది. ఏపని చేసినా భావం పరమాత్మ యందుంటే అదే ధ్యాస. ఆ ధ్యాస నిత్యం నిరాటంకంగా సాగితే ధ్యానమవుతుంది. ఉదాహరణకు చంటిపిల్లాడిని కలిగిన తల్లి పిల్లాడిని ఇంటి వద్ద ఊయలలో ఉంచి ఇరుగు వారితోనో, పొరుగువారితోనో పిల్లాడిని చూస్తూఉండమని చెప్పి ఊరికి దూరాన ఉన్న పొలంలోనికి పనిచేయటానికి పోతుంది. అక్కడ నాట్లువేసినా, గొప్పు త్రవ్వినా, ఏ పనిచేసినా శ్రద్ధగానే చేస్తుంది. తోటి పనివాళ్లతో మాట్లాడుతుంది. కానీ తన ధ్యాసంతా ఇంటివద్ద ఊయలలో ఉన్న తన బిడ్డ గురించే ఉంటుంది. తొందరగా తన పని ముగించుకొని ఆత్రుతతో ఇంటికి పరుగుపరుగున వస్తుంది. బిడ్డ దరికిచేరుతుంది. ఒడికి చేర్చుతుంది, తన కడుపునిండా పాలు పెడుతుంది, తన బిడ్డను చూసి మురిసిపోయి సర్వం మరచి పోతుంది. అంత వరకు తనుపడ్డ కాయ కష్టాన్ని, తనకడుపులోని ఆకలిని మరిచిపోయింది. కారణం?! తన ఆశ, ధ్యాస, తన ప్రాణసమానమైన బిడ్డపైనే! ఈ విధంగానే ఏ వ్యవహారం చేసినా, ఏ కార్యాన్ని చేస్తున్నా, సర్వాధారుడైన సర్వేశ్వరునిపై ధ్యాస నిలిపి, ఆయన దివ్యత్వాన్ని గుర్తిస్తూ ఉంటే అన్య విషయాలు దరికి చేరక అంతరంగం శుద్ధమవుతుంది. ఆనందానికి నిలయమవుతుంది. సత్యవస్తువైన పరమాత్మునియందు దృష్టి సర్వకాల సర్వావస్థలయందు నిలపడమే ధ్యాస. ఆ ధ్యాసే ధ్యానమవుతుంది. ఆ ధ్యానమే స్వస్వరూప సందర్శనానికి నాంది అవుతుంది. కుమ్మరివాడైన కుంభాగోరా పాండురంగని భక్తుడు. మన్ను త్రవ్వి తెచ్చుకుంటూ, మట్టిని నీటిలో తడుపుతూ, కాళ్లతో త్రొక్కుతూ,

కుండలు చేస్తూ, రంగని స్మరించుకునేవాడు. కుండలు తయారీలో దేహం శ్రమిస్తే రంగని అనుగ్రహానికై అతని మనస్సు స్మరించేది. నిరంతరం ఆ ధ్యాసే, రంగని కరుణకై ఆశయే. ఇది గోరా చేసిన సాధన. బాహ్యానికి భార్య, ఒక పిల్లవాడున్నారు. కానీ భావములో రంగని నామముంది. ఒకనాడు గోరా మన్ను త్రొక్కుచున్నప్పుడు భార్యవచ్చి, 'నేను నీళ్ళు తేవటానికి బావికి వెళ్ళుతున్నాను పిల్లవాన్ని జాగ్రత్తగా చూస్తుండండి'' అని చెప్పి నీళ్ళకు వెళ్లింది. గోరా చెవికి ఆ మాట పట్టలేదు. మన్ను త్రొక్కుతూ రంగని నామామృతంలో మునిగి ఉన్నాడు. అమృతానందాన్ని గ్రోలుచున్నాడు, బాహ్యం తనలో లేదు. అంతరంగం రంగనిలో ఉంది. ఆతరుణంలో పిల్లవాడు ఏడ్చుకుంటూ ప్రాకుతూ తండ్రి దగ్గరకు వచ్చాడు. గోరా తన పిల్లవాణ్ణి గమనించలేదు. కాళ్లతో త్రొక్కేసాడు. పసిపిల్లవాడు ఆ కాళ్ల క్రింద పడినుజ్జునుజ్జై మట్టిలో కలిసిపోయాడు. మట్టి మాంసపు ముద్దలానే కనిపిస్తుంది. ఈలోగా భార్య వచ్చింది. బాబు ఇంట్లో కనిపించకపోయే సరికి ఆత్రుతతో భర్తవద్దకు వచ్చి అడిగింది. గోరా తనువును మరిచి రంగని స్మరణలో తన్మయత్వాన్ని పొంది ఆనందంలో మునిగివున్నాడు, భర్తను కదిపి కుదిపి అడిగింది. బాహ్య దృష్టికి వచ్చాడు గోరా. ఏమైందని అడిగాడు. బిడ్డ గురించి చెప్పింది. ఎక్కడ చూసినా లేడు. ఆఖరుకు భార్య భర్త త్రొక్కిన మట్టిని చూసింది. అవాక్కయింది. కుప్పకూలిపోయింది తన భర్త చేసిన పనికి. తనకొడుకునే గమనించక మట్టిలో కలిపిన అతని పిచ్చిభక్తికి. కానీ! తన తప్పిదం లేదన్నాడు. రంగని ప్రార్థించాడు, అర్థించాడు, వేడుకున్నాడు. రంగడు కరుణించాడు. గోరాబిడ్డను బ్రతికించాడు, ఇదీ భక్తి అంటే, దీనినే అనన్య భక్తి అన్నారు. ఆ ధ్యాసే ధ్యానమయ్యింది. పాండురంగని అపార కరుణకు గురిచేసింది. కుమ్మరివాడైన గోరా అనన్య భక్తి లోకాదర్శమయ్యింది. తనని అనన్య చింతన చేసే వాడి యోగక్షేమాలను చూస్తాడన్న భగవద్వాక్యానికి నిదర్శనమయ్యింది. కనుక నిరంతర ధ్యాసే ధ్యానమవుతుందని అమ్మ చెప్పారు.

శ్రీ పరాత్పరికీ జై !!

''మానవుని నడక నవగ్రహాల మీద ఆధారపడి లేదు! రాగద్వేషాలనే రెండే గ్రహాల మీద ! ఆ రెంటికీ ఆధారం ''నేను''

మానవ జన్మ మహోన్నతమైనది. జీవితాన్ని ఆనందమయంగా మార్చుకోవటానికి అనుకూలమైనది ఈ జన్మ. మంచి చెడుల విచక్షణ కలిగి వినూత్న జీవనయానాన్ని సాగించడానికి అవకాశం మానవునికి ఉంది. కానీ! ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చకపోతే సుఖ దుఃఖాల వలయంలో చిక్కుకొనక తప్పదు. దాని నుండి బయటపడటానికి ప్రయత్నాలు చేస్తుంటాడు. ఆ ప్రయత్నాలు విఫలమవుతుంటే భారమవుతుంది జీవితం. అప్పుడు తన గ్రహస్థితి బాగులేదనుకుంటాడు. తన జీవితంలో ''శని గ్రహం'' ఆవహించింది అనుకుంటాడు. ఆ శనిగ్రహానికి శాంతులు చేయించాలనుకుంటాడు. ఆ ప్రయత్నాలు చేస్తుంటాడు. అయినా లాభం లేదు. జాతక చక్రాలు వేయించుకుంటాడు. రంగురాళ్ళను ఉంగరాలకు పొదిగించి ధరిస్తాడు. జీవితంలో మార్పు కనిపించ లేదు. ఇక మిగిలినవి నోములు, వ్రతాలు, మొక్కుబడులు. వృక్షాల చుట్టూ ప్రదక్షిణలు, దేవుళ్లకు ముడుపులు, తీర్థ యాత్రలు ఇవన్నీ చేస్తుంటాడు. ఏంచేసినా ప్రయోజనం రవ్వంత కనిపించక పోయేసరికి నిర్వీర్యుడై నీరసించి చతికిలబడతాడు. ఇలా తను నీరసించి జీవితాన్ని ఏవగించుకోవటానికి కారణం ! నేను నాదనే భ్రమ. తనవాళ్ళపై మమకారం, తనపై అమితమైన అభిమానం, ఆ అభిమానం వలన రాగం పుడుతుంది. తన రాగం (ప్రేమ) అంతా తనకు, తన కుటుంబానికి, తన బంధుగణానికి పరిమితం చేసి ఆ పరిధిలో భ్రమిస్తూ, పరిభ్రమిస్తూ ఉంటాడు. తను కోరుకున్నది నెరవేరనప్పుడు తను కోరుకున్నట్లు బ్రతుకు సాగనప్పుడు విపరీతమైన అసహనం పుడుతుంది. తను పొందని ఆనందాన్ని వేరొకరు పొందితే వారిపై ఈర్ష్య అసూయ కలుగుతుంది. తద్వారా వారిపై ద్వేషం కల్గుతుంది. మనకన్నా వాడు గొప్పగా బ్రతకగల్గితే చూసి ఓర్వలేము, తట్టుకోలేము. దీని వలన మనలో అశాంతి రేగుతుంది. తద్వారా చీకటిగా మారుతుంది జీవితం. మనకి ఒకరిపై రాగం ఉంది

అంటే వేరొకరిపై ద్వేషం ఉండక మానదు. అమితమైన రాగం మనిషిని పరిమితుణ్ణి చేసి పూర్ణ జీవితాన్ని అనుభవింప చేయదు. వ్యక్తి జీవితాన్ని వికసింపచేయదు.

మన జీవితం మనచేతిలో ఉంది అని అనుభవజ్ఞులు చెపుతున్నారు. నవగ్రహాలు మన జీవితాన్ని ఆనందంగా నడపలేవు. రాగద్వేషాలు వలన జీవితం సుఖవంతం కాదు. ద్వంద్వ బుద్ధి పోనంతవరకు, అంతరాలతో కూడుకున్న బ్రతుకు తప్పదు. అది రహితమైతే సంతోషప్రదమైన కాంతివంత జీవితం అనుభవంలోకి వస్తుంది. రాజ్య కాంక్ష, పదవీ వ్యామోహం, తనపై తనకు గల రాగం, తన దాయాదులపై గల ద్వేషం సుయోధనుని ఆశలను, అహాన్ని అంతమొందించాయి. దాయాదులైన, ధర్మ బద్ధులైన పాండవులపై గల ద్వేషంతో ఘోర కృత్యాలు తలపెట్టి, అనేక ఇబ్బందులకు గురిచేసాడు. పూర్ణజ్ఞాన స్వరూపుడైన శ్రీ కృష్ణుడు నచ్చజెప్పినా పాండవులకు సూదిమొన మోపినంత నేలనివ్వనని గర్వంతో పలికాడు. తుదకు తనవాళ్ళు, తాను అపజయానికి లోనై మట్టిపాలయ్యాడు. అహంకారి, అధర్మవర్తనుడు అనిపించుకున్నాడు. రాగ ద్వేషాలకు దూరులైన పాండవులు ధర్మవర్తనులనిపించుకున్నారు.

కనుక రాగద్వేషాసూయలవలన జీవితం సుఖమయం కాదు. అవి వీడితే శాంతికి కొదవేలేదు. రాగద్వేషాలకు మూలము అహంకారమయితే దీనికి ఆధారమైనది అహంగా ఉన్న "నేను". ఆ నేను ఆత్మ–అదే అన్ని ఇంద్రియాలకు ఆధారం. దీని ద్వారానే అవి విషయాలను గ్రహిస్తాయి. దాని ద్వారానే సర్వసుఖాలను అనుభవిస్తాయి. ఆ "నేను" కృపతోనే శాశ్వితానందాన్ని పొందగలము. ఆ "నేను" యొక్క జ్ఞానమే ఆత్మ జ్ఞానము. అదే గురువై, మహనీయులై వచ్చి సత్య జ్ఞానమును (ఆత్మ జ్ఞానమును) ప్రసాదించి తనకు తానుగా ప్రకటమవుతుంది. ఆ నేనే (ఆత్మ) గ్రహగోళాదులకు ఆధారం. అందుకే అమ్మ నవగ్రహాలకు ఆధారం "నేనే" (ఆత్మ/పరమాత్మ) అన్నారు.

శ్రీ పరాత్పరికీ జై !!

అవసరమే విలువైనది

ఉదయం నిద్రలేచినది మొదలు రాత్రి నిద్రలోనికి జారుకున్నంత వరకు ఏదో ఒక అవసరంతోనే, ఆ అవసరం తీర్చుకునే ప్రయత్నంలోనే సాగుతుంది మన బ్రతుకు. ఒక అవసరం మనల్ని చికాకుకు గురిచేస్తుంది. ఇంకొక అవసరం మనల్ని కార్యోన్ముఖులను చేసి చక్కని సంతోషదాయకమైన ఫలితాన్నిస్తుంది.

ఎరుకల కులానికి చెందిన ఏకలవ్యునికి విలువిద్య నేర్చుకోవాలనే కోరిక కలిగింది. తనకది వృత్తిపరమైన అవసరం. కనుకనే ద్రోణాచార్యుల వారిచెంతకు చేరాడు. తనకు విలువిద్య నేర్పి విలుకాడుగా తీర్చి దిద్దమన్నాడు. కులభేదం చేత క్షత్రియులకు తప్ప వేరెవ్వరికీ విద్య నేర్పనన్నాడు. ప్రార్థించినా లాభం లేదన్నాడు ద్రోణుడు. ఏకలవ్యుని మనస్సు చివుక్కుమంది, చింతకు గురయ్యింది. విద్య నేర్చుకోవడానికి కులం అడ్డమయ్యింది. విచారించాడు, విచారణచేశాడు. కృషి, పట్టుదల, కార్యదీక్షతో మట్టి ప్రతిమను చేసి, దానినే గురువుగా భావించి శ్రద్ధతో పూజించి విలువిద్యాభ్యాసం గావించాడు. తన ప్రయత్నం తన దృఢ సంకల్పం ఫలించి అసమాన విలు విద్యా నిపుణుడిగా తయారయ్యాడు. ద్రోణుని ప్రియశిష్యుడు, మహావీరుడైన అర్జునుని మించిన విలువిద్య ఏకలవ్యునికి అబ్బింది. చూశారా.... విద్య నేర్చవలెనన్న కోరిక అవసరంగా మారి అసమానుడిగా అతన్ని తీర్చిదిద్దింది. అందుకే అవసరం ఎంతో విలువయినది అని అమ్మనుడివారు. షిరిడీ నివాసి అయిన బాగోజీ దేహం కుష్ఠురోగానికి గురై తీవ్రమైన మనోబాధను, దేహబాధను కలిగించింది. ఎందరో వైద్యులను కలిసాడు, ఎన్నో మందులు తిన్నాడు. కానీ ఫలితం శూన్యం. జీవితం దుఃఖమయమయ్యింది. ఎవరో మిత్రుడు చెప్పగా మందు నిమిత్తం సాయిబాబాను దర్శించి తన బాధను విన్నవించుకున్నాడు బాగోజీ. బాబా కర స్పర్శతోనే బాబా ఇచ్చిన విభూతి

సేవనంతోనే తన వంటికున్న కుష్ఠురోగం మటుమాయమైంది. బాబా భక్తుడై జీవితాంతం ఆ మహానుభావుడైన సాయినాధుణ్ణి భక్తి ప్రపత్తులతో సేవించి, వైరాగ్య పూరితుడై బాబా అనుగ్రహానికి పాత్రుడై తరించాడు బాగోజీ. తనకు మందు అవసరమై బాబా సన్నిధికి వెళ్ళి సాయి అనుగ్రహానికి పాత్రుడై జీవన్ముక్తుడయ్యాడు. ఆ మందు అవసరం బాగోజీకి మహావరంలా పనిచేసింది.

అందుకే అవసరం చాలా విలువైనది. అది మన బాధ్యతను తెల్పుటయే కాక ఒక్కొక్కప్పుడు మనల్ని తీర్చిదిద్ది ఆనంద తీరాలకు తీసుకుపోతుంది. అందుకే అమ్మ అవసరమే విలువైనదని పలికారు.

శ్రీ పరాత్పరికీ జై !!

వర్గం లేనిది స్వర్గం

ఈ విభేదాలన్నీ మన మనస్సు సృష్టించినవే. అది దాని లక్షణం తన అసలు రూపాన్ని, స్థానాన్ని, మరచి పెత్తనాలు చేస్తూ ఉంటుంది. విభజించడం దాని గుణం. వేరు చేయడం వేరుగా చూడడం దాని పని. తన స్థానమైన ఆత్మను విడిచి ప్రత్యేకమైన ఉనికిని ఏర్పాటు చేసుకుని బాహ్యాభావంతో, దేహమోహంతో చరిస్తూ ఉంటుంది. ప్రపంచ భావనలో, మునుగుతుంది, జీవున్ని ముంచుతుంది, పరమాత్మ భావాన్ని మరిపిస్తుంది. భిన్నత్వంగా తోపింపజేసి ఏకత్వ భావాన్ని కలుగకుండా జేస్తుంది ఈ మనస్సు. నేను–నాది, మేము–మాది అనే రాగమోహాలను, మీరు వేరు అనే ద్వేషభావాల్ని సృష్టించింది ఈ మనస్సే. విభేదాలు సృష్టించి, ఎన్నో వైపరీత్యాలకు దారి తీసింది, వర్ణాలు సృష్టించింది, వర్గాలు ఏర్పాటు చేసింది, కులాలు ఏర్పర్చింది, కుమ్ములాటలు, కలహాలు, కల్లోలాలు, యుద్ధాలు, మరెన్నో వినాశకర సంఘటనలను సృష్టించింది త్రిగుణ కలితమైన ఈ మనస్సు. అసలు సత్యం అర్థంకాక,

అనుభవంలోకి రాక ఈ వర్గ భేదం. దేహాలు పాంచ భౌతికమ్మైనవి. అందులో అందరిలో ఉన్నది ఒకే సత్యాత్మ. ఈ సత్యం గమనించి, జ్ఞానం కల్గి ఉంటే వినాశనం లేదు. వినూత్న జీవన సరళి ఉంటుంది. ఇది వాస్తవం. అయినా మనస్సు కల్పించిన ఈ వర్గ, కుల, మత లింగ భేదాలు తరతరాలుగా నరాలలో జీర్ణించుకుపోతే అసలు సత్యం ఎలా హృదయానికి పడుతుంది?. జగద్గురు ఆదిశంకరాచార్యులవారే ఒకానొక సమయంలో ఈ వర్ణ, వర్గ భేదానికి గురయ్యారు. విశ్వనాథుని సందర్శనార్థం యజ్ఞోపవీతం ధరించి, నావమాలు దిద్దుకొని, దండకమండలాలు చేత బూని ఈశ్వరుని స్మరిస్తూ ఆలయం వైపు నడుస్తున్నారు. ఇంతలో ఎవరో ఎదురుగా వస్తున్నారు. ఎవరు?!!... నల్లని చెమటపట్టిన శరీరం కలిగి, గోచీ ధరించి, ఒక చేతితో కర్ర పట్టుకుని, కుక్కల్ని వెంట బెట్టుకొని వస్తున్న ఛండాలుని చూశాడు. ప్రక్కకు వైదొలగనంత ఇరుకుగా ఉంది దారి, శంకరాచార్యుల వారు ఛండాలుని చూసి అసహ్యించుకుని, పంచముడన్న భేదభావంతో ప్రక్కకు తొలగు! నీవు అంటరానివాడివి! నీవు ముట్టుకుంటే నా ఆచారానికి భంగం వాటిల్లుతుంది అని చికాకుగా వదనముంచి పరుషంగా పలికారు శంకరులు. అప్పుడు ఆ వ్యక్తి "అదేటి సామీ..... నాను ముట్టుకుంటే మీ ఆసారం ఎందుకు సెడిపోద్ది సామీ.... అన్నాడు" అందుకు శంకరులు అతనిపై మండిపడి, ఓరీ! అంటరాని అధముడా! నేను సద్బ్రాహ్మణుడను, నిష్టా గరిష్ఠుడను, శాస్త్రజ్ఞానం కలవాడను అటువంటి నాకు, కడజాతి వాడివి, అజ్ఞానబద్ధుడవైన నీకు తేడా లేదా! నీవు ముట్టుకుంటే నా ఆచారానికి తప్పకుండా భంగం వాటిల్లుతుంది అన్నారు శంకరులు. అందుకు ఆ ఛండాలుడు "సామీ... నాకు తెలవకడుగుతాను అందరి దేహాలన్నీ పంచభూతాలతో తయారయినవి కాదా బావూ...? నేకపోతే మాజాతోల ఒల్లు అశుద్ధంతో తయారయ్యాయా

బావూ... మాకు ఏరేగా మీకు ఏరేగా ఆత్మలు ఉన్నాయా బావూ... ఎవుల్లి ప్రక్కకి తొలిగిపోమంతారు సామీ... దేహమయితే జడము అదెక్కడికి ఎల్లలేదు. లోన ఉన్న ఆత్మయితే అది అందరిలో ఉందికదా బావూ... అంతటా సందులేక ఉందికదా... లో నున్నది ఏటు ఎల్లమంతే అటుపోతాదీబొంది సామీ... అందరిలో ఒకటే ఉంతే ఇయన్నీ ఈ భేదాలన్నీ ఎవులు కలిపితం సేసినారుసామీ సెప్పండి!? ఈస్సురుడే అణువణువనుంతే ఏరేగా బాపనోలని, రాజులని, వూలోలని, శూద్రపోలని ఉన్నారా బావూ... సెప్పండి?! ఏగిరం సెలవియ్యండి " అన్నాడు ఛండాలుడు''. ఆది శంకారాచార్యుల వారు ఛండాలుని వాక్కుల నుండి సంతతధారగా వస్తున్న సత్యవచానాలకు నిశ్చేష్టుడై, నిలుచుండి పోయాడు, అంతర్ముఖుడయ్యాడు లోన అంతర్మధనం జరిగింది. అంతర్యుద్ధంలో నేను, నీవు, బ్రాహ్మణ, మాల.... వంటి వర్గ, వర్ణాలను సృష్ఠించే అహంవృత్తి నశించింది. తక్షణమే శంకరులు ఛండాలుని కాళ్ళపై పడ్డారు. సాక్షాత్తు శివుడే తనని ఈ రూపంలో పరీక్షించాడు నా అజ్ఞానతిమిరాన్ని పారద్రోలాడని ప్రార్ధించారు, కీర్తించారు ఆదిశంకరులు.

కనుక ఉన్నది ఒకే ఒక సత్యం అదే సర్వాధారమైన పరమాత్మ అనే యధార్థం అవగతమైతేగాని ఈ వర్గ భేదాలు అంతంకావు. ఈ కులమత విభేదాలు అంతరించవు. మన గుణాన్ని బట్టి కర్మలు చేసుకుంటున్నాముగానీ, కుల భేధాన్ని, మత భేదాన్ని, లింగ భేదాన్ని సృష్టించింది మనమే, మన మనస్సే అని గమనించి వర్గరహితమైన సద్గుణాల్ని అలవర్చుకుంటే జీవితం మాధుర్యాన్ని సంతరించుకుంటుంది. భువి స్వర్గమవుతుంది.

శ్రీ పరాత్పరికీ జై !!

ముముక్షత్వమే మోక్షం

సమస్యలతో కూడుకొని అలసట, అలజడిలతో, కోరికల భారంతో, ఒడుదుడుకులతో, కష్టనష్టాలతో, యాతనలతో మంద్రంగా బ్రతుకు సాగుతూ ఉంటుంది. ఎన్ని కోరికలు తీరినా, కొత్త కోరికలు చిగిరిస్తూ ఉంటాయి. అందులోంచి బయట పడడానికి మార్గమేమిటా అని ఆలోచిస్తూ, బయడపడగలననే క్షణిక ధీమాతో సంతసిస్తూ, ప్రయత్నిస్తూ ఉంటాడు. స్వేచ్ఛకై ఈ ప్రయత్నం సాగుతున్న తరుణంలో సమస్యలు తరముకువస్తూ మరింత బలహీనున్ని చేసి, బలంగా బంధించి స్వేచ్ఛ లేకుండా చేస్తాయి. దీనితో పాటు గతం గుర్తుకు వచ్చి మరింత గ్రుచ్చుతూ ఉంటుంది. భవిష్యత్ భయభ్రాంతులకు గురి చేస్తుంది. ఇలా గతం చింతనవలన, భవిష్యత్ ఊహలవలన వర్తమానకాలం వ్యర్థమవుతుంది. ఈ బంధించే కోరికలు, తరముతున్న తలంపులు, గతంచింతన, భవిష్యత్ ప్రణాళికలు ఇవన్నీ ఎవరు కల్పించారు?... మనచిత్తమే కల్పించింది. అదే భ్రాంతిమయ అంతర్ జగత్తును సృష్టించింది. జీవున్ని బాధ పెడుతూ ఉంది. అప్పుడు విచారణ కలిగి ఇదంతా చిత్త సంసారం. అందుకే భరించలేని ఈ బాధాభారం అని గ్రహించిననాడు అనంతుడైన, రక్షకుడైన ఈశ్వరుని శరణువేడితే గురువైవచ్చి మోక్షజ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. అసలు సత్యమేదో ఎరిగిస్తాడు. అజ్ఞాన భావాన్ని తొలగిస్తాడు. అప్పుడు బాహ్యంగా సంసార జీవితాన్ని గడిపినా, మోక్షమునందు అపేక్షకలవాడై నిరంతరం భగవంతుని అనన్యంగా చింతన చేస్తూ ముముక్షువవుతాడు. బాహ్య విషయములయందు ఆసక్తిలేక, అవసరం మేరకు స్వీకరించి, కర్తృత్వ, భోక్తృత్వములు లేక నిత్య ముక్తుడై ఉంటాడు. సర్వం పరమాత్మ స్వరూపంగా భావన చేస్తూ జీవిస్తూ ఉంటాడు.

మముక్షువు అనగా వేదాంతపరిభాషలో మోక్షమునందు అపేక్షగలవాడని అర్థం. మోక్షమనగా విడుదల అని అర్థం. దేని నుండి విడుదల? బంధం నుండి, చిత్తం కల్పించిన సంసారం నుండి, చింత నుండి ఎప్పుడైతే గురుజ్ఞానం కల్గిందో చింత ఎగిరిపోతుంది. శాంతి అనుభవమవుతుంది. అది అనంతమైన నిత్యమైన, నిర్మలమైన శాంతి. ఈ శాశ్వతమైన శాంతికై పడే ఆరాటమే ముముక్షత్వం. తద్వారా ప్రాప్తించేది మోక్షం. నేను కూటబెట్టుకున్న పాప పర్వతాన్ని తొలగించుకొని తరించే తరుణోపాయం చెప్పండి మహాప్రభో... అని భోరున ఏడ్చిన కిరాతకుడైన రత్నాకరునికి, నారద మహర్షి బంధవిముక్తుణ్ణి చేసే రామనామాన్ని నాల్కపై లిఖించారు. నామాన్ని జపించి, స్మరించి, తపించి, తరించమన్నారు. అంతే విముక్తి పొందాలనుకున్నప్పుడు కిరాతకుడైన రత్నాకరుడు మముక్షువై మోక్ష ప్రాప్తికై అక్కడే కూర్చున్నాడు. కళ్ళు మూసాడు, ఒల్లు మరిచి పోయాడు. రామనామంతో తడిసిపోయాడు, తమోగుణం అంతరించిపోయింది. రజోగుణం రాలిపోయింది. శుద్ధత్వం ప్రాప్తించింది. శుద్ధుడయ్యాడు. ఋషి అయ్యాడు, జీవన్ముక్తుడయ్యాడు. తరువాత రామ చరిత్రను లిఖించి లోకాదర్శమైన గ్రంథాన్ని మానవ జాతికి అందించిన మహాత్ముడయ్యాడు.

అందుచేత ముముక్షత్వమే మోక్షమని అమ్మ సందేశమిచ్చారు.

శ్రీ పరాత్పరికీ జై !!

నవ్వుతూ అనుభవించే వాడి దగ్గరకు ఏడుస్తూ అనుభవించేవాడు సలహాలకు వస్తాడు.

మన జీవితాలు సుఖదుఃఖాలతో, బరువు బాధ్యతలతో, చీకటి వెలుగులతో నిండి ఉన్నాయి. ప్రతీ ఒక్కరికీ ఎప్పుడూ కొద్దో గొప్పో ఏదో ఒక సమస్య వెన్నంటి ఉంటుంది. దీని వలన వెలితిగా ఉంటుంది. ఆసమస్య విజృంభిస్తే తట్టుకోలేక దుఃఖ పడతాము. సమస్య పరిష్కారం కోసం అన్వేషణ చేస్తాము. హితునికో, స్నేహితునికో విన్నవించు కుంటాము. వారి సలహా సందేశాలు కొంత ఊరట కల్గిస్తాయి. కొద్ది రోజులు ప్రశాంతంగా సాగినట్లనిపించి మళ్ళీ తిరగబడతాయి సమస్యలు. తట్టుకోలేము, ఎన్ని ఆలోచనలు చేసినా అవి అంతమొందవు, నా బ్రతుకేమిట్రా ఇలా దిగజారిపోతుంది దేవుడా! అని ఏదో ఒకనాడు మొరపెట్టుకొనక తప్పదు. సాధు సత్పురుషులెవరైనా లభ్యమైతే వారిని దర్శించి తన సమస్యలను పరిష్కరించు కోవాలనే తపన ప్రారంభమైనప్పుడు అమ్మలాంటి, మహాత్ముల సన్నిధి లభ్యమవుతుంది. వారి సాన్నిధ్యాన్ని చేరాక, చెప్పకనే, అడుగకనే శాంతి లభ్యమవుతుంది. ఏదో ఒక విధంగా సమయం చూసి మన కష్టాన్ని వారి చెవిలో వలకబోస్తాం. వారు చిరుహాసం చేసి ఈ తిప్పలకు కారణం, మనో వికారమని తెలియజేసి, నిజజ్ఞానాన్ని ప్రసాదించి, పరిష్కారమార్గాన్ని చూపుతారు. అప్పుడు మనకు అర్థమవుతుంది. మహనీయులకు, పూర్ణ జ్ఞానులకు, సాధువులకు ఒక్కమాటలో చెప్పాలంటే దేహాన్ని ధరించిన ప్రతిఒక్కరికీ నిందలు, బాధలు, యాతనులు తప్పవని వాటిని చింతిస్తే జీవితానికి శాంతి ఉండదు అని గ్రహిస్తాము. జ్ఞాని ఇవన్నీ దేహ ప్రారబ్ధాలని గ్రహించి, బ్రహ్మనిష్ఠుడై యుండి పూర్ణానందాన్ని నవ్వుతూ, సంతోషంగా అనుభవిస్తాడు. అటువంటి మహనీయుల దగ్గరకు, మనస్సుకులోబడి బాధగా బ్రతుకుతున్న మనం సలహాలకు వెళ్తాము. ఇది మనందరి

అనుభవమైనా వారి సన్నిధి జ్ఞానాన్ని శాంతిని అనుగ్రహిస్తుంది. తద్వారా మన దుఃఖం నశించి ప్రారబ్ధాన్ని సంతోషంగా అనుభవించ గల్గుతాము.

ఈ రోజు అలయాలు కట్టి, విగ్రహం పెట్టి, కిరీటాలు ధరిస్తునాము షిరిడీలో భిక్షమెత్తుకునే సాయి బాబా అనే ఫకీరుకు. "సర్వానికీ ఈశ్వరుడు యజమాని, ఆయనకు నేను బానిసను" అని నిరాడంబర జీవితాన్ని గడిపే సాయిబాబాను షిరిడీవాసులు ఇరవైసంవత్సరాలు నీరు త్రాగే బావి దగ్గరకు రానివ్వలేదు. అందరూ పారబోసిన ఎంగిలి నీరు త్రాగి జీవించాడు... బావిదగ్గరకు రానివ్వలేదని బాధ పడలేదు, లోలోన కృంగి పోలేదు. ఆయన అంతరంగమంతా అల్లా (ఈశ్వర) భావనే తప్ప బాహ్య జీవితము గురించి చింతలేనే లేదు. దేహాభిమానం అసలు లేదు. కొన్ని మైళ్ల దూరాన ఉన్న ఒక ఊరిలోని కుమ్మరి వాని బిడ్డ తల్లి ఒడి నుండి నిప్పులలో పడితే తను వెలగించిన ధుని (నిత్యాగ్ని హోత్రము)లో చేయి పెట్టి రక్షించారు. చేయి బాగా కాలింది. బొబ్బలు లేచాయి అది చూసి ఒక భక్తుడు ఏడుస్తూ ఏంటి బాబా ఈ పిచ్చి పని అంటే... " చెయ్యి కాలితే కాలింది బిడ్డ రక్షింపబడింది అని పలికారు, రెండువేల పిడకలు పెట్టి ఈ శరీరాన్ని తగుల బెట్టినా చలించకూడదు. ఇదే నిజమైన జ్ఞానానికి గీటురాయి" అని ప్రబోధించారు. అంత బాధను ఆనందంగానే అనుభవించారు. కానీ! ఆయనకు దగ్గరకు ఏడ్పుఘోషలతో ఎంత మంది సలహాల కోచ్చారో వాళ్ల వాళ్ళకు ఎరుక. జ్ఞానం సిద్ధించిన మహాత్ములందరికీ మనలాగే బాధలున్నా వాళ్లు నవ్వుతూ అనుభవించారు. ఏడుస్తున్న మనలాంటి దీనులం వారి సన్నిధికి చేరవలసినదే, తరించవలసినదే. వారి సలహాలు, సందేశాలు, జీవితానికి వెలుగుబాటలు, అమృతపుమూటలు.

శ్రీ పరాత్పరికీ జై !!

సంఘటనల కూర్పే జీవితం

మనిషి జీవితం విషాద వినోదరాగాల సముదాయం. తల్లి గర్భమందు ఏమి తెలియని నిద్రాణమైన స్థితి. బయటపడగానే బాలారిష్టాలు, తరువాత అమ్మ నుండి పరిసరాలు గుర్తించే వైనం, పిదప ఆట పాటలతో తెలిసీ తెలియని బాల్యం, అటు పిమ్మట ఇంద్రియాల సంచలనం, కామవాంఛ, దేహవ్యామోహం, అలా అలా కొంత కాలం గడిచాక వివాహ బంధం, పిల్లలు, సంసార బాధ్యత, భారం అనిపించడం, చింతించడం, శాంతి లేకపోవటం, సహనాన్ని దాచుకోలేకపోవడం ఇవన్నీ చుట్టుముట్టాక, దేహం వంగిపోవటం, దృష్టి తగ్గటం, వినిపించక పోవటం, చీమలదండులా రోగాలు దేహాన్ని చేరి బాధించటం, ఏమీచేయలేని చేతకానితనం ఇలా .... ఇలా .... కొన్నాళ్ళకు, నేలలో కలిసిపోవడం ఇవన్నీ సంఘటనలే. ఇవన్నీ విజృంభనలే. ఇవి ఎన్ని వైపరీత్యాలను సృష్టించాయో, ఎంత మనల్ని బాధపెట్టాయో ఎన్ని విభిన్న మజిలీలు మన జీవితాన్ని కృంగదీసాయో, ఎన్ని సంఘటనలు మనకు క్రొత్త పాఠాలు నేర్పి నడిపించాయో మనకేఎరుక.

అయితే మనం చేయవలసిందేమిటి ? పశుప్రాయమైన జీవితం గడపటంకాదు. పరిశుద్ధమైన నవ్యత్వాన్ని ఆపాదించుకుని కాంతి జీవితాన్ని పొందాలి. దేహం ఎప్పటికైనా నేలచేరకమానదు. అది మనసొత్తు కాదు. కర్మానుభవం కోసం ఏర్పడినదే ఈ శరీరం. దీనిపై మనకి అధికారం లేదు. కాని దీనివలన ఉపయోగముంది. దీని ద్వారానే, దీన్ని సహాయంతోనే దివ్యత్వాన్ని పొందగలం. దివ్య జీవితాన్ని అనుభవించగలం. సద్గురుబోధచే మేల్కొని దీన్ని సద్వినియోగపర్చుకోవాలి. అనంతుడైన ఆ దేవదేవుని ధ్యానిస్తూ జీవించాలి. అప్పుడే జరామరణాలకు అతీతమైన

అమృతత్వాన్ని పొందగలం. ఏ సంఘటనా మనల్ని బంధించదు. దాని ద్వారా భోధ లభిస్తుంది. దృఢత్వం ఏర్పడుతుంది. సమస్యలు సందేశాల్నిస్తాయి. ఆనందానికి చేరువచేస్తాయి. నిస్సంగుని చేస్తాయి, నిత్య తృప్తునిగా మారుస్తాయి. గురుబోధచే తేరుకుంటే బాధించే సంఘటనలే మనల్ని సంస్కరించి సత్య జీవితాన్ని ప్రసాదిస్తాయి. వెంకట్రామన్ బాల్య జీవితంలో జరిగిన మృత్యానుభవ సంఘటన తనని అరుణాచలం లాక్కుపోయి భగవాన్ రమణ మహర్షిని చేసింది.

ఏ సంఘటన ఎవర్ని ఎలా తీర్చిదిద్దుతుందో ఆ సర్వాధికారి అయిన ఈశ్వరునికే ఎరుక !!

శ్రీ పరాత్పరికీ జై !!

శిల్పానికి అందంరావాలంటే ఉలిదెబ్బలు అవసరం

నేలతల్లి గుండెల్లా ఉంటాయి కొండలు. ఆ కొండలకి రంధ్రాలు వేసి, పేల్చే మందును దట్టించి, నిప్పు పెట్టితే భీకర శబ్ధం చేస్తూ పెద్దపెద్ద రాళ్ళు ఆ కొండనుండి పగిలివస్తాయి. ఆరాళ్ళూ, సమ్మెట దెబ్బలు తింటాయి. కొన్ని సుత్తి దెబ్బలు తింటాయి.

వీటిలో కొన్ని పునాదిరాళ్ళుగా, ఇంకొన్ని రహదారికి ఉపయోగపడే చిన్న చిన్న రాతిముక్కలై తారులో కలిసి అందమైన రహదారిగా మారి మనల్ని, మన వాహనాలను మోసి భరిస్తాయి. మరికొన్ని రాళ్ళు ఆలయానికి మెట్లుగా ఉపయోగపడితే అరుదైన కొన్ని రాళ్ళు ఆలయంలో ప్రతిష్ఠించబడే శిల్పంగా రూపుదిద్దుకొంటాయి. ఆ రాయి

శిల్పంగా మారటానికి ఎన్ని ఉలిదెబ్బల్ని, నునుపుగా రావటానికి ఎంతరాపిడిని ఓర్చుకుంటుంది. అప్పుడు కదా ఈ దెబ్బలు, ఈ రాపిడ్లు అయిన తరువాత కదా..... ఏ పీఠాధిపతి చేతులమీదుగానో, ఏ మహానుభావుడి చేతులమీదుగానో ఆలయంలో ప్రతిష్ఠింపబడి ఆరాధనకు, అర్చనకు నోచుకుంటుంది. పుష్పమాలలను ధరించే అర్హతను సంపాదించగల్గుతుంది. మహనీయులుగా ఆరాధింపబడుతున్న వారందరిదీ ఇదేవరుస. ఎన్ని నిందలు భరించారో, ఎన్నెన్ని బాధలు ఓర్చారో, చలికి, ఎండకు, వానకు, గాలికి, ధూళికి లొంగక పరమాత్మ భావనలోనే జీవించారు. మహా తాత్వికుడైన సోక్రటీసును అతని భార్య ఎంతగానో హింసించి, సమాజం పిచ్చివాడని దూషించి, విషం ఇచ్చి చంపింది. ఎందుకని ?! అనాదిగా సాగుతున్న మానవ మౌఢ్యాన్ని దునుమాడాడు కాబట్టి, సత్యాన్ని ప్రవచించాడు కాబట్టి, సత్యంగా నడిచాడు కాబట్టి ఆయన దేహం పోయిన పిదప, ఏ సమాజం ఆయన్ని హింసించిందో అదే సమాజం ఆరాధిస్తున్నది. మహాత్ముడంటున్నది. ప్రపంచ తాత్వికుడంటుంది. ఆ నిందలు, ఆ బాధలు, ఆ సమస్యలు సోక్రటీసు జీవిత శిలకు ఉలిదెబ్బలై ఆరాధ్య శిల్పంగా తీర్చిదిద్దాయి. మానవలోకానికి అటువంటి మహనీయుల జీవితాలు ఆదర్శములై ఆచరణ సందేశములైనాయి. మన జీవితాలు కూడా ఇంతే!.... ఎన్నో భరిస్తేగాని ఈ భారంపోదు, తరింపు రాదు, తేజరిల్లదు. కనుక జీవితములో ఎదురైన సంఘటనలతో రాజీపడకుండా సత్యభావంతో సాగిపోతే జీవితం వెలుగొందుతుంది. వెన్నెలై కాంతులీనుతుంది.

శ్రీ పరాత్పరికీ జై !!

ఇతరులతో తగాదా ఆడటం పోరాటం
తనతో పోరాటమే ఆరాటం

మన భావానికి వ్యతిరేక భావం ఉంటే మనం ఎదుటివారితో పోరాడుతాము. మనం చేసిందే, మనం చెప్పిందే సత్యమని వాదిస్తాము. అవతలివారి మాటను ఇంచుకైనా విని అర్థం చేసుకోము. ఎంతసేపూ మనం పట్టుకున్న కుందేలుకి మూడుకాళ్ళున్నాయన్న వాదనేతప్ప. ఎదుటివాడు నాలుగు కాళ్ళున్నాయని అంటున్నాడు అందులో ఎంత సత్యముందో పరిశీలిద్దాం అనే భావమే రాదు మనకి. కారణం ? మనమీద మనకి గల గ్రుడ్డి నమ్మకం. ఇది బాహ్యమైన విషయానికి వస్తే, నిరంతరం సుఖంగా ఉండాలని, ఆ సుఖం వస్తు వాహనాల వలన మాత్రమే లభిస్తుందని భ్రమసి బాహ్యాభావాన్ని పెంపొందించుకొని బ్రతుకుతో పోరాటం సాగిస్తాం. ఎప్పటికీ అనుకున్న నిత్యానందం లభ్యంకాదు. ఇలా బాహ్యాభావంతో ఉంటే ఎప్పటికీరాదు. ఇంచుక బ్రతుకు నడక అర్థమై, అవగాహనైతేనో..... తనను తాను పరిశీలించుకుంటాడు.... అప్పుడు, తెలుస్తుంది.... అనవసరంగా బయట జీవన పోరాటం చేసాను. నా భావానికి అడ్డుగా ఉన్న వారితో పోరాటం చేశాను ఇది శుద్ధతప్పని. దీనికి కారణం, అంతరేంద్రియముల చంచల గుణమని తరువాత శోధిస్తాడు. వాటిని జయించే మార్గమేదని ఆ శోధనలో సాధుసత్పురుషుల దర్శన భాగ్యం కల్గి వారెరిగించిన జ్ఞానంతో, ధ్యానంతో, అంతరేంద్రియములను జయించటానికి శాంతిమయపోరాటం చేస్తాడు, బాహ్యాన్ని ఓర్చుకుంటాడు, సహనాన్ని అలవర్చుకుంటాడు. ఇదే సత్యమైన దైవసాన్నిధ్యాన్ని పొందటానికి పడే ఆరాటం.

ఆ ఆరాటమే ఆనంద నిలయమైన తన నిత్య నిర్మల

స్వరూపమైన ఆత్మ దగ్గరకు తీసుకుపోతుంది. ఈ ఆరాటమే సత్యాన్వేషణ. తొలుత రమణ భగవాన్‌కి ఈ అంతరపోరాటమే జరిగింది. మరణానుభూతి కలిగినప్పుడు సకల ఇంద్రియముల సంచలనం ఆగినా, లోన "నేను - నేను" అనే అహంస్ఫురణ తనంతటతానే లోన ప్రకాశించింది. ఈ జడ దేహం పోయినా ఆ "నేను" మిగులుతుంది అనే సత్యం గ్రహించారు రమణ మహర్షి. ఆ "నేను" నేనుగాని ఈ దేహంతో తాదాత్మ్యం చెందే ఈ మిథ్యా నేను (అహంకారం/మనస్సు) నేను కాదని తోచి, ఆ నేను మూలాన్ని ఆరాటంతో అన్వేషించి ఆ మూలాన్ని తెలుసుకుని, మూలమైన నేనుగా జీవించి భగవాన్ రమణ మహర్షిగా జగదారాధ్యులైనారు.

కనుక ఇతరులతో పోరాటం అశాంతినిస్తుంది. తనలో తనతో పోరాటం ఆరాటమై తన స్వరూప దర్శనాన్ని ప్రసాదిస్తుంది.

శ్రీ పరాత్పరికీ జై !!

కలత లేకపోతే నలత ఏమి చేస్తుంది

బాహ్యమైన ప్రతికూలమైన విషయాన్ని భావములో పెట్టుకున్నప్పుడే కలత వస్తుంది. చెప్పుకోలేని బాధకలుగుతుంది. వెలితి వెలితిగా ఉంటుంది. అనుకున్నది తనకు జరగలేదని, తనచేతికి రాలేదని ఎంతగానో బాధపడతాం. ఇదే కలత. ఇది ఒక్కరితో సరిపెట్టుకొని ఉండదు. మనల్ని, మనల్ని నమ్ముకున్నవారిని కలతకు గురిచేస్తుంది. ఒక్కరివలన నావాళ్ళు అని అనిపించుకున్న వారి వరకూ కలరా వ్యాధిలా వ్యాపించి అందరినీ కలచివేస్తుందీ కలత. అనుకూల పరిస్థితిలో సంతోషంగా ఉండడం, ప్రతికూల పరిస్థితిలో బాధపడడం మన సహజగుణంగా పరిణమించింది. ఈ పరిణామం ఎన్నో అఘాయిత్యాలకు ఘోర కృత్యాలకు కూడా దారి తీస్తుంది.

కురు పాండవులు వేటకెళ్లారు. ఏకలవ్యుని విలువిద్యా నైపుణ్యాన్ని చూసి నిర్ఘాంతపోయాడు అర్జునుడు. తనకంటే గొప్ప విలువిద్యా ప్రవీణుడు ఒకడున్నాడన్న కలత తనలో రేగింది. ఈర్ష్య కలిగింది. అర్జునుడు తన గురుదేవులైన ద్రోణాచార్యుల వారికి విన్నవించాడు. అసూయతో తల్లడిల్లిపోయాడు. తనని మించిన వీరుడుండకూడదని గురువుని అర్థించాడు, తత్ఫలితంగా ఏమిజరిగింది. వీరుడైన ఏకలవ్యున్ని గురుదక్షిణకోరి అతని కుడిచేతి బొటనవ్రేలిని గురు దక్షిణగా స్వీకరించి ఏకలవ్యున్ని విలువిద్యకు పనికిరాని వానిగా చేసాడు ద్రోణుడు.

కారణం ! అర్జునునిలో రేగిన కలత. ఎంత అనర్థానికి గురిచేసిందో గమనించగలము. తన కుమారుడు తన శత్రువైన శ్రీహరిని స్తుతిస్తున్నాడన్న కలత ఇంతింతై... పెరిగి హిరణ్యకశపుని జీవితాన్నే నాశనం చేసింది. ఈ కలత లేకపోతే ఏ నలతా ఏమీచేయదు. కష్టాల కలతలు మనకు తాత్కాలికంగా బాధకలిగించినా అవి శాశ్వితంగా ఉండవు. ఈ కష్టాలు, బాధలు గతములో మనం చేసుకున్న వాటి ఫలితాలు, ప్రారబ్ధాలు అనే సత్యం అవగతమైతే ఏ కలతా ఏమీ చేయదు. తెల్లదొరలు పెట్టిన హింసలను భరించి, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన అరవిందఘోష్ని జైల్లోపెట్టి దారుణంగా హింసించారు. అయినా నిరంతర ఆత్మనిష్ఠతో స్వరూపానందాన్ని పొంది అరవింద స్వామిగా పరిణమించింది ఆతని జీవితం. ఆ కష్టాల కలతలు తననేమి చేయలేకపోయాయి. తనని పూర్ణ పురుషునిగా తన కలత లేని సాధన తీర్చిదిద్దింది.

కనుక కలతలేకపోతే నలతే ఏమిచేయులేదని అమ్మ ఉపదేశించారు.

శ్రీ పరాత్పరికీ జై !!

లేనిదానికొరకు ఆశించేది దుఃఖం. ఉన్నది చాలు అనుకొనేది సుఖం.

ఆశిస్తూ జీవిస్తాడు మనిషి. ఇది తన నైజం. ఆ ఆశ నెరవేరకపోతే ఆవేదన చెందడం పచ్చి నిజం. ఆశ తీరకపోతే తనలో అలజడి రేగుతుంది. ఆనందం దూరమవుతుంది. అది నెరవేరినా నేరవేరకపోయినా బాధపడని స్థితిలో ఉండలేడు. కావాలనే కోరికే ఆశగా పరిణమిస్తుంది. ఆ ఆశ అత్యాశగా మారితే తీవ్రమైన మార్పులు మనిషి జీవితంలో చోటుచేసుకుంటాయి. ఒక్కొక్క పరిస్థితిలో జీవితాన్ని సర్వనాశనం చేస్తుంది అత్యాశ. ఆశ సహజంగా మనిషిలో పుడుతుంది. దానిని పొందే ప్రయత్నంలో విఫలుడైనప్పుడు విచారానికి గురికాకుండా ఉండగలిగితే జీవిత నడక సుఖాంతంగా సాగుతుంది. మందర చెప్పిన మాయ మాటలకు కైకేయి మనస్సులో అత్యాశ కలిగింది. తన పుత్రుడే పట్టాభిషిక్తుడు కావాలని వాంఛించింది. తను రాజమాతగా గౌరవప్రదమైన స్థానాన్ని పొందగలనని ఆశించింది. ఆ ఆశ తను ఎంతగానో లాలించి ప్రేమించిన రామున్ని అడవులకు పంపించింది. భర్త ఆగ్రహానికి గురయ్యింది. తోడికోడళ్ళ అభిమానానికి దూరమయ్యింది. కైకేయిలో కల్గిన ఆ దురాశ మూలంగా దశరథుడు పుత్రవియోగ బాధను ఓర్వలేక అసువులుబాసాడు. తత్ఫలితంగా విధవరాలయ్యింది. ఏ కొడుకును పట్టాభిషిక్తున్ని చేయాలనుకుందో ఆ కొడుకైన భరతుడు తన తల్లియైన కైకేయి శిరస్సును ఖండించడానికి కత్తిని ఝుళిపించాడు. తల్లిని అసహ్యించుకున్నాడు. చుట్టాలు, బంధువులు, హితులు, స్నేహితులు, సన్నిహితులు, పరివారము, పరిచారికలు, ప్రజలు

ఒకరేమిటి! భారత రాజ్య నివాసులంతా కైకేయిని ఛీకొట్టారు, ఛీదరించుకున్నారు. స్వార్థపరురాలన్నారు. భర్త చావుకు కారణమైన కిరాతకురాలన్నారు. ఇన్ని చిత్రహింసలకు, నిందలకు, చెప్పలేని వ్యధకు బలిచేసింది ఆ దురాశ. తత్ఫలితంగా జీవితాంతం కుమిలి కృంగి దుఃఖభారంతో జీవచ్ఛవంలా బ్రతికింది కైక. ఆ పేరాశ అన్ని భయంకర పెనుమార్పులను సృష్టించింది. శాంతి లేకుండా చేసింది. అశాంతితో క్షీణింపజేసింది. కాబట్టి లభ్యమైనది చాలు. దీనితోనే సరిపెట్టుకొని హాయిగా జీవిస్తాను. అనే సద్గుణం మనలో అలవడినప్పుడు జీవితం పూలవనంలా వికసించి పరిమళిస్తుంది. భగవంతుడు ప్రసాదించిన దానితో తృప్తిగా జీవించేవాడికి శాంతికి కొదవలేదు. ఏది దైవనిర్ణయమో అదే జరుగుతుంది. ఆ జరుగుచున్న దానికి తలవంచి, అంగీకరించి జీవిస్తే దుఃఖానికి తావులేదు. దశరథుడు రాముని పిలిపించి రేపు నీకు పట్టాభిషేకం జరుగుతుంది. పట్టాభిషిక్తుడవగుటకు సంసిద్ధుడవు కమ్ము అని చెప్పాడు. దానికి రాముడు ఆనందంగా అంగీకరించాడు, కైకేయి రామున్ని పిలిపించింది. రాముడు వచ్చి పినతల్లికి గౌరవవందనం చేశాడు. అమ్మా ! పిలిపించుటకు కారణమేమని అడిగాడు. నీ తండ్రి నాకు ఒకప్పుడు రెండు వరములు ప్రసాదించాడు. అవి నేనిప్పుడు కోరుకున్నాను. నా మొదటి వరం నీవు పద్నాలుగేండ్లు అరణ్యావాసం చేయాలి. నా రెండవ వరమేమిటంటే నా సుపుత్రుడైన భరతుడు ఈ భారత రాజ్యాన్ని పరిపాలించుటకు పట్టాభిషిక్తుడు కావాలి. కనుక నీవు రేపు అరణ్యాలకు బయలుదేరు అంది. దీనికి రామునిలో ఏ ద్వేషభావం కలగలేదు. ఇంచుకైనా బాధ అనిపించలేదు. ఆ ఆనందవదనంలో ఏవిధమైన మార్పు కనిపించలేదు. తనలో ఆశలేదు కనుక అరణ్యాలకు వెళ్ళమన్నా సరే బాధపడలేదు.

సరే !! అలాగే "తండ్రి ఆజ్ఞ మేరకు కాననములకేగెదను" అని సంసిద్ధుడైనాడు రాముడు. దశరథుడు పట్టాభిషిక్తుడవవుతున్నావు!! అన్నప్పుడు ఆనందంతో రాముడు పొంగిపోలేదు. కైకేయి పిలిచి అడవులకు వెళ్ళు అన్నప్పుడు కృంగిపోలేదు. పరిస్థితులకు తలవంచని ధీశాలి కనుక రాముడు సర్వలోకాలకు ఆదర్శ ప్రాయుడుగా ఆరాధింపబడుచున్నాడు.

అడవి ప్రాంతంలో జీవిస్తూ భగవదారాధన చేసుకుంటూ దేనిని ఆశించని కడువృద్ధురాలు శబరి. మిక్కిలి బీదరాలు. దొరికిన కందమూలములతో, లభించిన ఫలములతో కడుపునింపుకుని తన సర్వస్వమైన ఆ శ్రీరామ చంద్రుని స్మరిస్తూ, ధ్యానిస్తూ, కారుణ్య రాముని రాకకై పరితపించి, ఎదురు చూసిన నిజ భక్తురాల్పు. ఆ భక్తి పరాకాష్ఠకు చేరుకుంది. రాముడు రాకమానలేదు. వచ్చాడు... శబరిని అక్కున చేర్చుకున్నాడు. వెన్ను నిమిరాడు. ఆ తండ్రిని చూసి తనను తాను మరచిపోయింది శబరి. ఎంగిలి చేసి, రుచి చూచి, ఎంగిలి పండ్లను రామునికిస్తే ఆ భక్తికి కరిగిపోయి ఆరగించాడు రాముడు. శబరిని అనుగ్రహించాడు. ఉన్నదానితో తృప్తిగా జీవించి రాముని స్మరించి తరించిన ధన్యురాలు శబరి. లేనిది ఆశించి తనకు తానే దుఃఖాన్ని తెచ్చిపెట్టుకుంది కైకేయి. ఉన్నది చాలు దీనితోనే సరిపెట్టుకుంటాను. అనుకొని రాముని స్మరించి రామానుగ్రహానికి పాత్రురాలైంది శబరి.

కాబట్టి పరమాత్మ ప్రసాదించిన దానితో తృప్తిగా జీవిస్తూ, లేనిది దానిని పొందాలనే పేరాశను పెంచుకొనక, ధర్మ బద్ధమైన జీవితాన్ని గడిపి తరించాలని అమ్మ భాషించారు.

శ్రీ పరాత్పరికీ జై !!

వింటే విమర్శ కాని కంటే విమర్శ లేదు

మనకు ఎవరైనా చెప్పినప్పుడు మనకున్న మానసిక అవగాహనతో వెంటనే స్పందించి విన్న దానిని విమర్శిస్తాము. అది సద్విమర్శ కావచ్చు లేదా కాకపోవచ్చు. వినిన దానిని క్షుణ్ణంగా పరిశీలించి, పూర్వపరాలు గ్రహించి సహేతుకంగా విమర్శించాలి. అలా కానప్పుడు వాస్తవం ఒకవిధంగా ఉంటే మన విమర్శ ఇంకోలా ఉంటుంది. దేనిని విని విమర్శిస్తున్నామో దానిని నిజంగా చూడగలిగినప్పుడు విమర్శ ఇక ఉండదు. ఎందుకని?! మనకళ్ళతో చూశాము కనుక వాస్తవానుభవం మనకు ఉంది కాబట్టి ఇక విమర్శకు తావుండదు. ఉపమానమునకు రద్దీగా ఉన్న రోడ్డు మీద పదిమంది ఒకచోట మూగితే మనం చూసి ఏదైనా యాక్సిడెంటు జరిగిందేమో అని సందేహం కల్గి ప్రక్కవాళ్ళను ఎవర్నయినా అడుగుతాము. వారు యాక్సిడెంటు జరిగి ఉండొచ్చు అని చెబితే. ఇక మన మనస్సులో వెంటనే స్పందన కల్గి ఏంటో కలి ప్రభావం, రోజు రోజుకీ ఇలాంటి దుర్ఘటనలు సంభవిస్తున్నాయి. ప్రజల్లో భక్తీ భయము కొరవడ్డాయి. ప్రతీ ఒక్కడికి ఒక మోటారు బండి... వెనుకా ముందు చూడకుండా వేగాన్ని పెంచుకుంటూ బళ్ళు నడపడం. ఇలా గుంటే మరి యాక్సిడెంట్లు, ఇన్సిడెంట్లు జరగకమానతాయా...! అని మనలో మనం విమర్శించుకోవడమే కాకుండా ప్రక్కవాళ్ళ చెవిలో కూడా మన భావాల్ని రుద్దేస్తాం. ఏమి జరిగిందో మనమూ చూద్దాం అనుకొని దగ్గరకు వెళ్ళి చూసి చిన్నబోతాము. లేనిపోనిది అనవసరంగా ఊహించుకొన్నామని అనుకుంటాం.. ఇంతకీ ఏమయ్యిందక్కడ?! చెప్పుకోదగ్గ విశేషమేమీ లేదు 'గారడీ' జరుగుతున్నదంతే. కనుక వింటే విమర్శ కానీ! కంటే విమర్శలేదు! అన్నారు అమ్మ.

ఇంద్రసభలో వశిష్ఠ మహర్షి సత్యంబే సకలార్థసాధకంబు అన్నారు. అంత సత్యనిష్ఠకలవారెవరున్నారు ? అని ప్రశ్నించారు

విశ్వామిత్ర మహర్షి. ఎందుకు లేరు ! సత్య ధర్మవర్తనులై శాంతిమయ జీవనం సాగించిన వారు ఎందరో ఉన్నారు అని బదులిచ్చారు వశిష్ఠులవారు. నిత్య సత్య ప్రవర్తనులు, అబద్ధమాడనివారు ఏ ఒక్కరూ సృష్టిలో ఉండరు. ఏదో ఒక విషయంలో ఎప్పుడైనా అసత్యమాడక తప్పరు. కనుక అంతటి సత్యవంతులుండడం దుర్లభం అని పలికారు విశ్వామిత్ర ఋషి. దానికి ప్రతి బదులిస్తూ భువిలో హరిశ్చంద్రుడనే చక్రవర్తి ఉన్నాడు. గొప్ప నీతిమంతుడు, అబద్ధమాడడు, ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా కలవాడు, ధర్మ పాలన అందిస్తున్నాడు. కపటమెరుగని కరుణారస హృదయుడు హరిశ్చంద్రుడు అని చెప్పారు. విశ్వామిత్రుడు సర్రున లేచి హరిశ్చంద్ర రాజట! అబద్ధమాడడట! మేము నమ్మము. రాజు ఇంద్రియలోలుడు. మగువ, మత్తు, మాంసాన్ని అనుభవించే రాజు అబద్ధమాడడట ! హింస చేయడా, ఇది పచ్చి అబద్ధం. రాజైయుండి నిత్య సత్యాన్ని వచించడం అసంభవం అని మాట్లాడారు. కానీ వశిష్ఠులు తన మాటవదలలేదు. విశ్వామిత్రా... అనవసరమైన విమర్శలెందుకు?! నీవే పరీక్షించి తెలుసుకో అన్నారు వశిష్ఠ మహర్షి. అందుకు సరే?! అన్నారు విశ్వామిత్ర మహర్షి. పందెం వేసుకున్నారు. ఒక వేళ హరిశ్చంద్రుడు అబద్ధమాడితే చెవి కోయించుకుంటానని ఒకరు శపథం చేస్తే, అబద్ధమాడకపోతే తలబోడిచేయించుకుని ఊరేగుతానని వేరొకరు శపథం పూనారు. దాని మూలంగా విశ్వామిత్రుడు అనేక విధముల హరిశ్చంద్రుని పరీక్షించారు, రాజ్య భ్రష్ఠుడ్ని చేశాడు, అడవుల పాల్జేసి తన శిష్యుడైన నక్షత్రకునిచే నానా అగచాట్లు పెట్టించాడు. ఒక్క అబద్ధమైనా ఆడించమని శిష్యునికి నూరిపోశాడు విశ్వామిత్రుడు. అయినా సత్యనిష్ఠవదలలేదు హరిశ్చంద్రుడు. విశ్వామిత్రునికి యజ్ఞార్థమై ఇచ్చెదనన్న మాట నిలుపుకొనుటకు, ఋణవిముక్తికై తన భార్యా పిల్లల్ని సహితం బానిసలుగా అమ్ముకున్నాడు. నక్షత్రకుడు ఆధనం తీసుకుని హరిశ్చంద్రా! నేను చదువూ–సంధ్య మాని నీవెంటపడి అడవులపాలై అనేక ఇక్కట్లకు గురయ్యాను. కనుక ఇది ''దారి బత్తెము''నకు తీసుకుంటున్నాను. మాగురువు గారి ఋణం తక్షణం తీర్చు ?! అన్నాడు. దానికి హరిశ్చంద్రుడు

విప్రోత్తమా! నన్ను కూడా అమ్మివేయుము'' అని వచిస్తే.. నిన్నెవరు కొందురయ్యా?! అని నక్షత్రకుడు పలుకగా... మహాత్మా! ఎవరు కొనకపోతే కడజాతి వానికైనా అమ్ముము అని అన్నాడు హరిశ్చంద్రుడు.

కడజాతి వానికి అమ్మివేయబడ్డాడు. వల్లకాటి కాపరిగా నియమితుడయ్యాడు. శవానికి పెట్టిన పిండం తిని బ్రతికాడు. తనకొడుకుని పోగొట్టుకున్నాడు. శవాన్ని దహనం చేయబూనిన భార్యను గుర్తించాడు. ఇరువురు కొడుకుకై దుఃఖించారు. సుంకము తెచ్చుటకు వెళ్ళి వచ్చిన భార్యపై రాజభటులు నింద వేశారు. ఆమె ఎవరో రాజకుమారున్ని చంపిందని, ఆమె శిరస్సును ఖండించమని రాజాజ్ఞను హరిశ్చంద్రునికి చెప్పారు. తన ధర్మాన్ని వీడని, సత్యాన్ని వదలనని హరిశ్చంద్రుడు తన భార్యను సహితం కత్తితో నరకబోతే విశ్వామిత్రుడు అడ్డుపడి హరిశ్చంద్ర! నీవే గెలిచితివి నేనే ఓడితిని ఆగు !... అని ఆపడానికి ప్రయత్నం చేశాడు. కాని హరిశ్చంద్రుడు రాజాజ్ఞకు విరుద్ధంగా ప్రవర్తించక నరకబూనాడు. ఆసత్యనిష్ఠకు సాక్షాత్తు సర్వేశ్వరుడే ప్రత్యక్షమయ్యాడు. ఆ విపత్కర సంఘటనను ఆపి అనుగ్రహించాడు, పుత్రున్ని బ్రతికించారు విశ్వామిత్రుడు వశిష్ఠునితో చేసిన విమర్శలు నీరుగారిపోయాయి. సత్యవర్తనుడైన హరిశ్చంద్రుని చూచి నిర్ఘాంతపోయాడు, ఆశీర్వదించకుండా ఉండలేకపోయాడు, తిరిగి రాజ్యాన్ని సమర్పించి హరిశ్చంద్రా!... నీ కీర్తి, నీ సత్య సంధత సృష్టి ఉన్నంత వరకూ నిలుస్తాయని దీవించాడు.

హరిశ్చంద్రుని గురించి విన్నప్పుడు విశ్వామిత్రుడు విమర్శించాడు కాని ఆ సత్యవంతుని నిష్ఠ చూశాక విమర్శించలేదు. కనుక ఏదైనా విన్న వెంటనే విమర్శించ కూడదని, దానినికంటే విమర్శ ఉండదని అమ్మ ప్రబోధ.

శ్రీ పరాత్పరికీ జై !!

విన్నవాడు విమర్శిస్తాడు.
కన్నవాడు వివరిస్తాడు.

ఏదైనా మనకళ్లతో మనం చూడనంత వరకు మనకు అనుభవానికి రానంత వరకు విమర్శగానే ఉంటుంది. దగ్గరకు చేరి దర్శించిన తరువాత మనలో విమర్శ మరి ఉండదు. దర్శించిన దానిని, అనుభవించిన దానిని వివరించగలుగుతాము. ఇది సత్యం.

షిరిడీ సాయి బాబా దేహంతో ఉన్న రోజులలో ఒక సంఘటన జరిగింది. ఒక వైద్యున్ని అతని మిత్రుడు షిరిడీ తనతో రమ్మని కోరాడు. ఆ మిత్రుడు బాబా భక్తుడు, బాబా దివ్యత్వాన్ని ఎంతగానో చవిచూశాడు, బాబా దైవమన్న పూర్తి విశ్వాసముంది అందుకే బాబా దర్శనం కోసం ఆ వైద్యున్ని రమ్మన్నాడు, ఆ వైద్యుడు నేను రానన్నాడు! ఏం!... ఎందుకనీ! నాతో ఎక్కడకి రాకూడదనుకున్నావా అన్నాడు ఆ మిత్రుడు. నేను రాముని భక్తున్ని, నా రామున్ని తప్ప ఇంకెవర్నీ నేను ఆరాధించను కనుక నేను రాను అన్నాడు వైద్యుడు. బాబా సకల దేవతా స్వరూపుడు వచ్చి దర్శించి చూస్తే నీకే తెలుస్తుంది అన్నాడు మిత్రుడు. మంత్రాలు, మహిమలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే బాబాలంటే నాకిష్టం లేదు. నీవు నమ్ముకున్న ఆ షిరిడీ బాబా భిక్షమెత్తుకొని జీవించే ఫకీరట, ఇంతకీ పిచ్చోడట, రాళ్లు, రప్పలు మనషులపై విసురుతాడట ఏవేవో గొణుక్కుంటూ తిడతాడట అలాంటి పిచ్చోడ్ని పట్టుకొని దేవుడంటా వేమిటి అని నోటికి వచ్చిన రీతిగా ఎవరో చెప్పిన మాటలు పట్టుకొని విమర్శించాడు. కానీ ఆ మిత్రుడు ఆయన్ని దర్శించవద్దు, నాతో తోడుగా రమ్మంటున్నాను రా... అని అభ్యర్థించాడు. మిత్రుని మాట కొట్టలేక షిరిడీ బయలు దేరాడు రైలుదిగి షిరిడీ ఇద్దరూ వెళ్ళారు. బాబా ద్వారకామయిలో రాయిపై కూర్చున్నాడు. అప్రయత్నంగాలోనికి తొంగి చూచిన వైద్యుడు ఆత్రుతతో వేగంగా బాబా పాదాలపైపడి వెక్కి వెక్కి ఏడ్చి కన్నీరు కార్చుతున్నాడు. కాసేపటికి బాబా అతన్ని నిమిరి

లేవనెత్తారు. ముకిళితహస్తములతో నిర్ఘాంతపోయి నిలుచున్న వైద్యునితో బాబా "రాము డెక్కడ లేడు! చూడగలిగితే అంతటా ఉన్నాడు". అని ప్రవచించారు. ఇదంతా గమనిస్తున్న వైద్యుని మిత్రునికి ఏమీ అర్థం కాలేదు. బాబాను విమర్శించిన తన మిత్రుడు ఎలా ఆ ఫకీరు పాదములపై పడగలిగాడో తెలియదు. ఇంత మార్పుకి కారణమేమిటో తెలియక సతమతమవుతున్నాడు. తనూ బాబాను దర్శించి, ఆయన అనుమతి తీసుకొని తిరుగు ప్రయాణంలో, ఆ సాయిని విమర్శించిన నీవు ఏమి చూసి ఆయనపై పడి వెక్కి వెక్కి ఏడ్చావు అని వైద్యుని ప్రశ్నించాడు. అందుకు ఆ వైద్యుడు, తెలియక ఏవేవో విమర్శనాత్మకంగా మాట్లాడాను నన్ను క్షమించు. ఆ గదిలోనికి తొంగిచూడగానే రాయి మీద కూర్చొని ఆశీర్వదిస్తున్న నా రాముడు దర్శనమిచ్చాడు. అందుకే పరుగున పోయి పాదములపై వాలాను. ఆదర్శనానికి పులకించి పోయాను. అనంద భాష్పములు రాల్చి ఆ పాదములను అభిషేకించాను. నా రాముడు నన్ను నిమిరిలేవనెత్తిన తరువాత చూస్తే నా రాముడు లేడు సాయియే ఉన్నారు. అప్పుడు నా అజ్ఞానం అంతరించిపోయింది, నాలో అలుముకున్న విమర్శల బూజు దగ్ధమయ్యింది. అయనెవరో కాదు, నా ఆరాధ్య దైవమైన రాముడు. ఆ రాముడే ఈ సాయి అని ధృడమయ్యింది అని వివరించాడు.

జిల్లెళ్ళమూడి అమ్మ విషయంలో ఈ విధంగానే జరిగింది. ప్రస్తుతం ఏలూరులో రాజరాజేశ్వరి పీఠాధిపతిగా ఉంటున్న స్వామీ శ్రీ శ్రియానందనాథ గారు మా ఆనందాశ్రమానికి వచ్చి మాటల సందర్భంగా అమ్మ గురించి ఇలా చెప్పారు. పూర్వాశ్రమంలో వైణికులుగా, గాయకులుగా వ్యవహరిస్తూ జీవితం గడిపేవారు. ఒకసారి ఒక మిత్రుడు అమ్మను చూడటానికి జిల్లెళ్ళమూడి వెళ్దాం రమ్మంటే సరె వెళ్దామన్నారట. ఈ స్వామి ఏమనుకున్నారంటే తన మిత్రుడు వాళ్ళమ్మగార్ని చూడడానకి రమ్మంటున్నాడనుకున్నారట. ఇంతకూ జిల్లెళ్ళమూడి చేరాక కొన్ని కమ్మలపాకలున్న చోట కుర్చీలో ఒకామె కూర్చొని ఉన్నారట. ఆమెను చూపించి అదుగో అమ్మ అన్నారట. అదేంటి అంతమంది ఆమె చుట్టూ కూర్చున్నారని ప్రశ్నిస్తే ఆమె అందరికీ అమ్మ అని చెప్పాడట ఆ

స్నేహితుడు. ఆ సంగతివిని కోపం వచ్చింది ఈ స్వామికి. అందరికీ అమ్మేమిటి?!... ఇదేదో క్రొత్తరకం నాటకంలా ఉంది అన్నారట. అయ్యో! ఎంతమాటన్నావు. అమె సామాన్యురాలు కాదు. బాహ్యానికి కరణం గారి భార్య అయినా ఆమె దివ్యజనని అని నుడివారట. అమ్మ దగ్గరకు వెళ్ళి దర్శించి పాద నమస్కారమైనా చేయకుండా నలుగురితో నారాయణా అన్నట్లు నమస్కారం దూరం నుండే చేసేశారట ఈ స్వామి. ఆ రాత్రికి నిద్ర పట్టలేదు. ఆమె గురించే మనస్సు ఆలోచిస్తుంది. ఎంతవంచన, దైవాన్నని దండాలు పెట్టించుకుంటుంది. పదిమందిలో దేవతగా చలామణి అయిపోతుందని తీవ్రంగా తనలో తానే విమర్శించుకున్నాడు. తెల్లవారిన తరువాత వెళ్ళి పోవాలి, ఒక్క క్షణమైనా ఇక్కడ ఉండకూడదు, ఇక్కడ జరుగుతన్నదంతా మోసమని భావించి వెళ్ళిపోవడానికి నిర్ణయం తీసుకుని మూటముల్లె సర్దుకొని బయల్దేరి అమ్మకు చెప్పారు. అమ్మ ఈ స్వామిని చూసి చిరునవ్వు నవ్వింది. "ఏం నాన్నా ... రాత్రి ప్రారంభమైన యుద్ధం ఇంకా ఆగలేదా"?!! అని అమ్మ అంది. అంతే అవక్కాయి నిలుచుండిపోయారు స్వామి. తను ఊహించుకొని ఏర్పర్చుకున్న విమర్శలు మటుమాయ మయ్యాయి. అమ్మ సర్వజ్ఞత్వానికి ఆ సంఘటన చవిచూసిన స్వామి! పది పదకొండేండ్లు అమ్మ దర్శనానికి వెళ్ళి అనుగ్రహాన్ని పొంది ధన్యులయినారు శ్రీ శ్రియానందనాధ స్వామి. అమ్మ గురించి అడిగితే విశ్వ జనని అని అమ్మ దివ్యగుణాలను వివరిస్తున్నారు. దీని వలన మనం గమనించదగిన విషయమేమిటంటే ఏదైనా విన్న వెంటనే విమర్శించకూడదు. నిజానిజాలు తెలియాలంటే స్వయంగా మనమే తెలుసుకోవాలి. అప్పుడే మనం సవినయంగా ఎవరికైనా చెప్పగలుగుతాము.

అందువలననే అమ్మ విన్నవాడు విమర్శిస్తాడు. కన్నవాడు వివరిస్తాడని విశదపరిచారు.

శ్రీ పరాత్పరికీ జై !!

రెండుగా కనపడటం అజ్ఞానం!
అన్నీ ఒకటిగా కనపడటమే జ్ఞానం!

బాహ్య దృష్టికి కనిపించే ప్రతీది మనకంటే వేరుగానే ఉన్నట్లు అనిపిస్తుంది. వాస్తవానికి వేరుగా వేరొకటిగా ఉన్నదనేమాట అబద్ధం. కానీ మనము అనుకున్నంత సులువుగా ఏకత్వ భావన కలుగదు. కారణమేమిటంటే మనస్సు ఒక ప్రత్యేకమైన బాహ్య భావంతో కూడుకొని ఉంటుంది. తను వేరుగా ఉన్నాననుకుంటుంది. ఇదే ద్వంద్వ భావం, ఇదే జగద్భావం. తనకంటే ఈ ప్రపంచము, పరమాత్మవేరుగా ఉన్నాయనే దృక్పథాన్ని ఏర్పర్చుకుంటుంది మన మనస్సు. కనిపించే దానిని తనకంటే వేరుగా చూస్తుంది. తనకంటే విడిగా ఉన్నట్లు భావిస్తుంది. విభజన చేస్తుంది. ఇలా భావించినంత కాలము ఒక్కటై ఉన్న అనంత సత్యం గోచరం కాదు అన్యంగానే తోస్తుంది. నిజానికి ఈ సృష్టి ఈశ్వర సృష్టి. అంతా తానై యున్నాడు, తనలోనే చరాచర జగత్తంతా ఉంది. తాను ఈ సృష్టికి వేరుగా లేడు, దూరంగా లేడు అన్నీ తానై ఉండి ఆటాడు కుంటున్నాడు. ఈశ్వరుడు లేని చోటు అణు ప్రమాణమంతలేదు. కానీ ఈ సత్యమైన జ్ఞానం అవగాహన కానంత వరకు సృష్టి, సృష్టిలోని సమస్త జీవరాశి, జలరాశి, వస్తురాశి వేరుగానే, విడిగానే కనిపిస్తుంది. జడ, జీవ పదార్థమంతా తానే నిండి ఉన్నాడు. మనో వృత్తుల చేత వేరు భావన కలిగి, ఐక్య స్వరూపుడైన ఈశ్వరుని మరచి వెలితి వెలితిగా బ్రతుకు చున్నాము. ఈశ్వర జ్ఞానం కల్గనంతవరకు ఈ బేధ బుద్ధి, ఈ వేరు దృష్టి పోదు, భేద బుద్ధి నశించినప్పుడే ఏకమైయున్న సత్య స్వరూపం అనుభవమవుతుంది.

ఒకసారి ఇంద్రలోకంలో, దేవతల, ఋషుల సమక్షంలో

ఇంద్రుడు ఒక సభను ఏర్పాటు చేశాడు, ఆ సభకు, సమస్త దేవతలు, కశ్యపుడు, భరద్వాజుడు, వశిష్ఠుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, భృగువు మున్నగు ఋషులంతా హాజరయ్యారు.

సభను ఉద్దేశించి ప్రవచిస్తూ ఇంద్రుడిలా అన్నాడు "సమస్త దేవతలారా... మునిపుంగవులారా, మాదొక్క మనవి, ఇచ్చట ఒక పదవిని ఏర్పర్చాము. ఎవరైతే ఎక్కువ పాదపూజలు, అభిషేకములు వారము రోజులలో చేయించుకు వస్తారో వారు ఈ పరమ పూజ్యనీయమైన పదవికి అర్హులుకాగలరు" అని ప్రసంగించారు. ఆ సభలో వున్న అందరి మాదిరిగానే విశ్వామిత్రుల వారు కూడా ఆనందించి తమ ప్రతిభను చాటి చెప్పటానికి, తన గొప్పతనాన్ని తెలియపర్చటానికి ఇది ఒక చక్కని అవకాశము అనుకున్నారు. వశిష్ఠులవారు, విశ్వామిత్రులవారు, భరద్వాజులవారు మున్నగు ఋషిగణమంతా భూలోకానికి సభానంతరం తిరిగి వచ్చేసారు. శిష్యులను సేకరించి పాద పూజలు చేయించుకొనుటకు ఉపక్రమించారు. అందులోను పదవీ వ్యామోహం చేత విశ్వామిత్రుడు శిష్యులను అమితంగా సేకరించి పాదపూజలు, అభిషేకవములు చేయించుకున్నాడు, అదియును గాక, ప్రజలకు వరాలు ప్రసాదిస్తానని తమకు పాదాభిషేకం, అర్చనలు చేయమని చెప్పి అధికంగా పాద పూజలు చేయించు కున్నాడు. వశిష్ఠుడు మాత్రం సమయం ఆసన్నమయినా ఒక్క శిష్యుని చేతకూడా పాద పూజ చేయించుకోలేదు. భార్య అరుంధతి వశిష్ఠుని వద్దకు వచ్చి స్వామీ! ఏమిటి మీరు చేస్తున్న పని?! విశ్వామిత్రాది ఋషులంతా ప్రజల చేత, తమ శిష్యగణంచేత అధికంగా పాద పూజలు చేయించు కుంటూ సంసిద్ధంగా ఉంటే మీరు ఒక్క శిష్యుని చేత కూడా పాద పూజ చేయించుకోలేదు, కారణం చెప్పండి అంది అరుంధతి మాత.

వశిష్ఠుడు బదులు పలకలేదు. మౌనముద్రవహించి నిర్వికారంగా ఉండిపోయరూరు. నిర్ణయించిన రోజు రానే వచ్చింది. అందరూ దేవలోకానికి పయనమయ్యారు. సభ ఉత్సాహంగా ఉత్కంఠ భరితంగా ఉంది ఎవరికి దక్కుతుంది ఈ పూజ్యనీయమైన పదవి అని దేవలోక వాసులందరూ ఎదురు చూస్తున్నారు. సభ ప్రారంభమయ్యింది. ఎవరెవరు ఎంతమంది చేత పూజలు చేయించుకున్నారో వారి వారి జాబితాలను ఇంద్రులవారికి సమర్పించుకున్నారు. కానీ!.. వశిష్ఠుల వారు ఏమీ సమర్పించలేదు. ఏ విధంగా పూజలు, అభిషేకములు చేయించుకున్నారో ఋషుల నడిగి తెలుసుకున్నాడు ఇంద్రుడు. మౌనంగా, నిర్మలంగా, శాంత స్వభావుడై కూర్చున్న వశిష్ఠుల వారిని ఇంద్రుడు చూసి మహర్షి!... మీరు సమర్పించలేదేమి? మీరు ఏ పూజా చేయించుకోలేదా? శిష్యులు మీకు లేకా? కారణమేమైనా ఉందా! శలవీయండి?.. అన్నాడు ఇంద్రుడు ప్రశ్నలు మీద ప్రశ్నలడిగి. దానికి వశిష్ఠులవారు బదులిస్తూ దేవేంద్రా.... సమస్త సృష్టికి ఆధారుడు ఆ సర్వేశ్వరుడే కదా... తాను తప్ప అన్యం ఇంకేమి సృష్టిలో లేదుకదా, కర్మ ప్రకారం దేహాలు, వర్ణాలు, కులాలు, లింగ భేదాలు సంభవించాయి. అయినప్పటికీ అన్ని జీవులలో ఆత్మగా, చైతన్యంగా ఉన్నది ఆ ఈశ్వరుడైతే వేరుగా ఏమున్నది, వేరుగా ఎవరున్నారు. అన్నీతానే, అంతాతానే, చిత్త భ్రమలచేత, నేను వేరు అనుకుంటున్నాము. అంతా నిజస్వరూపమైన సర్వేశ్వరుడే ఉన్నప్పుడు, గురువు, శిష్యుడు, భగవంతుడు, భక్తుడు ఈ భేదాలు అజ్ఞాన జనితమైన చిత్తవృత్తుల వలన కలిగినవే కనుక అంతా ఆ పరంధాముడే అణువణువునా నిలిచి ఉంటే వేరుగా ఎవరున్నారు?! పూజ చేయించుకోవడానికి, అన్యంగా అభిషేకములు చేయించుకోవడానికి. మీరు, నేను అనే ద్వంద్వ భావంపోతే ఉన్నదే ఆనంద స్వరూపం అని ప్రవచించారు వశిష్ఠులవారు. సభలో ఉన్నవారు

ఆ సత్యావచనాలకు ఆశ్చర్యచకితులయ్యారు. వశిష్ఠులవారి దివ్య జ్ఞానమునకు చేతులు ముకిళించి నమస్కరించారు. ఈ పదవికి తమరే అర్హులన్నారు. దేవర్షి అని వశిష్ఠమహర్షిని కొనియాడారు. కనుక బాహ్య దృష్టికి రెండుగా కనిపించినా, ఆత్మజ్ఞానం చేత అంతర్ దృష్టికల్గితే అజ్ఞానం తొలగుతుంది. సత్యజ్ఞానం మిగులుతుంది. కనుక రెండుగా కనిపించడమే అజ్ఞానం! ఒకటిగా తోచడమే జ్ఞానం.

ఋషులందరికీ మేము ఋషులం, మాకు శిష్యులున్నారు. మేము పాదాభిషేకములు చేయించుకోగలమనే ద్వంద్వ భావం చేత పూజ చేయించుకున్నారు. పూజ చేసే వారిని తమకంటే వేరుగా చూచి పూజ చేయించుకోవడమే అజ్ఞానం. అన్నిటికీ మూలమైన అసలు సత్యాన్ని చూసిన వశిష్ఠుడు పూజ చేయించకొనక సమస్తాన్ని ఒకటిగానే చూశారు, ఆదృష్టి జ్ఞానం. కనుక సమస్తాధారమైన, సకల జీవస్వరూపమైన సర్వేశ్వరుని చూడగలిగిన స్థితికి రావలెనంటే నిజగురుబోధ అవసరం. ఆ బోధ హృదయగతమైనప్పుడే సమస్తం ఒకటిగా కనపడుతుంది.

పరాత్పరికీ జై !!

సందేహనివృత్తి చేసేదే సందేశం

బాహ్యంగా ఎన్ని తెలుస్తున్నా తెలియనిది ఒకటి మనకు ఉంటుంది. అది మనకు తెలియనంతవరకు, తెలియబడలేదనే వెలితిని కలిగిస్తూనే ఉంటుంది దీనినే సందేహమంటారు. ఈ సందేహ నివృత్తి కోసం ఎందరెందర్నో కలుస్తుంటాము. వారికి మన సందేహాన్ని సవివరంగా విన్నవించుకుంటాము. వారు చెప్పిన సమాధానము మన మనస్సుకు అవగతం కాకపోతే మరింత ఆ సందేహం బల పడుతూ

ఉంటుంది. తగిన సందేశం లభ్యం కానిదే శాంతి మనకు ఉండదు. అలాగని ప్రారంభమైన ప్రయత్నాన్ని విరమించుకోలేము. అలా అలా చీమలా సాహసం చేస్తూనే ఉంటాము. ఎప్పటికైనా సందేహం తొలగే సందేశం లభ్యమవుతుందనే ఆశతోనే ప్రయత్నం చేస్తాము. బాటసారి గమ్యంచేరే వరకు, నడుస్తూ, ఎదురపడే ప్రతీ వ్యక్తిని దారి గురించి అడుగుతూ అడుగులు వేసుకుంటూ వాగులు వంకలు దాటేస్తుంటాడు. ఎందుకనీ? తాను చేరవలసిన చోటుకు చేరటం కోసం. ఆ విధంగానే సందేహ నివృత్తికై పడే ఆరాటంలో ఎంతో ప్రయత్నం, శ్రమ, పట్టుదల, ఏకాగ్రత అవసరం. అప్పుడే లక్ష్యాన్ని సాధించగలం. ఈ కోవలోనే దైవం విషయంలో సందేహం కల్గింది నరేంద్రునికి (శ్రీ స్వామి వివేకానంద). ఎందరో పెద్దలను కలిసాడు దేవుడు ఉన్నాడా? ఉంటే చూపించండి?!.. అని ప్రశ్నించారు. అందరూ దేవుడు సగుణుడిగా ఈ ప్రపంచమై, నిర్గుణుడిగా చైతన్యమై యున్నాడని బోధించారు. కానీ ఆ సమాధానములు తనలో నెలకొని ఉన్న సందేహానికి నివృత్తి కల్గించలేదు. ఎందరో సాధువులను, సత్పురుషులను సజ్జనులను, అడిగి తెలుసుకున్నాడు. వారికి తోచిన జవాబులిచ్చారు. కానీ! తన మనస్సుకు నచ్చిన, అనుభవమునకు వచ్చిన సమాధానమియ్యక పోయే సరికి మరింత తీవ్ర అన్వేషణ చేశాడు, గ్రంధాలను పఠించాడు. కానీ ఫలితం లేకపోయింది. శోధన ఆగలేదు చివరకు తనతపన తపస్సయ్యిందేమో శ్రీ రామకృష్ణ పరమహంసను దర్శించాడు నరేంద్రుడు. పరమ హంస నరేంద్రుని చూసి పరవశించిపోయారు. తమని తామే మరిచిపోయారు. ఆ... నరేన్! ఎంతో కాలంగా నీ రాకకై ఎదురుచూస్తున్నాను అని దగ్గరకు తీసుకొని ఆలింగనం చేసుకున్నారు రామకృష్ణులవారు. అప్పుడు నరేంద్రుడు తనలో నెలకొని పేరుకొని ఉన్న సందేహాన్ని వెలిబుచ్చాడు. దేవుడున్నాడా?! దేవున్ని మీరు చూశారా?! చూస్తే చూపించండి?! అన్నాడు నరేంద్రుడు. దానికి ఇదిగో నిన్ను చూస్తున్నట్లే దేవున్ని చూస్తున్నాను. నీవు బ్రహ్మమే, ఈ బల్ల బ్రహ్మమే, ఈ గోడ బ్రహ్మమే, ఈ భూమి బ్రహ్మమే, ఈ గాలి బ్రహ్మమే

ఒకటని అననేల సమస్తమూ బ్రహ్మమే అన్నారు పరమహంస. దానికి నరేంద్రుడు తృప్తి చెందలేదు. స్వామీ? ఈ సమాధానములేవి నా సందేహాన్ని తీర్చలేదు. కనుక నాకు దేవుడున్నాడనే అనుభవం కావాలి. ఆ అనుభవం కలిగే వరకు నాలో ఉన్న ఈ ప్రశ్నకు సమాధానం లభ్యం కాదు అని తన భావాన్ని నిర్భయంగా వెలిబుచ్చాడు.

నరేంద్రుని నిర్భయత్వానికి, పట్టుదలకు, పవిత్రతకు, కార్యదీక్షకు శ్రీరామకృష్ణులవారు సంతసించి తన పాదము నరేంద్రుని భృకుటిపై ఉంచి శక్తిని ప్రసరింపజేసి బ్రహ్మానుభూతిని ప్రసాదించారు. గంటల తరబడి నిర్వికల్పసమాధి స్థితిలో ఉండిపోయి బ్రహ్మానందాన్ని పొందాడు నరేంద్రుడు. తరువాత రామకృష్ణుల వారు స్పృశించగానే బాహ్య ప్రజ్ఞకల్గింది. అప్పుడు నరేంద్రుడు శ్రీరామకృష్ణుల వారి పాదములపై పడి నమస్కరిస్తూ మీరే నాగురుదేవులు, నా సందేహం తీరిపోయింది. మీ సందేశం అమృతానుభావాన్నే ప్రసాదించింది. అని ప్రార్థించాడు. శ్రీరామకృష్ణులవారి శిష్యునిగా మారిపోయాడు. భారత సంస్కృతిని, వేద ధర్మాన్ని ప్రపంచ సభలో చాటిచెప్పాడు, అజ్ఞాన బద్ధమైన విధానాలను దునుమాడాడు. వివేకానందుడై వంద నీయుడయ్యాడు.

సందేహ నివృత్తి చేసే సందేశం లభ్యమయ్యింది. లభ్యమైన సందేశాన్ని గుండెల్లో నిలుపుకున్నాడు, ఆచరించి లోకాచార్యుడయ్యాడు. కనుక సత్యబద్ధమైన సందేహం తీరనంత వరకు నరేంద్రునిలా తీవ్రయత్నం చేయాలి. ప్రయత్నం వృథా ఎన్నటికీ కాదు. సత్ఫలితాన్నిస్తుంది. సందేహం నివృత్తి అయ్యే సందేశం సంప్రాప్తమవుతుంది.

శ్రీ పరాత్పరికీ జై !!

అనుభవం శాస్త్రాన్నిస్తుంది కానీ ....
శాస్త్రం అనుభవాన్నివ్వదు.

మనకు అతీతమైన, మన మనస్సుకు అర్థం కానిది ఏదో ఒకటి ఉంది. దీని నిర్ణయం, నియమంతోనే ఈ సృష్టి కార్యం జరుగుచున్నదనే పరిశీలనాత్మకమైన శోధన సాగించి, సత్యాన్ని గ్రహించి, అనుభవించి, మనకు ఆ అనుభవాన్ని శాస్త్రరూపంలో అనుగ్రహించారు మన పెద్దలు. వారి నిరంతర శోధన, సాధన, కృషి వారిని ఋషులను చేసింది, మహాత్ములుగా మలచింది. వారందించిన వాక్యములే మహావాక్యాలై, శాస్త్రములై, ఉద్గ్రంధములై, ఆ దర్శములై మానవ జీవితాన్ని క్రమ బద్ధం చేయుచున్నవి. వారి అనుభవమే సత్యాను భవం పొందేందుకు మార్గదర్శకములైన శాస్త్రములను ప్రసాదించింది. వాల్మీకి తొలుత కిరాతుకుడే కదా ! కానీ ! శ్రీ నారద మహర్షి నిత్యా నిత్య వివేక జ్ఞానాన్ని ప్రబోధించి, తారక నామమైన రామనామాన్ని ఆకిరాతకుని నాల్కపై లిఖించి జపించేటట్లు చేస్తే ఆ కిరాతకుడు ఏమయ్యాడు ? నిరంతరస్మరణచేత, ఆకలిదప్పులు మరిచాడు, రామనామాన్ని జపించి తరించాడు, సత్యగుణ ప్రధానుడై శుద్ధుడయ్యాడు. రామనామము సర్వవ్యాపకమైన ఏకత్వాన్ని తెలియజేసింది. ఉన్నరామున్నే చూపించింది. తను చేసిన కృషి ఫలితంగా ఆత్మారాముని దర్శించాడు, అనంతత్వం అనుభవమయ్యింది. రాముడు తప్ప అన్యం లేదనే దృఢమైన అనుభవం కల్గింది. ఆ అనుభవం ఆదికావ్యమైన రామాయణాన్ని అందించింది. ఆ అనుభవం ధర్మ గుణాలను, ధర్మ పరిపాలనను, ధార్మిక జీవన విధానాన్ని, శాస్త్ర రూపేణ అందించింది. విశ్వజనులు విశ్వసించదగ్గ మహాకావ్యాన్నిచ్చింది. అందు చేతనే అమ్మ ''నాన్నా! ... అనుభవమే శాస్త్రాన్నిస్తుంది అన్నారు'' శాస్త్రవేత్తలు కూడా తాము ప్రత్యక్షంగా

తెలిసికొని, అవగతమైన తరువాతనే లోకానికి తమ అనుభవాల్ని శాస్త్రరూపేణ అందించుచున్నారు.

అంతేకాని శాస్త్రములు వల్లించి నంతమాత్రమున అనుభవం రాదు. శాస్త్రానుభవం ఉంటుందేమో కాని ! సత్యానుభవం ఉండదు. ఏది తెలియబడిందో దానిని అనుష్ఠిస్తే కదా అనుభవం పొందటానికి శాస్త్రవాక్యాన్ని మనకు తోచిన విధంగా అర్థాన్ని ఏర్పర్చుకుంటే ఫలితం అందదు. అనుభవం రాదు. బొబ్బిలి పట్టణానికి సమీపములో కలువరాయి అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలో కావ్యకంఠ గణపతి శాస్త్రిగారుండేవారు. వారు వేదవేదములను పఠించారు, ఎన్నో స్తోత్రములను రచించారు, అష్టకములను వ్రాసారు, వేదగానం చేశారు, మంత్ర జపం చేశారు, వేదాంత సభలలో విజయభేరీ మ్రోగించారు, అయినా స్వరూపానందం కలుగలేదు.

వేలమంది శిష్యులు వారి పాదాలను ఆశ్రయించి విద్య నేర్చుకుంటున్నారు. గొప్ప కీర్తి ప్రతిష్ఠలు తలుపు తట్టాయి. అయినా ఆయనలో వెలితి పోలేదు. కారణం! ఆత్మానుభవం కలుగలేదు.

తాము వల్లించిన శాస్త్రాలు తమకు ఆ సత్యానుభవాన్ని ప్రసాదించలేదు. ఎందరో మహాత్ములను దర్శించారు. ఆత్మానుభవం కోసం ప్రశ్నించారు కానీ ఫలితం రాలేదు. చివరకు అరుణాచలం వెళ్ళారు, బ్రాహ్మణ స్వామి (రమణ మహర్షి)ని దర్శించారు, తమ సందేహాన్ని విన్నవించుకున్నారు. అప్పుడు రమణ మహర్షి నాయనా ! 'నేను వేదం చదివాను, నేను వేదగానం చేశాను, నేను మంత్రం జపం చేశాను, అంటున్నావు కదా ? నేను చేశాను అంటున్న ఆ "నేను" ఎవరో ?! ఏమిటో ?! విచారించి తెలుసుకో అప్పుడు సత్యం నీకే తెలుస్తుంది"

అన్నారు రమణమహర్షి. ఆ సందేశం గణపతి శాస్త్రిని ఆశ్చర్యచకితుణ్ణి చేసి, విచారణ జరిపించింది. ఆ విచారణ ద్వారా స్వరూపానందాన్ని పొందారు గణపతి శాస్త్రిగారు. కానీ ! ఏ శాస్త్రము చదవని, ఏ మంత్రము పఠించని రమణ మహర్షికి కేవలం మృత్యానుభవం మాత్రమే స్వరూపజ్ఞానాన్ని ప్రసాదించి పూర్ణపురుషున్ని చేసింది, ''అక్షరమణమాల'' వ్రాయించింది, ఎన్నో సత్యాలను మానవాళికి అందించింది. అందుకే అమ్మ ''అనుభవం శాస్త్రాన్నిస్తుంది కాని... శాస్త్రం అనుభవాన్నివ్వదని ప్రబోధించారు''.

శ్రీపరాత్పరికీ జై !!

కాలువ నిండుగా ప్రవహిస్తున్నా దాహమయితే దిగటానికి రేవు కావాలి.


అనుకున్న చోటుకి చేరటం కోసం ప్రయాణం సాగిస్తుంటాము. ఎండ తీవ్రంగా ఉంటుంది. కిరణాలు శరీరాన్ని తాకి తాపానికి గురి చేస్తుంటాయి. దాహం తారా స్థాయికి చేరుకుంటుంది. ఆ ఎండ దెబ్బకు తట్టుకోలేక వడ దెబ్బకు గురి కావచ్చు కూడా. అప్పుడేం చేస్తాము సమీపంలో ఏదైనా కాలువగాని, యేరు గాని, నది గాని ఉందేమో అనుకొని ప్రయాణం ఆపక, ఆగిపోకుండా నీటికోసం ప్రయత్నిస్తూ సాగుతుంటాము. మన అదృష్టం కొలది, ఏ కాలవో, ఏ యేరో తారసపడితే సంబరపడిపోతాము, పోతున్న ప్రాణాలు తిరిగి వచ్చినంత ఆనందాన్ని పొందుతాము. దగ్గరకు వెళ్తాం నిండుగా పారుతుంది కాలువ. దిగటానికి వీలుకానంత లోతుగా ఉంది. ఏదో విధంగా దిగి నీళ్ళు త్రాగి దాహం తీర్చుకుందామనుకున్నా కాలు జారి కాలువలో పడితే ఇక

ముగింపే. కనుక నిరాశయే శేషమవుతుంది. ఎదురుచూపులు చూస్తాము ఎవరైనా వస్తారేమోనని సాయం చేస్తారని, ఎవరు తారసపడకపోతే ఆ ఎండవలన కలిగే తాపాన్ని అనుభవించక తప్పదు. అదృష్టం కొలది రేవు ఉంటే మహాభాగ్యమే ఇంకేముంది యాతనయే ఉండదు. నిర్భయంగా దిగి నీరు త్రాగేస్తాము. దాహం తీరిపోతుంది. సమయముంటే స్నానం చేసి తాపాన్ని తొలగించుకుంటాము. ఈ విధంగానే పరమాత్మ అంతటా వ్యాపించి ఉన్నప్పటికీ ఆయన్ని తెలుసుకోవటానికి, కలుసుకోవటానికి, మార్గం అవసరం. ఆ మార్గాన్ని ఎవరు చూపుతారు ? ఎవరు చెబుతారు?! నిస్సంకోచంగా మార్గదర్శకులైన తత్వజ్ఞానులైన, మహాత్ములే. సంసారము భారమై, శాంతికి దూరమై, బ్రతుకు బండి ఆశలతో నిండి బరువై దాన్ని లాగలేని నిస్సత్తువ చోటు చేసుకున్నప్పుడు భారాన్ని దించి, అనుగ్రహించి, అక్కున చేర్చుకొని, ఆనందాన్నీ, శాంతిని ప్రసాదించే మహాత్ముల సన్నిధే మనకు ఆధారం. వారిసాన్నిధ్యమును చేరిన వారికి శాంతికి లోటుండదు. సుఖవంతమైన, తేజో వంతమైన జీవితం మహాత్ముల కృపా దృష్టి, జ్ఞాన ప్రబోధవలన ప్రాప్తిస్తుంది. అదే మహాయోగం, అదే మహాభాగ్యం. "అమ్మ" చెప్పిన కాలువయే ప్రపంచము. ఈ సమస్త జీవరాశి దాని గట్టునే ఉంది. దానిలో ప్రవహిస్తున్న జలాల (చైతన్యం) తోనే అలరారుతుంది ఈ జగత్తు. దాహమే మనిషి యొక్క దుఃఖం. అది పోవటానికి రేవు కావాలన్నారు అమ్మ. ఆరేవులే పూర్ణులైన తత్వజ్ఞులైన మహనీయ మూర్తులు. శాంతి గమ్యాన్ని చేరదలుచుకున్న ప్రతీవారు వారి పదసన్నిధికి చేరవలసినదే. వారి అనుగ్రహాన్ని పొంది, ఆనంద జీవితాన్ని అందుకో వలసినదే. ఈ జగత్ వైవిధ్యంగా ఉంది. జీవరాశితో నిండుగా ఉంది. అనేకానేకంగా

ఉంది. అందులో ఉన్నది వాడేగా (పరమాత్మ) వాడు నిరాకారుడైనప్పటికీ సాకారుడిగా ఈ జగత్ రూపేణ ఉన్నాడు. వాణ్ణి గుర్తించడం మన వల్లగాదు. కనుక వాణ్ణి తెలుసుకొని, వాడి ఉనికి ప్రకటితమవుతున్న సద్గురువుల సాన్నిధ్యం చేరే వరకూ మనకు ఆ అనంతుని జాడ అవగతమవ్వదు. అటువంటి మహనీయ మూర్తులే, తత్వ దర్శనులే షిరిడీ సాయిబాబా, మెహర్‌బాబా, రామకృష్ణ పరమహంస, వివేకానంద స్వామి, రామతీర్థ, జిల్లెళ్ళమూడి అమ్మ మున్నగు వారు. వారి దరికి చేరి జీవితాన్ని పండించుకున్న వారు ధన్యులు. ఎంతో మంది వారి వాక్కులు పాటించి, పరమానందాన్ని అనుభవిస్తున్న అదృష్టవంతులున్నారు. మన పూర్వ సుకృతం లేనిదే అంతటి పూర్ణజ్ఞానుల సాన్నిధ్యానికి చేరలేము. చేరిన తరువాత వారు అందించిన కృపామృతాన్ని గ్రోలినప్పుడే మనం అనంత ఆనందాన్ని అనుభవించ గలం. వారి సన్నిధి మన దుఃఖ దాహాన్ని తీర్చుతుంది. మన శాప తాపములను తొలగిస్తుంది. జీవితాన్ని నవ జీవంతో కళకళ లాడిస్తుంది. ఎంతమంది దుఃఖ దాహాన్నైనా తొలగించగల అనంతమైన జీవజలాలు వారి కరుణ నుండి ప్రవహిస్తాయి. విశ్వాసంతో గ్రోలినవారికి రాగ ద్వేషాలు రాలిపోతాయి, ఇక దప్పికయే ఉండదు. ఉన్నదంతా ఆనందమే. అనంత స్వరూపుడైన పరమాత్మను తెలుసుకొనే తెలివి మనకు లేదు. కనుకనే మహనీయుల రూపంలో ప్రకటమై, జ్ఞాన జలాలను ప్రసాదిస్తున్నాడు ఆ పరమాత్మ. మరి మనకు లభ్యమైన రేవు (గురుబోధ) ను ఆధారం చేసుకొని, ఆనంద జలాలను, త్రాగి, తడిసి తన్మయులమై తనమయులం అవ్వాలి.

శ్రీ పరాత్పరికీ జై !!

పెట్టింది ముహూర్తం కాదు జరిగిందే ముహూర్తం



కుసుమ అక్కయ్యగారి పెద్ద అమ్మాయి పెళ్ళికి పెట్టిన మూహూర్తం ఉ॥ గం॥ 7-58 ని॥లకు. కానీ! జరిగినది మ॥ 12-00 గం॥లకు.

మనిషి జీవితం సకల కార్యములతో ముడిపడి సాగుతుంది. తను సంకల్పించిన కార్యము సక్రమముగా నెరవేరాలని ఎన్నో ఆశలు పెట్టుకుంటాడు, కార్యాన్ని నెరవేర్చుటకు ముహూర్తాన్ని నిర్ణయించుకొని కార్యోన్ముఖుడవుతాడు. తాను నిర్ణయించుకున్న కాలములోనే తను అనుకున్న పనిని పూర్తి చేయాలనుకుంటాడు, కానీ ప్రకృతి, పరిస్థితులు ప్రతికూలిస్తే తాను తలపెట్టి చేయాలనుకున్న పని తాను ఏర్పరుచుకున్న ముహూర్తానికి జరుగదు. ఎంతో నిరాశకు, బాధకు గురి అవుతాడు. ఎందుకిలా జరిగిందా అని పరిపరి విధముల ఆలోచన సాగిస్తాడు. తను

ఆలోచించి ఆలోచించి కొన్ని కారణముల మూలంగా తన పని అనుకున్న ముహూర్తానికి జరగలేదనుకుంటాడు, తాను చెప్పిన విధంగా తనవారు సహకరించలేదంటాడు, లేకపోతే తన శత్రువులు తన పనికి ఆటంకం కల్పించారు కాబోలు అని ఊహించుకొని ఊగిసలాడిపోతాడు. ప్రకృతి వ్యతిరేకించింది అని వాపోతాడు. చివరకు తన కార్యము దైవం జరగనివ్వలేదని దైవాన్ని నిందిస్తాడు. ఇవన్నీ కారణములు కాదు. నిజానికి ఆపని ఎప్పుడు జరగవలసి ఉన్నదో అప్పుడే జరుగుతుంది, దీనినే విధి అంటారు మన ఆర్యులు. అంతే కాని మనం పెట్టే ముహూర్తం ప్రకారం జరుగదు. మనం నిర్ణయించిన సమయములోనే జరగవలసి ఉంటే ఖచ్చితం జరిగితీరుతుంది. అలా లేనట్లయితే మనం పెట్టిన ముహూర్తం ప్రకారం జరగదు. అది ఎప్పుడు జరిగి తీరుతుందో అదే నిజమైన ముహూర్తం. అదే నిజమైన సమయమని అమ్మ చెప్పారు.

ఉదాహరణకు మన బంధువుల అబ్బాయికో (లేక) అమ్మాయికో పెండ్లి నిశ్చయమయ్యింది. ముహూర్తం నిర్ణయించారను కుందాం. కాని పెండ్లి 10 రోజులు ఉందనగా ఏదో ఒక అవాంతరం వచ్చి పడితే ఆ పెండ్లి మనం పెట్టుకున్న ముహూర్తమునకు జరగకుండా ఆగిపోతుంది. తరువాత కొన్నాళ్లకు జరుగుతుంది. దీనిని బట్టి మనకేం అర్థమయ్యింది. ఆ పెండ్లి మనం పెట్టిన మొదటి ముహూర్తంలో జరగలేదు. అది జరగవలసిన కాలంలోనే జరిగింది. అందుకే మన పెద్దలంటారు. "ఏదీ మన చేతుల్లో లేదు. ఏది ఎప్పుడు ఎలా జరగాలో ఆ ఈశ్వరునికే ఎరుక".

క్రిష్ణాజిల్లా – 'పెదముక్తేవి'లో విజయంచేసిన **శ్రీ లక్ష్మణ యతీంద్రులు** అమ్మ అనుగ్రహానికి పాత్రులైన మహనీయులు. వారు ఈ మధ్యకాలంలో ఒక యాగాన్ని తలపెట్టారు. యాగం మరుసటి దినము లక్షమందికి ఒకేసారి భోజనం పెట్టాలని సంకల్పించుకొని ముహూర్తం నిర్ణయించుకున్నారు. అశేషభక్తులు ఆ యాగనిర్వహణకు తగు విధంగా సహాయ సహకారాలందించారు. పెద్ద పెద్ద పందిళ్లు, షామియానాలు వేసారు. లారీలతో బియ్యం, కూరగాయలు, పప్పులు,

భోజనాలు తయారీకి కావలసిన సామాగ్రి నంతా భక్త జనులు సమకూర్చారు. ఉత్సాహంతో యాగానికి హాజరయ్యారు. అనుకున్నా రోజున యాగం ప్రారంభమయ్యింది. దివ్యంగా జరుగుతుంది. జనం ప్రవాహమై తరలివస్తున్నారు. మరుసటి అన్న సంతర్పణ కార్యక్రమానికి యాగం పూర్తి అయ్యింది. తెల్లవారితే లక్షలాది మంది జనానికి ఒకే పంక్తి భోజన కార్యక్రమం జరుగనుంది. కానీ ! జరిగిందా ? !! .. జరగలేదు. భక్తుల హృదయాలు ఎంతో బాధపడ్డాయి. ఎన్నో నిందలకు గురయ్యారు, కొన్ని లక్షల రూపాయల విలువచేసే ఆహార పదార్థాలు నాశనమయిపోయాయి. నిరాశ నిస్పృహలు అందరి గుండెల్లో చోటు చేసుకున్నాయి. ఎందుకిలా జరిగింది ? ! వర్షం ... యాగానంతరం కుండపోతగా, ఏకధాటిగా కురిసింది. కార్యక్రమానికి ప్రతికూలమై భంగపరచింది. అయినప్పటికీ మరుసటి సంవత్సరము స్వామి మరలా యాగాన్ని తలపెట్టారు. యాగానంతరం తన సంకల్పమైన ఒకే పంక్తిలో లక్ష మంది భోజన కార్యక్రమం తలపెట్టారు. ఎందరు వద్దన్నా వినలేదు. యాగానికి జనం తండోపతండాలుగా తరలివచ్చారు. యాగం నిర్విఘ్నంగా పూర్తి అయ్యింది. మరుసటి రోజున జరిగే లక్షమందికి ఒకే పంక్తి భోజనం కార్యక్రమం నిరాటంకంగా జరిగింది. మూగబోయిన మనస్సులు వికసించాయి. బాధాహృదయాలు ఆనందంతో వర్షించాయి.. అందరికళ్లల్లో మెరిసే ఆనంద కాంతికి స్వామి పరమానంద భరితులయినారు. అప్పుడు స్వామి ఇలా ప్రబోధించారు. ఇప్పుడు జరిగినదే నిజమైన ముహూర్తంగాని గతంలో మనం పెట్టుకున్నది, ముహూర్తం కాదని.

దీనిని గమనిస్తే మనకేం అర్థమవుతుంది. ప్రయత్నం చేయడమే గాని, అనుకున్న సమయానికి ఆ కార్యం జరగవచ్చు, జరగకపోవచ్చు. ఎప్పుడు జరుగుతుందో అప్పుడు నిజమైన ముహూర్తంగా భావించి, భారాన్ని సర్వేశ్వరునిపై వేయాలి. అందుకే అమ్మ ''జరిగిందే ముహూర్తం, పెట్టింది ముహూర్తం కాదు'' అని అన్నారు.

శ్రీ పరాత్పరికీ జై !!

తోచిందేదో చెయ్యి-తోపింపచేసేవాడు వాడేగా!

మన అంతరంలో ఓ సత్యమైన భావం తోచినప్పుడు, భావము యదార్థతను చూపుతున్నప్పుడు దానిని నెరవేర్చటానికి సంసిద్ధులమైతే ఆచరణలో పెట్టగలిగితే సత్ఫలితాలు మనకు సంక్రమిస్తాయి. అయితే మన మనస్సు కల్పించిన భావాలు కూడా సత్ఫలితాలను ఇచ్చేవిగానే తోపిస్తాయి. అవి కొన్ని నెరవేరవచ్చు, నెరవేరకపోవచ్చు. కానీ ! లోన నుండి ఉదయించిన సత్యమైన తలంపులు పరమాత్మే ఈ విధంగా తోపింపజేశాడు అనే సద్భావన కలిగి ఉండి నెరవేర్చగల్గితే ఉన్నత జీవితాన్ని అనుభవించగలము. నిజమైన పరమాత్మ జ్ఞానము కలిగినప్పుడు, పరమాత్మ స్మరణలో జీవితాన్ని గడిపినప్పుడు, తనలో అసత్య భావములకు తావులేక సత్యమైన భావములే అంతరాళం నుండి వెలికి వస్తాయి. సత్యజ్ఞానం కల్గిన వ్యక్తి సర్వత్రా పరమాత్మను దర్శించుచున్న వాడై తనకు తోచిన ప్రతీ, తలంపు తనదే (దైవం) అనుకుని ఆచరణలో పెడతాడు, దాన్ని నిర్వర్తించుటలో ఎన్ని అవాంతరములు వచ్చినా ఎదుర్కొని పరమాత్మ తోపింపజేసిన దానిని నెరవేర్చుతాడు. అటువంటి జ్ఞానికి వేరే తలంపులంటూ ఏమీ ఉండవు. ఏమైనా తలపులు వస్తే అవి అక్షర సత్యాలే – చైతన్య తరంగాలే అయి తీరుతాయి. వారి సంకల్పం లోక కళ్యాణానికి దారి తీస్తుంది. సకల మానవులకు ఉపయోగ కరమవుతుంది. తోచిన ప్రతీది ఈశ్వర సంకల్పంగా స్వీకరించగలగాలి. అలాగని ఒకరికి అపకారము చేయాలనే తలంపు రావచ్చు అది ఈశ్వర సంకల్పం కాదు, ఈశ్వరుడు తోపింపజేసినదికాదు. వికారియైన, ఈర్ష్య ద్వేషములతో కూడుకున్న మన మనో సంకల్పమవుతుంది. గమనించవలసినది ఒకటే. ఈశ్వరుడు తోపింప చేసినవి ఈర్ష్య, అసూయ, అహంకారము లతో కూడుకొని, నాశనం తెచ్చి పెట్టేవికావు. ఆయన తోపించిన భావాలు, రాగ ద్వేషాది వికారాలనుహరించే జ్ఞాన బాణాలు. ఇది మాత్రం అనుక్షణం గుర్తిస్తూ ఉంటే మనోవికారాలకు, సంకల్పాలకు తావు లేక సత్యమే సర్వత్రా తోపిస్తుంది. ఆయన

తోపింపజేసిన దానిలో సార్ధకత ఉంది. సంతోషం ఉంది. శాంతి ఉంది. సిద్ధార్థుని విద్యాభ్యాసం, రాజ ప్రాసాదములోనే కొనసాగింది. లోకాన్ని చూడలేదు. ప్రజల బ్రతుకులను పరికించలేదు. విభిన్న రీతులలో సాగే మానవ జీవనసరళిని గాంచలేదు.

వివాహమయ్యింది. ఒక పుత్రునికి తండ్రి కూడా అయ్యాడు. ఒక రోజు ఊరిని, ఊరిలో ప్రజలను చూడాలనుకున్నాడు, బయలు దేరాడు, కోటదాటి బయట ప్రపంచాన్ని చూడటం అదే ప్రధమం. ఒక కుష్ఠి రోగిని, ముదుసలిని, శవాన్ని చూశాడు, ఏమిటని విచారించాడు, విషయాన్ని గ్రహించాడు. తిరుగు ప్రయాణమై అంతఃపురానికి వచ్చాడు, మానవుడు దుఃఖించడానికి కారణమేమిటని తనలో తాను ప్రశ్నించుకున్నాడు, సమాధానం దొరకలేదు. లోన రేగిన ప్రశ్న వీడలేదు. ఈ భోగం, భాగ్యం, పరివారం, ఈ శరీరం, దీని బంధాలైనా, తల్లి, తండ్రి, భార్య, బిడ్డలు, బంధువులు ఇవన్నీ తుదకు అశాశ్వితమని తోచింది. ఆ తోపించిన తలంపు తనను తీవ్రమైన శోధకునిగా మార్చింది. భార్య బిడ్డలను, తల్లితండ్రిని, బంధువులను, పరివారాన్ని రాజ్యాన్ని, విడిచిపెట్టేలా చేసింది.

గయ వెళ్లిపోయాడు ఓ చెట్టుక్రింద కూర్చొని తపస్సు చేశాడు, నలభై దినముల అనంతరం తనలో అలుముకున్న ప్రశ్నకు జవాబు దొరికింది. తనలో నెలకొన్న దుఃఖం వీడింది. శాంతిమయుడై నూత్న జీవితం ప్రారంభించాడు. సంసారబద్ధుడైన సిద్ధార్థుణ్ణి ఈశ్వర సంకల్పం బుద్ధున్ని చేసింది ధర్మాన్ని ప్రబోధించేలా చేసింది. సామాన్య జీవున్ని బుద్ధ దేవునిగా మార్చింది. కనుక తోచేది ఏదైనా తోపింపజేసే వాడు వాడేగా అన్నారు అమ్మ.

కనుక అసూయ, అహంకార రహితమైన సత్య తలంపులు మన జీవితాన్ని మార్చివేసి మహోన్నతునిగా తీర్చిదిద్దుతాయి. కనుక తోచిన తలంపులన్ని ఈశ్వర సంకల్పంగా భావించాలి. ఆయన ఇచ్ఛకు తలవంచాలి. అది సత్య దర్శనాన్ని ప్రసాదిస్తుంది.

శ్రీ పరాత్పరికీ జై !!

మహాతత్వానికి మహాత్యాలతో పనిలేదు

నిర్గుణుడైన దైవం సగుణరూపం దాల్చుటమే గొప్ప మహత్యం. పంచభూతాలైన ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి తానే అయ్యాడు, లోకానికి వెలుగు వేడిమి ప్రసాదించడానికి సూర్య చంద్రులు తానే అయ్యాడు, మొక్కలు, వృక్షాలు, పశువులు, పక్షులు, మనుష్యులు ఒకటేమిటి అన్నీ తానే అయి ప్రకటమై భాసిస్తున్నాడు. అదే మహా మహత్యం. ప్రపంచమై అగుపిస్తున్నాడు, జ్ఞానంచే గుర్తించిన వాడికి తను అంతరాత్మగా, అనంత పరమాత్మగా గోచరిస్తున్నాడు. వాడ్ని గుర్తించడానికి, వాడ్ని చేరడానికి, గురు జ్ఞానం కావాలి కానీ, ఈ పూజలు, వ్రతాలు, తీర్థ యాత్రలు, తాత్కాలిక ఆనందానికే గాని అనంతుడైన తన దరికి తీసుకుపోయేవి కావు. ఆరాటపడి ఆయన కోసం తపించే వాళ్లకు తన జాడ తెల్పటం కోసం తానే దేహధారియై, గురువై వచ్చి తన స్వరూపజ్ఞానాన్ని ప్రబోధిస్తున్నాడు. ఇంతకంటే వేరే మహత్యాలు ఏం కావాలి. సంసార భావంతో సతమతమై, సరియైన బాటలేక బాధపడుతున్న మానవాళికి జ్ఞానం ఇచ్చి అంతరంగములో నెలకొన్న భారాన్ని తొలగించిన గురుస్వరూపుడైన ఆపరాత్పరుడు ఇంతకంటే ఏ మహాత్యాన్ని ఏ మహిమలను చేయాలి. ధర్మ విరుద్ధమైన, ప్రకృతి విరుద్ధమైన మహిమలు వస్తువులను సృష్టించడం, విభూతులను సృష్టించడం ఇది కాదు. ఇవి మరింత మనస్సును తప్పు త్రోవపట్టిస్తాయి. ఇక ఆ మనస్సెప్పుడూ మహిమలను, అద్భుతాలను కోరుకొనుటలోనే నిమగ్నమవుతుంది. మన మనస్సు "**తానెవరో ? తన ఉనికి ఏమిటో ? తాను పొందవలసినదేమిటో మరుగునపరచి పరిమిత జ్ఞానమును కలిగి, ఆ మహిమలు ప్రసాదించిన బాబాల, బాల యోగుల, స్వాముల, సాధువుల చుట్టూ పరిభ్రమిస్తుంది. కానీ... పరమాత్మను తెలుసుకొనేందుకు కావలసిన సత్య జ్ఞానమును పూర్ణులైన మహనీయుల ద్వారా పొందేందుకు ఉపక్రమించదు.**" పరిమితమైన

భావంతో పటాలను, ఘటాలను అర్చిస్తుంది కాని అసలు సత్యం కోసం ఆరాటపడదు. మహా తత్వాన్ని తెలిసికొనుటకు మహత్యాలతో పనిలేదు. నిజ గురుబోధయే నిన్నూ, నీ స్వరూప స్వభావాలను ఎరిగిస్తుంది. సత్యవర్తనుణ్ణి చేస్తుంది.

కుశాభావు అనే వ్యక్తి ఒక సాధువు వద్ద ఓ మంత్రాన్ని పొందాడు. ఆ మంత్ర మహిమ వలన దూరాన ఉన్న దుకాణాలలోని వస్తువులను తన చేతిలోకి వచ్చునట్లు సృష్టించవచ్చు. అలా వస్తువులను సృష్టించే ప్రదర్శనలు చేసి జనాన్ని ఆకట్టుకున్నాడు. మొదట్లో తాను ప్రదర్శిస్తున్న విద్యకు పొంగిపోయాడు. కొన్నాళ్లకు ఏ ప్రజలైతే తనని మహిమాన్వితునిగా గుర్తించారో, అదే ప్రజలు హింసించటం ప్రారంభించారు. ఇక భరించలేకపోయాడు, సహించలేకపోయాడు, కుశాభావు. తనకు మంత్రమిచ్చిన గురువు వద్దకు వెళ్ళాడు. తన గోడుని, బాధని చెప్పాడు. గురువు బదులిస్తూ ... నిన్ను మంత్ర ప్రభావ ప్రమాదము నుంచి నేను తప్పించలేను. నిన్ను రక్షించగల మహనీయుడు ఆ షిరిడీసాయినాథుడే. కనుక తక్షణమే అక్కడకు వెళ్లు ! అని ఆజ్ఞాపించాడు కుశాభావుని గురువు. వేరేగతిలేక కుశాభావు సాయిని ఆశ్రయించాడు. సాయి అతని చేతికున్న కడియాన్ని గంగలో పారవైచి, మంత్రాన్ని నీటిలో స్మరించి వదలమన్నారు. ఆనాటి నుండి కుశాభావులో పరివర్తన కలిగి శాంతి లభ్యమయ్యింది. దొరికిన కామధేనువులాంటి గురువుని, గురువాక్యాన్ని సద్వినియోగపర్చుకొని, సాధన చేసుకుంటూ ధన్యుడయ్యాడు.

గమనించదగ్గ విషయమేమంటే మహిమల జోలికి పోకుండా గురువొసంగిన జ్ఞానాన్ని అనుష్ఠించి, జన్మను ధన్యం చేసుకోవలసినదే. ఆ మహా మహితాత్ముని పూర్ణ కృపకు పాత్రులు కావలసినదే.

శ్రీ పరాత్పరికీ జై !!

నిగ్రహం కొరకే విగ్రహారాధన

బిక్కు బిక్కుమని దిక్కులు చూస్తూ ఏడ్చే పిల్లవానికి అమ్మ కనిపిస్తే క్షణములో ఆతని ఏడుపు మటుమాయమవుతుంది. ఎందుకంటే అమ్మ తనకు పాలిచ్చి ఆకలి తీర్చుతుంది. లాలించి జోలపాడి నిద్రపుచ్చుతుంది. అనుక్షణం తనని కంటికి రెప్పలా కాపాడుతుంది, బుద్ధులు చెబుతుంది. బువ్వపెడుతుంది. అలిగితే అక్కున చేర్చుకొని మంచి మాటలు నచ్చచెబుతుంది. సంస్కారవంతుడు కావాలని ఎన్నో నీతులు చెబుతుంది. తనఒడిలో కూర్చుండబెట్టుకొని తీర్చిదిద్ది సమర్థవంతమైన జీవితాన్ని ప్రసాదిస్తుంది. అందుకే ఎవరికైనా అమ్మను చూస్తే అనూహ్యమైన ఆనందం కలుగుతుంది. యెదలో పేరుకుపోయిన బాధంతా ఇట్టే తొలగిపోతుంది. అమ్మను చూడగానే ఎనలేని ఆనందం కలుగుతుంది. అమ్మలాలన పాలన అన్నీ గుర్తుకువస్తాయి. అమ్మను చూసిన క్షణం మనలో ఉన్న ఆలోచనలన్నీ ఎగిరిపోతాయి. ఈ విధంగానే అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడైన పరమాత్మ సర్వవ్యాపకుడు, మనోబుద్ధులకు గోచరం కానివాడు కాబట్టి అజ్ఞాన బద్ధులమై జీవిస్తున్న మనకు దైవంను ఆరాధించేందుకు విగ్రహాలను కల్పించి, పూజావిధానాన్ని ఏర్పర్చారు. నిరంతరం సంసార లంపటంలో పడి అనేకానేక విధములుగా శోకిస్తూ, సుఖిస్తూ, ద్వంద్వాలలో తగుల్కొని ఉన్న మనిషికి సర్వాధారమైన పరమాత్మను గుర్తించేందుకు మాత్రమే ఈ విగ్రహారాధన. సర్వవ్యాపి అయిన పరమాత్మ దివ్యత్వాన్ని తెలియజేయుటకు స్తోత్రములను, భక్తి గీతములను కల్పించారు. దైవం యొక్క దివ్య గుణములను తెలియజేయుటకు శ్లోకాలు ఏర్పర్చారు. అష్టోత్తర

శతనామాలు, సహస్రనామాలు వ్రాసి అందించారు మన పెద్దలు, కనీసం అవి పఠించినప్పుడైనా భగవంతునిపై భక్తిపూర్వకమైన, స్నేహ బద్ధమైన జీవితాన్ని అనుభవించగలమనే దృక్పథంతోనే ఇలా మనకు తెలియజేసారు, చక్కని సందేశములనిచ్చే ఎన్నో పురాణాలను ఏర్పర్చటం జరిగింది. కానీ ఆరాధించేందుకు ఆలంబనగా విగ్రహారాధనను ఏర్పాటు చేశారు. ఆ విగ్రహానికి ఒక నామాన్ని, దానికి సంబంధించిన కొంత కథను తెలియజేశారు ఇలా దైవం గురించి కొంత అవగాహన కల్గిన పిమ్మట తనంతట తానే అవగాహన కల్గి సర్వాంతర్యామి అయిన పరమాత్మను తెలుసుకొనే అవకాశవముంటుందని నిర్ణయించారు. వారి కృషి, కృప ఫలితమే ఈ రోజు మనం గుడి కనిపిస్తే గుండెల మీదకు చేతులు తీసుకొని ముకిళించి వందన సమర్పణచేస్తున్నాము. కారణమేమిటి ? అందులోని విగ్రహాన్ని చూడగానే పరమాత్మ గుర్తుకు వస్తాడు. పవిత్ర భావన కల్గుతుంది, రక్షించే తండ్రీ ఆ దైవమే కనుక ఆయనకు వినమ్రతతో తలవంచి నమస్కరించుకుంటూ ఆగుడిలోని విగ్రహం రామునిదైతే ఆయన దివ్య లక్షణాలు, ఆయన యొక్క పితృ వాక్య పరిపాలన, ధర్మాచరణ మొదలగు విషయాలు గుర్తుకు వస్తాయి. అంతవరకూ ఏవేవో ఊహించుకుని పరుగులు తీస్తున్న మనస్సుకు విగ్రహం కనిపించగానే నిగ్రహం కల్గి కళ్యాణ రామునికి కృతజ్ఞతతో నమస్కరిస్తుంది. ఆ విధంగానే అమ్మవారి గుడి కనిపిస్తే అమ్మవారికి నమస్కరించుకుంటాము. తల్లీ నీవే పోషించి, రక్షించే తల్లివి, జగదాధారినివి, మూలశక్తివి అనే భావన కల్గుతుంది. మనస్సు ఆ కొద్ది ఘడియలైనా బయటకు పరుగులు తీయకుండా దైవంపై నిలుస్తుంది. ఆ విధంగా విగ్రహాన్ని చూడగానే నిగ్రహం కల్గి భక్తి భావం మనలో ఏర్పడిన

తరువాత ఇంకా ఇంకా దైవం గురించి తెలుసుకోవాలనే తపన కలిగి సాధుసత్పురుషులను ఆశ్రయిస్తాము. వారు భగవత్తత్వము ఎరిగించి సాధకునిగా మలచి, జన్మను ధన్యం చేసే సహకారం చేస్తారు.

దైవం రాతి బొమ్మ కాదు. అణువణువూ తానే అయినప్పుడు అందులోనూ ఉన్నాడు. కానీ ! దైవాన్ని కేవలం రాతి బొమ్మలో చూడడం అజ్ఞానమే అవుతుంది. దైవం మన ఇష్టప్రకారం తయారు చేయించిన ఆ మూడు అడుగులో, ఆరడుగులో రాతి బొమ్మ కాదు, ఇంటిలో మేకుకు వ్రేలాడదీసిన పటం కాదు. కానీ ! వాటిని చూడగానే దైవం యొక్క సర్వసమర్ధత, వ్యాపకత్వం, సర్వజ్ఞత్వం, గుర్తుకురావాలి శరణాగతులం కావాలి. ఈ లక్ష్యంతో దైవం గురించి ఏమీ తెలియని వారికి తెలియజేసేందుకు ఏర్పర్చారు. అవే సత్యం-అవే నిత్యం, అవే దైవం అనుకొని చేస్తుపోతే దైవం యొక్క పూర్ణజ్ఞానం మనకు అవగతం కాదు.

చదువుకున్న వారెవరైనా గాంధీ బొమ్మను చూడగానే ఆయన యొక్క సత్యాగ్రహం, సత్య నిష్ఠ, శాంతిమయ జీవితం, నిరాడంబరత గుర్తుకు వచ్చి ఆ జాతిపితకు గౌరవవందనాన్ని చేస్తారు. అంతేకాని ఆ విగ్రహానికి కాదు. ఆయన దివ్య జీవన సందేశానికి మాత్రమే.

శ్రీ పరాత్పరికీ జై !!

ఏపాదాలకు నమస్కరించినా ఆపాదాలకే చెందుతాయి

భగవంతుని యొక్క పాదమే ఈ విశాల విశ్వం. ఈ విశ్వమంతా ఆయనపై ఆధారపడి ఉన్నది. దృశ్యకల్పితమైన ఈ జగమంతా ఆయన సొంతమే. ఆయనే కదా ఈ అనేకమైన వింత రూప ప్రపంచం. కనుక ఆయునకు విడిగా ఏమీలేదు. విడిగా ఉన్నది అజ్ఞానరూపమై అహంకరించి హూంకరించుచున్న మన చిత్తం. దైవం తనకంటే అన్యం అనుకుంటుంది. నిరంతరం చింతిస్తూ శాంతి లేకుండా చేస్తుంది. మన ప్రయత్నాలేవీ మన ఇచ్ఛ ప్రకారం జరగనప్పుడు దైవంపై భారం వేస్తాము. అనేక విధముల నమస్కరిస్తాము. శాంతిని ప్రసాదించమని, ఈ కష్టమునుంచి గట్టెక్కించమని, అనేక రూపములను ఆరాధించి అర్థిస్తాము. ఏది ఏమైనప్పటికి భక్తిపూర్వకమైన మన నమస్కారం ఏ రూపానికి పెట్టినా నామరూపరహితుడైన ఆ దైవానికే అందుతుంది. కారణం రూపం, నామంలేని వాడు తనకు తానుగానే అనేకమయ్యాడు కనుక అన్ని నామములు అతనివే అన్ని రూపములు అతనివే. దేహభావం చేత దేహమోహం చేత మనకు వేరు వేరు అనిపించవచ్చు. మన మనస్సుకు నచ్చిన ఏ నామాన్ని స్మరించినా, ఏ రూపాన్ని ధ్యానించినా చివరకు చెందేది నిరాకార బ్రహ్మమైన ఆ దైవానికే కనుక ఎవరికి నమస్కరించినా తనకే చెందుతుందని ద్వాపరమందు గీతాచార్యుడు బోధించాడు, తనకు అంటే నామరూపములతో కూడుకొని ఉన్న కృష్ణుని కాదు. సర్వాధారుడైన ఆ సర్వేశ్వరునికే అని అర్థం.

జిల్లెళ్ళమూడి అమ్మ భక్తులైనటువంటి శ్రీ రామకృష్ణ అన్నయ్య గారు (ఉపాధ్యాయులు) ఏలూరులో ఉంటున్నారు. ఆధ్యాత్మికంగా ప్రవచనం చెప్పడానికి నేను (రచయిత) ఏలూరు వెళ్లేటప్పుడు ఆ

కార్యక్రమానికి వారు కూడా వచ్చారు. వారితో అక్కడి భక్తులు పరిచయ భాగ్యం ప్రసాదించారు. నిరంతరం అమ్మ స్మరణలో శేషజీవితాన్ని గడుపుచున్న ధన్యులు శ్రీ రామకృష్ణ అన్నయ్య గారు. వారు అమ్మ గురించి ఈ క్రింది విధంగా చెప్పారు.

అమ్మ ఒక రోజు పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టారు గార్ని, రామకృష్ణ అన్నయ్యను తణుకుకు మూడుమైళ్ల దూరంలో ఉన్న చివటం గ్రామంలో ఉన్న అవధూత శ్రీ చివటం అమ్మగార్ని దర్శించి రమ్మన్నారట, ఆ మాటకు రామకృష్ణ అన్నయ్య గారు అమ్మా.. మీ దివ్య రూపాన్ని, చల్లని మీ ప్రేమ సన్నిధిని మించి వేరొకటేముంది. నాపై దయఉంచి నన్ను చూసి రమ్మని చెప్పకండి అమ్మా .... అని విన్నవించుకున్నారు. దానికి అమ్మ బదులిస్తూ నాన్నా ఇక్కడా అక్కడా ఉన్నది ఒకటేనని తెలియాలిగా! అన్నారు. అమ్మ మాటను కాదనలేక బయలుదేరి శ్రీ భరద్వాజ మాస్టారితో కలిసి వెళ్లటం జరిగింది. చివటం చేరి అమ్మకు నమస్కరించు కుంటున్నప్పుడు జిల్లెళ్ళమూడి అమ్మ సన్నిధిలో లభ్యమైన శాంతియే ఇసుమంత తేడాలేక లభ్యమయ్యింది. నమస్కారం చేస్తున్న రామ కృష్ణ అన్నయ్యను లే నాన్న ఉన్నది ఒకటే కదా ! అని జిల్లెళ్లమూడి అమ్మలా పలికి లేవనెత్తారు. ఆశ్చర్యమేమంటే చివటం అమ్మగారి గొంతు కాదటది?! జిల్లెళ్లమూడి అమ్మ గొంతు స్పష్టంగా వినిపించింది. ఏకత్వాన్ని తెలియజేసేందుకే, ఏ పాదములకు నమస్కరించినా చేరేది సత్యమైయున్న ఒకే ఒక పరమాత్మకే అని రామకృష్ణ అన్నయ్యను చివటం పంపి అవధూత చివటం అమ్మకూ, తనకూ అభేదాన్ని తెలియజేసారు అమ్మ.

కనుక ‘‘ఏ పాదాలకు నమస్కరించినా ఆపాదాలకే అందుతాయి’’ అని అమ్మ వచించారు.

శ్రీ పరాత్పరికీ జై !!

గుర్తించే గుర్తులేక దీపమున్నా గుర్తించలేడు

అనేకమై అలరారుచున్న ఈ జగత్తులో ఈశ్వరుడు ఏకమైయున్నాడు. ఖండ ఖండములుగా కనిపిస్తున్న ప్రపంచములో అఖండమై వ్యాపించియున్నాడు. ఎన్ని రకాల వృక్షాలు, ఎన్నెన్ని రకాల పక్షులు, మరెన్ని రకముల మనుష్యులు, ఇతరత్రా జీవులు, ఎంత వైవిధ్యం. అయినా వాన్ని గుర్తంచలేకున్నాము. కారణం ! వాన్ని గుర్తించే గుర్తులేక. ఆగుర్తులో ఉండలేకపోవడం వల్లనే వానిని తెలిసికోలేకపోవుచున్నాము. ఉదాహరణమునకు మన ఎదురుగానే దీపముంది. దీపకాంతిలోనే ఉన్నామనుకుందాము. మన మనస్సు ఏదో గతాన్ని చింతిస్తుంది. దానిని గురించిన ఆలోచనలతోనే సతమతమవుతుంది. ఆ ఊహలలో మునిగి ఉంది. ఈలోగా మన అమ్మ వచ్చి మనల్ని తిడుతుంది. త్రుల్లిపడి వాస్తవానికి వస్తాం ఏం జరిగిందమ్మా ! అలా నన్ను తిడుతున్నావంటాం. అప్పుడు అమ్మ అంటుంది. భోజనం వడ్డించి, నీ ముందుంచి అర్థగంట కాలమయ్యింది దానిని చూడకుండా ఏవో ఊహల్లో మునిగిపోయావు ఈలోగా కుక్క వచ్చి ఆ అన్నాన్ని తినేసింది. నీకేమైన బుద్ధి బుర్ర లేదట్రా అని చీవాట్లు పెడుతుంది. అప్పుడంటావు అరె! నాముందు నీవు భోజనముంచినట్లు గుర్తులేదే! అంటాము. దీనిని గమనించి చూస్తే మనకేం తోస్తుంది. దీపం ఉన్నప్పటికీ వాస్తవమైన గుర్తులో లేము కనుక ఏమి జరిగినా, ఏమున్నా తెలిసికోలేము. అప్పుడు కళ్లు తెరిచిఉన్నా, చెవులున్నా, గుర్తించే ప్రజ్ఞలేకపోతే తెలియదు, తెలియబడదు. దైవంను తెలిసికొనే విషయంలోనూ ఇంతే. మనకంటి ముందు సమస్తం గోచరమైనా బాహ్యభావంతో విషయంగానే చూస్తాముగాని సత్యాన్ని చూడలేము. కారణం ! వాగ్మానసములకు గోచరం కానిది. దైవాన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాస నిజంగా మనలో కలిగితే ఆ ఆరాటం సత్య

ద్రష్టలైన మహనీయుల సన్నిధికి తీసుకొని పోతుంది. వారొసంగిన జ్ఞానదీపంతో విషయభావన వదలి సర్వమయుండైన ఈశ్వరున్ని చూడగల్గుతావు. అందరిలో, అన్నింటిలో ఆ దైవం ఆత్మగా ప్రకాశిస్తున్నప్పటికీ, ప్రజ్ఞా జ్యోతిగా ఉన్నప్పటికీ, అజ్ఞానం చేత మనలో ఉన్న ఆ చైతన్య స్వరూపుని గుర్తించలేకున్నాము. మనం జ్ఞాన స్వరూపులమైనప్పటికీ ఆవరణ దోషం వలన, అజ్ఞానం వలన మనల్ని మనమే గుర్తించలేకున్నాము. ఇన్ని ఇబ్బందులకు గురి అవుచున్నాము. మోహపాశంలో చిక్కి దుఃఖితులమగుచున్నాము. ఆత్మజ్ఞానం నిజగురునిచే ఎరిగించబడినప్పుడు ఆవరణ దోషం తొలగి స్వరూపమైన ఆత్మ దర్శనమవుతుంది. అదియే మోక్షము. అదియే ముక్తి. అలాంటి సత్యజ్ఞానం లేనిదే ఆ పరమాత్మను గుర్తించుట దుర్లభం.

శ్రీ స్వామి వివేకానంద ప్రబోధించినట్లు మన తోటివారి, సాటి వారి రూపములలో, సకల జీవులలో నిండి జగత్ రూపంలో ప్రకటమైన పరమాత్మను గుర్తించి, ప్రేమించి, సేవించనప్పుడు జడములైన విగ్రహాలకు, పటాలకు పూజలు చేయడం, అభిషేకములుచేయడం నిష్ప్రయోజనం. ఇవి చేయడం వలన పుణ్యము వస్తే రావచ్చు కానీ జ్ఞానం రాదు. జ్ఞానం రానంత వరకు పరమాత్మను గుర్తించలేము.

దీపము వంటి జ్ఞానం మనలో ఉన్నప్పటికీ అజ్ఞాన ఆవరణమువలన మన స్వరూపమును, జగత్ రూపంలో వ్యక్తమైన పరమాత్మను గుర్తించలేము.

పూర్ణులైన మహనీయుల రూపంలో ప్రకటమైన పరమాత్మను గుర్తించలేము. పూర్ణ జ్ఞానులైన గురువుల సన్నిధిలభించినా మనకున్న మానసికమైన అవగాహన చేత వాళ్ళను మనలాంటి మనషులుగానే చూస్తాము. కానీ అజ్ఞాన చీకటిని తొలగించి జ్ఞాన కాంతులను ప్రసరించే

దివ్య పురుషులుగా గుర్తించలేము. ఇదే మన దురదృష్టం. వారు ఎంత సత్యజ్ఞానాన్ని ప్రబోధించి, పరమాత్మ ఉనికిని తెలియపరచినా, చెవిటివాని ముందు శంఖమూదిన మాదిరి అవుతుంది. వారి నుండి తరంగాలై వస్తున్న జ్ఞాన శంఖారావం మనం చెవిటి వారిగా ఉన్నంతకాలం మనకు వినిపించదు, హృదయ గతం కాదు, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న మాదిరవుతుంది మన తంతు.

వారందించిన సత్య జ్ఞానము సూర్య ప్రకాశంలా ప్రకాశిస్తున్నా అహంకారమనే ముసుగు కప్పుకొని ఉన్నంతకాలం, ఆదమరిచి నిద్రపోతున్నంతకాలం. మనకు ఆ వెలుగు తెలియదు. మన చుట్టూ అలుముకున్న చీకటి తొలగదు. కనుక వారందించిన సత్యమును నిరంతరము గుర్తులో ఉంచుకొని స్మరించి జీవిస్తే సత్య జీవనమవుతుంది.

శ్రీ పరాత్పరికీ జై !!

విచక్షణ లేని వీక్షణే అనుగ్రహం

మనస్సు చేతిలో కీలుబొమ్మలమై బ్రతుకుతున్న మనము ద్వంద్వ భావాలను కల్గియున్నాము. మంచి చెడులను చూస్తున్నాము. బ్రాహ్మణులని, క్షత్రియులని, వైశ్యులని, శూద్రులని, పంచములని వర్ణ వ్యవస్థను చూసి ప్రవర్తిస్తాము. కుల గోత్రాలను పట్టించుకుంటాము. దొరలని, దొంగలని, పెద్దలని, చిన్నలని, ఛండాలుడని, ఆచారవంతుడని, విభజన చేసేది అజ్ఞానమయమైన మన చిత్తం, ఈశ్వర జ్ఞానం లేకయే, ఈ విభజనంతా. కానీ ఈశ్వర దృష్టిలో విభజనలేదు. సర్వసముండై సర్వమయుండై యున్నాడు. ఆయనకు లేని తారతమ్యాలు మన కెందుకు?! ఆయన విచక్షణారహితుడై ఉన్నాడు. విచక్షణలేని జ్ఞానాన్ని మానవునికి అందించుటకు గురువై మానవ రూపాన్నే ఎన్నుకొని మనలాగే

మన మధ్యనే మెలగుతూ తెలియు జేస్తున్నాడు. ఆవరణం (అజ్ఞానం)దోషముచే మరచిపోయిన మన స్వరూపాన్ని ఎరిగిస్తున్నాడు ఇది ఆయన కరుణ.

ఇంతగా మన కోసం ఎందుకు పాటుపడుచున్నాడంటే మానసిక సంసారంలో పడి మునుగుతున్న మనల్ని వెలికితీసి వెలుగులోకి వెలితిలేని బ్రతుకులోకి తీసుకుపోయి ముక్తున్ని చేయడానికే ఆయన తాపత్రయమంతా. మనకి ఆయన అన్యంగా ఉన్నాడనుకోవచ్చు మన మనస్సు. కానీ ఆయనకు మనము అన్యంగాలేము. ఆయన బ్రాహ్మణులను ఒక విధంగా, క్షత్రియులను ఒక విధంగా, మిగతా జాతులవారిని ఒక విధంగా చూడలేదు. సమస్త జీవరాశిని ఒకే విధంగా చూస్తున్నాడు. అదే అనంతమైన ప్రేమ, కారణం తనే ఈ జగత్తంతా కనుక తనను తానే ప్రేమించుకుంటున్నాడు. మరి మన సంగతికి వస్తే మన మనస్సు మన స్వరూపమైన ఆత్మ నుండి మనల్ని వేరు చేసి నాటకమాడిస్తుంది. ఒక్కోసారి విషయానందాన్ని పొంది, ఒక్కొక్కసారి కంటతడి పెట్టిస్తుంది. అందరిలో ఆత్మగా ఉన్న పరమాత్మను గుర్తించే జ్ఞానం లేక, వాడి గుణకర్మలను బట్టి దురాత్ముడని, మహాత్ముడని, దుర్మార్గుడని, సన్మార్గుడని, విభజన దృష్టితో చూస్తున్నాము. ఉన్న సత్యాన్ని చూసి ఆనందించి ప్రేమించడం లేదు. సేవించడం లేదు. ఇది మనోరీతి. సమత్వం దైవ రీతి. ఒక అవధూత తను బిచ్చమెత్తి తెచ్చుకున్న అన్నాన్ని నడి వీధిలో కూర్చొని, కుక్కలను, పందులను పిలిచి వాటికి పెడుతూ తను తింటున్నాడు. వాటిమూతికి అంటి ఉన్న మలం తన చేతికి అంటుకుంటున్నా గమనించలేదు. వాటికి పెడుతూ, తాను తింటూ ఆనందంతో నవ్వుకుంటున్నాడు. దారిని పోయేవారు కొంతమంది చూసి అసహ్యించుకొని పిచ్చి వెధవ ! పరమ దరిద్రుడు!! చూశారా ఎంత అసహ్యంగా ఉందో ఈ సన్నివేశం. వాటితో కలిసి తిని ఆనందిస్తున్నాడు అని తమలో తాము నవ్వుకుంటూ అసహ్యించుకున్నారు. అది గమనించిన ఆ అవధూత వార్ని పిలిచి అయ్యా! మనమూ, ఈ జంతువులు, ఈ జీవులు, ఈ సమస్తము

ఎవరేమనుకుంటున్నా విష్ణువే (పరమాత్మ). ఆయనే ఉపవిష్ణువై నారూపేణ తన రూపములగు ఈ పందులు, కుక్కలకు, ఆహారం పెడుతున్నాడు, ఆహారము ఆయనే కనుక ఎవర్ని చూసి నవ్వుచున్నారు. వేరే ఎవర్ని చూసి అసహ్యించుకుంటున్నారు. సకలమంతా ఆ సర్వేశ్వరునిదే కదా అని హితబోధ చేశారు. వారి కళ్లు తెరవబడ్డాయి. ఆ అవధూత సామాన్యుడు కాడని సర్వజ్ఞుడగు గురువని గుర్తెరిగి పాదాక్రాంతులై శరణువేడారు. వారిని ఆ మహానుభావుడు ప్రేమతో ఆశీర్వదించారు. నాయనలారా ! భేద బుద్ధి చేతనే భగవంతుని నిజరూపం తెలియబడటం లేదు. అబేధమైన జ్ఞానము గురువు ఎరిగించిననాడే, ఆ జ్ఞానమును అనుష్ఠించిన నాడే సత్యస్వరూపుని దర్శనం కల్గుతుంది. భేదవాదములను వదలి విశ్వనాధుని సర్వులలో చూచిననాడే విచక్షణలేని అనుగ్రహం లభిస్తుంది.

గురురూపేణ మన స్వరూప జ్ఞానం మనకు ఎరిగించడమే ఆయన కృప.

నిజ గురునకు తారతమ్యములుండవు, వేరు భావముండదు, సుఖదుఃఖములలో తగుల్కొనడు, దేహ, లోక వాసనలు లేక సత్యావాసియై, సత్యానందమును పొందుతూ ఉంటాడు. తనను ఆశ్రయించిన వానికి సత్యమును ఉపదేశించి, భవబంధము నుండి విడిపిస్తాడు. ఇదియే విచక్షణలేని వీక్షణ. ఇదియే పరమాత్మ మనల్ని ఉద్ధరించడానికి మానవాకారంతో వచ్చి మనల్ని బ్రోచే అనుగ్రహం.

శ్రీపరాత్పరికీ జై !!

సహనమనే దేవతను ఆరాధించాలంటే బాధలనే పూజా ద్రవ్యాలు కావాలి

మనము అనుకున్నది జరిగినంతకాలం ఆనందముగానే ఉంటాము. మన మనస్సుకు నచ్చిన విధంగా జరిగినంతకాలం

సంతోషంగానే ఉంటాము. ఏమాత్రం వక్రిస్తే సహించలేము. అందుకే సహనం అన్నింటికంటే గొప్పది, ఉత్తమమైనది అన్నారు పెద్దలు. సహనం కల్గిన వ్యక్తి ఉన్నతుడుగా తీర్చదిద్దబడతాడు.

సహనం కల్గిన వారంతా మహనీయమహాత్ములుగా కీర్తిగాంచుచున్నారు. కారణం !! వారెన్ని నిందలను భరించారో, ఎంత వేదనను ఓర్చుకున్నారో, ఎన్ని ఇబ్బందులను సహించారో వారికే ఎరుక. నిరంతరము సత్యమునందు దృష్టినిలిపి, సత్యాన్ని అనుష్ఠించి, ఆచరించి తరించారు. తత్స్వరూపులైనారు. సత్యాన్ని బోధించటంలో వారెన్ని కష్టాలను ఎదుర్కొన్నారో వారి జీవితాలను గమనిస్తే మనకేం తెలుస్తుంది ?!. అలా చివరివరకు సత్య జ్ఞానం చేత భరిస్తూ వచ్చారు. నిందించి, దూషించి, హింసించినలోకం వారు గతించిన తరువాత వారికి ఆరాధనలు చేయటం, వారి గురించి ప్రవచనాలు చేయడం, దైవాంశ సంభూతులని గుర్తించి కీర్తించడం చేసింది. నేడు ఈ లోకంచే కొనియాడ బడుచున్న సద్గురువులంతా ఒకప్పుడు లోకం చేత పీడింప బడినవారే. కానీ వారు సత్యంకోసం సహించారు. సర్వులను సమంగా చూశారు. శత్రు మిత్ర భేదాన్ని విసర్జించి కరుణించారు. ఎందువలన?! వారు సహనమనే దేవతను ఆరాధించారు. బాధలనే పూజాద్రవ్యాలను స్వీకరించారు. సహనం స్థిరమయ్యింది. అచలమై నిలచింది. తమ స్వరూపసాక్షాత్కారాన్ని ప్రసాదించింది. సత్యం వచించినందులకు యేసును ఏంచేసారు?!... తమ పెత్తనాలు చెల్లవని పీఠాధిపతులు, మతాధిపతులు, ఆయన్ని నిందించి, నానా విధములైన దుర్భాషలాడి, సిలువను లాగించారు, ముఖంపై ఉమ్మివేసారు, కొరడాలతో కొట్టారు. ఛీకొట్టారు, చీదరించుకున్నారు ఏం చేశాడు ఏసు... ఏమి చేయలేదు, వదనములో చిరునవ్వుచెదరలేదు, సహనం కోల్పోలేదు, కోపగించు కోలేదు, శపించలేదు. ఆ సహనాన్ని కూడా చూడలేక పోయారు. అహంభావ పూరితులై హింసిస్తున్న జనం. నెత్తిన ముళ్ల కిరీటం పెట్టారు,

రక్తం చిందుతుంది, కొండ మీదకు తీసుకుపోయారు, సిలువపై పడుకుండబెట్టి చేతులకు, కాళ్లకు మేకులు కొట్టారు, గేలిచేసి నవ్వారు, కానీ !! ఆ సహనమూర్తిలో చిరునవ్వు ఇసుమంత చెదరలేదు. చివరకు "నా తండ్రీ అజ్ఞానంచేత వీళ్లంతా ఏమి చేస్తున్నారో వీళ్లకే తెలియదు వీళ్లను క్షమించు తండ్రీ !" అని క్షమాగుణ సంపన్నుడై పరలోకమందున్న తండ్రికి, (ఈశ్వరునికి) విన్నవించుకుని దేహాన్ని వదిలాడు. ఆయన చేసిన తప్పేమిటి ?! అజ్ఞానము తొలగించి, జ్ఞానమును ఎరిగించి, దీనులను బ్రోచి, ఆర్తులను కాచి, రోగులను స్వస్థత పరచటమా ఆయన చేసిన నేరం ?! దానికి ఫలితంగా లోకం ఆయన్ని సిలువపై చంపింది.

కానీ ! ... ఆ సహనం, ఆక్షమ, ఆ నిర్మోహం, ఆ నిరాడంబరత, ఆ సంభాషణం "పరిశుద్ధ గ్రంథమై"లోకానికి నవజీనవ మార్గదర్శి అయ్యింది. సిలువ వేయబడిన ఆ యేసు బోధ మానవహృదయాలలో వెలుగై, మార్గమై, రాజ్యమేలుతుంది. ఆయన అందరికీ ప్రభువయ్యాడు. ఆ సహనమే సత్యవంతుణ్ణి చేసింది. యేసు అందరిచేత ప్రభువుగా ఆరాధించబడుచున్నాడు.

శ్రీ కృష్ణుడు కుంతీవద్దకు వెళ్లి నీకేంకావాలో కోరుకో అన్నాడు అందులకు కుంతీ... కృష్ణా! మాకు నిరంతరం కష్టాల్ని ప్రసాదించు అని ఆర్ధ్రత నిండిన కళ్లతో అభ్యర్థించి నమస్కరించింది. అందులకు శ్రీ కృష్ణుడు ఆశ్చర్యపోతూ ఏమిటి! కష్టాలు ప్రసాదించాలా?! కారణమేమిటని ప్రశ్నించాడు. అందులకు కుంతీ.. స్వామీ ... నిరంతరం కష్టాలున్నప్పుడు వాటిని అనుభవిస్తున్నప్పుడే నీస్మరణ జరుగుతుంది. కష్టాలున్నంతకాలం నీ చింతన వుంటుంది. నీ యొక్క చింతనలోనే అనంతమైన శాంతిలభ్యమవుతుంది బాధలు లేనప్పుడు సుఖాలుంటాయి. సుఖాలలో నీ స్మరణ మరచిపోతాము, మాయ ఆవరిస్తుంది. నీ యందు ధ్యాసను చెడగొడుతుంది నీ ధ్యాసలేని జీవితం

దుఃఖమయం, అశాశ్వితం. ఆ కష్టాలను అనుభవించే సహనం నీ స్మరణలోనే లభిస్తుంది. అని కోరే సరికి శ్రీ కృష్ణుడి కళ్లల్లో ఆనందబాష్పాలు దోబూచులాడాయి. పరిపూర్ణ అనుగ్రహాన్ని ప్రసాదించాడు, పాండవుల అండను నిలిచి ధర్మవిజయాన్ని వారికి ప్రసాదించాడు.

కనుకనే దైవానుగ్రహానికి పాత్రులం కావాలంటే కష్ట సుఖాలను, నిందాస్తుతులను ఓర్చుకోవలసినదే, సహనమే మనల్ని తీర్చిదిద్ది అనుగ్రహాన్ని పొందడానికి తగు అర్హతను ప్రసాదిస్తుంది. బంగారం ఆభరణంగా రూపుదాల్చవలెనన్న నిప్పులలో కాలవలసినదే. సుత్తిదెబ్బలను ఓర్వవలసినదే, ఉలి పోటును భరించవలసినదే, అనేక రాపిడులను తట్టుకున్న తరువాత పాడులు తాల్చబడి ఆభరణంగా నూత్న రూపాన్ని పొందుతుంది.

కాబట్టి ''సహనమనే దేవతను ఆరాధించాలంటే బాధలనే పూజా ద్రవ్యాలు కావాలి'' అన్నారు అమ్మ.

శ్రీ పరాత్పరికీ జై !!

జనన మరణాల గురించి పొంగు కృంగులు లేకపోవడమే అమృతత్వం

బాహ్యదృష్టికి కనిపిస్తున్నదంతా నశించక తప్పదు. కారణం ! .. పుట్టే ప్రతీదీ గిట్టక తప్పదు. పుట్టుక, వృద్ధి నాశనము పంచభూతములతో నిర్మితములై, పంచభూతములపై ఆధారపడే సమస్త జీవరాశికి తప్పదు. గత సంస్కారములను అనుసరించి, గతములో చేసికొన్న కర్మలను ఆధారం చేసుకొని జీవులకు ఆయాదేహాలు ఆపాదించబడతాయి. కనుకనే పుట్టిన దేహం మట్టిలో కలిసిపోతుంది. సర్వ దేహములలో సర్వాధారమై యున్న పరమాత్మ ఆత్మగానే ఉన్నాడు. ఆత్మ ఆధారంతోనే

సకలేంద్రియములు పనిచేయుచున్నవి. ఆత్మ శాశ్వితమైనది, కర్తృత్వభోక్తృత్వములు, జనన మరణములు లేనిది. వెలుగై ప్రకాశించే సాక్షి. ఇదే మన నిజస్వరూపం కానీ దానిని మరచి దేహంతో తాదాత్మ్యం చెంది దేహం మనమనుకుంటున్నాము. ఇది శాశ్వతం కాదని తెలిసికూడా ఆత్మ భావనతో జీవించలేకున్నాము. కారణము ! .. భ్రాంతులలో ముంచుతున్న మన మనస్సే. ఆత్మ నెరుగనినాడు జగత్ సత్యమనే భ్రాంతిపోదు. భ్రాంతి ఉన్నంత కాలము జీవునికి శాంతిలేదు. చావు పుట్టుకలు దేహానికేగాని ఆ దేహానికి ఆధారంగా ఉన్న దేవ దేవునికి కాదు. కర్మ తీరిపోగానే క్షణమైనా నిలువదు ఈ దేహం మట్టిలో చేరిపోవలసినదే. మనం ఆనంద స్వరూపులమని, దివ్యాత్మస్వరూపులమని పూర్ణ జ్ఞానులైన మహనీయులు, సద్గురువులు ఎంత చెప్పినా, మనకు అవగతంకాదు. కారణం ! జీవభావంతో నిండా మునిగి ఉన్నాము. విషయ వాసనలతో, లోకవాసనలతో, కలిసి మెలగుతున్నాం. అంతే కానీ సత్యమైన మన స్వరూపమును తెలిసికొనుటకు విచారణ చేయులేదు. మనకు చావూలేదు, పుట్టుకాలేదు. ఎందుకనగా మనం ఆత్మస్వరూపులం కనుక. ఆత్మజ్ఞానం కల్గిన మహాత్ములు చావుపుట్టుకల గురించి వారికి చింతయే ఉండదు. వారికి దేహాభిమానం ఇంచుక ఉండదు. దేహం ఉన్నంతవరకూ, దీనిని పరికరంగా ఉపయోగించుకుంటూ తద్వారా సత్యాన్ని ప్రబోధిస్తున్నారు. జనన మరణములకు అతీతులై అనంత బ్రహ్మానందాన్ని అనుభవిస్తున్నారు. బ్రహ్మానందస్వరూపులైన తమ సన్నిధి చేరేవారికి ఆనంద జీవితాన్ని అనుగ్రహిస్తున్నారు. సత్కార్మలాచరించి సద్గతిని పొందమని శలవిస్తున్నారు. నేను దేహం అనే మిథ్యాభావాన్ని, మోహభావాన్ని వదలి నేను ఆత్మను అనే దృఢ భావం కలిగి ద్వంద్వములలో తగుల్కొనక ద్వంద్వాతీతమైన ఆనందస్వరూపులుగా జీవించమని శతవిధాల ప్రబోధిస్తున్నారు. వారు అనుభవించి, అనుగ్రహించిన అమృత వచనాలు హృదయగతం చేసికొని ఆచరించి జీవించేవాళ్లంతా జీవన్ముక్తులై ధన్యులగుచున్నారు.

పసి బాలుడైన ప్రహ్లాదుడు తన తండ్రి ఎన్ని హింసలకు గురి చేసినా, ఎంత చిత్రవధకు పాల్పడినా, మరణభీతినొందక, కృంగక, ఆత్మానందమును కోల్పోక నిశ్చలుడై నిర్మలుడై భరించాడు. దేహము చచ్చిపోతుందేమో అన్న భయం ఇసుమంతా కూడా తనలో కలగలేదు. సర్వ జీవులు, సకల రూపములు, నామములు ఆనారాయణునివే అనే భావన చేత, ఆయా దేహములలో ఉన్నది తానే అనే దృఢ విశ్వాసంచేత భీతినొందలేదు. నాలో ఉన్నది, ఆ నారాయణుడే, (ఈశ్వరుడే) అని భావించి జీవించాడు. అణువణువునా ఆ దైవాన్ని చూశాడు. కనుకనే ఏ బాధలకు, భయాలకూ, లోనుకాలేదు. దేహం శాశ్వితం కాదని తెలుసుకున్నాడు. ఉన్నది ఆ తండ్రే అనే జ్ఞానాన్ని అవగతం చేసికొన్నాడు. నారాయణానుగ్రహానికి పాత్రుడై ఆదర్శ ప్రాయుడయ్యాడు ప్రహ్లాదుడు.

దక్షిణామూర్తిలా మౌనంతో జ్ఞానాన్ని పంచిన భగవాన్ రమణ మహర్షికి భుజముపై వ్రణములేచింది. పెద్దదై చీమూ నెత్తురు స్రవిస్తుంటే భక్తులు, సేవకులు చూసి చాలా బాధపడుతున్నారు. రోజు రోజుకీ రమణ మహర్షి దేహం క్షీణించిపోతుంది. వారు దూరమవుతారన్న బాధను తట్టుకోలేక శిష్యులు భగవాన్‌తో ఇలా అన్నారు. ‘‘స్వామీ ! ..... మీ దర్శనానికి వచ్చి ఎంతో మంది శాంతిని పొందుతున్నారు, కొంత మందికి మీ దర్శనం సందేహనివృత్తిని, జ్ఞానాన్ని కలుగజేస్తుంది, మీ వాక్కు ఎందరో ఆర్తుల బాధలను బాపుతుంది, మీ చూపు అంతరంగాన్ని పరిశుద్ధం చేస్తుంది, మీ స్పర్శవలన ఎందరో స్వస్థత పొందారు. అంతటిశక్తివంతులై ఉండి కూడా మీరు మీ బాధను పట్టించుకోవడం లేదు. మీరు ఈ పుండు తగ్గాలి అని సంకల్పిస్తే సంకల్పమాత్రమున క్షణములో మటుమాయమవుతుంది. కనుక మీరు సంకల్పం చేస్తే మంచిది’’ అని చెప్పారు.

దానికి రమణ మహర్షి బదులిస్తూ ‘‘నాకు ఒక దేహముంది... దానికి ఒక పుండుపుట్టింది, దాని వలన చాలా బాధకలుగుతుంది,

అని అనుకునేవాడు (దేహంతో తాదాత్మ్యం చెందే మనస్సు) నాలో లేడయ్యా అందుచేత నాకేమీ అనిపించలేదు'' అన్నారు. చూశారా ఆ మహనీయుని అమృతానుభవం! ఆయనకి ఎలా కలిగింది?! కేవలం దేహాభిమానం వీడి సర్వగత చైతన్యుడైన ఈశ్వరునియందు లీనం కావటం వలననే. జనన మరణముల గురించి పొంగు కృంగులు మనసును పట్టుకొని దానిగుణములతో చేరిన మనకే ఉంటాయి కాని. స్వరూపజ్ఞానం కల్గిన వారికి ఉండవు. అందువలన గురు జ్ఞానం వలన కష్ట సుఖముల ద్వంద్వములలో తగుల్కొనక, దేహభావాన్ని వీడి ఆత్మభావంతో జీవించడమే అమృతత్వం.

శ్రీ పరాత్పరికీ జై !!

సర్వకాల సర్వావస్థల యందు సమానమైన స్థితి సమాధి

పూర్ణ శాంతిని పొందాలనే మనిషి నిరంతర తపన విషయాల ద్వారా పొందే ఆనందం తనకు పూర్తి శాంతిసంతోషములనివ్వనప్పుడు, బాహ్య విషయాలపై విరక్తి విసుగు భావన కలిగినప్పుడు, పూర్ణ శాంతిని సుఖాన్ని పొందేదెలా ?! అని తాపత్రయపడుతున్న తరుణంలో సత్యద్రష్టలు తారసపడతారు. వారు ఈ నేలపైకి వచ్చి నడియాడేది, సంసార భారాన్ని మోయలేక, శాంతికై ఆరాటపడే ఆర్తులను ఆదుకొని, పూర్ణ జ్ఞానాన్ని ప్రసాదించి, పూర్ణశాంతిని ప్రసాదించడానికే వారి ఆగమనం. వారు అందించిన బోధ ప్రకారం కొంత కాలము ధ్యానాది సాధనలు చేయటం పరిపాటి.

కళ్లు తెరిచి చూస్తే బాహ్య ప్రపంచం గోచరమవుతుంది. ఈ బాహ్యజగత్తంతా ఈశ్వరసృష్టి. ఆయనే సృష్టిగా ఉన్నాడు. మనకి ఆయన తెలియడం లేదు. జగత్తే కనిపిస్తుంది. జగద్భావన వలన శాంతిలేదు, సౌఖ్యములేదు. మహనీయుల అనుగ్రహభాషణము మేరకు కనులు

మూసి అంతరంగాన్ని పరిశీలిస్తే అల్లకల్లోలంగా ఉంటుంది అంతరంగం. అలజడిగా, గమనించడానికి భరించలేనంతగా ఉంటుంది లోన. అప్పుడు తెలిసికొంటావు. భయపెట్టేది, బాధపెట్టేది బాహ్యంకాదు. నాలో నిరంతరం చలించి అనేక సంకల్పవికల్పాలను సృష్టిస్తున్నది మన మనస్సే.

మనస్సునను, దాని ఆలోచనలను గమనిస్తూ వాటికి తగుల్కొనక, ఏ విషయవాంఛ తలెత్తకుండా ఉండేందుకు ప్రయత్నంచేస్తాము. ఆ విధంగా కనులు మూసుకుని మనోవికారములకు తగుల్కొనక చేసే ప్రయత్నమే "ధ్యానం" అనబడుతుంది.

అప్పటినుంచి రోజూ ఏదో ఒక సమయాన్ని ఏర్పాటు చేసుకుంటూ ధ్యానం చేయడం జరుగుతుంది. ధ్యానం వలన అంతరంగం నిర్విషయమవుతుంది. విషయములు ఎప్పుడైతే లేవో ఆత్మానందం అనుభవము అవుతుంది. కనుకనే ఋషులు ధ్యానము వలననే ఆత్మ దర్శనమవుతుంది అన్నారు.

ఇలా ఇలా చేయగా విషయాలకు అతీతమైన ఆనందాన్ని పొందుతూ తనని తాను మరచిపోతూ ఉండడం జరుగుతూ ఉంటుంది. అంటే దేహం ఉన్నట్లు అనుభవం ఉండదు. అంతా ఆనందమయంగానే తోస్తుంది. ఇట్టి సందర్భములో తన అనుభూతిని కృతజ్ఞతాపూర్వకంగా గురువునకు విన్నవిస్తే. ఆ గురువు సంతోషించి మరింత ప్రోత్సహిస్తూ, జ్ఞానాన్ని ఎరిగిస్తే ఆనందాన్ని అనుభవించాను అంటున్నావు నిజమేకాని ?! ఆనందాన్ని అనుభవిస్తున్నది ఒకటి ఉండిపోతుంది. అదెవరో ? దాన్ని విచారణ చేస్తే అప్పుడు ధ్యాత, ధ్యానము, ధ్యేయము ఈ మూడింటికి అతీతమైన సమాధి స్థితి లభ్యమవుతుందని శలవిస్తారు. అప్పటినుండి అనుభవిస్తున్న కర్త ఎవరో విచారణ చేస్తే సత్యం స్పష్టమోతుంది. అంతేకాని ఏదో రోజుకు రెండు మూడు గంటల కాలం దేహాన్ని మరచి, ఆనందానుభూతిని పొందితే సమాధికాదు. మరల మనస్సు విజృంభిస్తుంది. సర్వకాల స్వరావస్థల యందు ఆ స్థితిని కలిగి ఉండడమే నిజమైన సమాధి స్థితి. ఈ స్థితి గల మనిషి సుఖ దుఃఖములకు చలించడు. కష్టనష్టాలకు కృంగిపోడు, నిందాస్తుతులకు

స్పందించడు, దేహముపై ఇసుమంత మోహముండదు. సర్వత్రా ఏకభావంతోనే ఉంటాడు. సర్వగత చైతన్యంలో విలీనమై యుంటుంది. అతని అంతరంగం. త్రిగుణాలకు, అరిషడ్వర్గాలకు అతీతమైన సర్వాత్మ భావనలో ఉంటాడు. ఇదియే నిజమైన సమాధి స్థితి. ఈ స్థితి పొందటానికి పూర్ణానుగ్రహంకావాలి. సద్గురువు అనుగ్రహానికి పాత్రుడు కావాలి, అలానడచుకోవాలి, అప్పుడే అందుతుంది ఆస్థితి. ఆస్థితియే మన నిజస్థితి, సహజస్థితి అంతేకాని కళ్ళుమూసుకొని శరీరాన్ని మరచిపోవడంకాదు సమాధి అంటే. పూర్ణమైన ప్రేమను, కరుణను, కలిగి ఉంటాడు. ఆ స్థితిలో ఉన్న వ్యక్తి. ఆయనకు అన్యం ఏమీ తోచదు. అంతటిలో తననీ, తనలో అంతటిని చూచుకొని ఉంటాడు ఆ స్థితిగల సత్పురుషుడు.

శ్రీ పరాత్పరికీ జై !!

"తానొకటి తలిస్తే దైవమొకటి తలుస్తాడు కాదు ! దైవం తలిస్తేనే తాను తలుస్తాడు.

మనము తరచూ ఒక మాట అంటూ ఉంటాము. మన మొకటి తలచి చేద్దామనుకుంటే దైవమొకటి చేస్తుందండీ ! .. అంటాము. నిజానికి దైవం తలిస్తేనే మనము తలుస్తాము. ఆపని నిర్విఘ్నంగా సాగిపోతుంది. ఆయన సంకల్పంలేనిదే గడ్డిపోచకూడా కదలదు. మనం పొందుతున్న ఆనందమైనా, సంతోషమైనా, సంపదనైనా ఆయన కరుణయే. ఆయన సంకల్పం లేనిదే ఏమీ చేయలేము, మనమేమీ పొందలేము.

అల్లూరి సీతారామరాజు గారు మంచి చదువరి. భగవంతుని జ్ఞానము కల్గి, వివేకముతో, విచక్షణలో నడుచుకునే వ్యక్తి. నిరంతరం ధ్యానం, ప్రాణాయామము చేసుకుంటూ తద్వారా లభ్యమైన ఆనందాన్ని అనుభవిస్తుండేవారు. అలాంటి సాధకున్ని, సత్పురుషున్ని

స్వాతంత్ర్య సమరయోధునిగా మార్చింది ఎవరో ?! ఆయనలో స్వేచ్ఛా, స్వాతంత్ర్యం కోసం పోరాడాలనే దివ్య సంకల్పాన్ని, వీరత్వలక్షణాల్ని యిమిడ్చినదెవరు ? ! దైవం కాదా ? పరమాత్మను ధ్యానిస్తూ జీవించిన తనకు ఆ పోరాటపటిమను అనుగ్రహించినదెవరు ? ఆ దైవమే సంకల్పించింది. అందుకే ఆయన తలచాడు, దేశ పరిస్థితిని, ప్రజలు అనుభవిస్తున్న హింసను పరిశీలనాత్మకంగా చూశాడు. గుండెలో ధైర్యాన్ని నింపుకున్నాడు. ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యములను అందించాలను కున్నాడు అంతే వీరుడిగా మారిపోయాడు. వీరత్వాన్ని చవిచూపించాడు, తెల్లదొరల గుండెలదిరేలా అరిచాడు, చరిచాడు, ఎందరో ఆయన బాణం దెబ్బలకు ప్రాణాలు వదిలారు. ఇలా చేయటానికి ఇలా జరగటానికి కారణం! ఆ దైవం తలచింది. మనల్ని పరాయి పాలననుండి విముక్తులను గావించడానికి, స్వేచ్ఛావాయువులను పీల్చుకోవడానికి అయన్ని అలా ఉపయోగించుకుంది. కనుక ప్రతీ సత్యమైన తలంపు ఆయనదే, ఆ ఈశ్వరునిదే. అందుకే ఆయనలో ఆ ప్రేరణకల్గింది. అంత ఉద్రేకం తాండవించింది. వీరత్వం విజయం చేసింది.

అదే మాదిరిగానే స్వాతంత్ర్యం కోసం పోరాడి దేశ ప్రజలను బంధవిముక్తులను చేస్తామనుకున్నారు **అరవిందఘోష్, బాల గంగాధర తిలక్**. కానీ.... వారిని జైళ్ళలో పడేసేలా చేసింది దైవం. వారిలో ఆధ్యాత్మికత వెలుగు చూసేలా చేసింది, వారు ఊహించని రీతిలో వార్ని మలచింది దైవం. ఆ దైవం తలచింది కనుకనే వారిలో ఆత్మ సౌందర్యం ప్రకటితమయ్యింది. సర్వాన్ని గమనించారు. మన చేతిలో ఏమిలేదని నిర్ధారణ చేసుకున్నారు. దైవ సంకల్పంతో సర్వం జరుగుతుందనే విశ్వాసాన్ని తమలో నింపుకున్నారు. తిలక్ భగవద్గీతకు భాష్యంవ్రాస్తే, అరవిందుల వారికి శ్రీ కృష్ణ సాక్షాత్కారమై ధన్యుడై మహనీయునిగా

మలచబడ్డారు. కనుకనే ఆ దైవం తలిస్తేనే మనం తలుస్తాం లేకుంటే మనకు ఆ భావమే ఏర్పడదని అమ్మ సత్యాన్ని ప్రవచించారు.

న్యాయవాదిగా ఉద్యోగం చేసుకుంటున్న **గాంధీ** దేశపరిస్థితిని చూశాడు. న్యాయవాద వృత్తి వదలి స్వాతంత్ర్య పోరుగావించాలనుకున్నాడు. ఈ సంకల్పం ఎవరిది ?! ఖచ్చితంగా దైవానిదే. కనుక తనకి ఆ పవిత్రమైన తలంపు వచ్చినది. అందుచేత శాంతియుత పోరాటాన్ని చేయగలిగాడు గాంధి.

భగవంతుని సంకల్పం సత్యమైనది, శాశ్విత ఫలితాన్నిచ్చేది అయినా అంతటి ఉన్నత తలంపు మనలో కల్గినా మనలో ఆవరణగా అడ్డుగా ఉన్న మన మనస్సు దానిని గమనించక మనల్ని తప్పించి, వక్రదారిపట్టిస్తుంది.

అందుకే పెద్దలు ''తస్మాత్ జాగ్రత్త'' అని అన్నారు. కనుక ఆయన్ని శరణం వేడి ఆయన ఆజ్ఞలకు అనుగుణంగా జీవించే జ్ఞానాన్ని, భాగ్యాన్ని ప్రసాదించమని వేడుకుందాం.

శ్రీ పరాత్పరికీ జై !!

ఆయా సమయాలలో ఆయా పనులను చేయించటమే కరుణ.

ఏది ఎప్పుడు జరగవలసి ఉన్నదో అప్పుడే జరిగితీరుతుందనేది సత్యం. అంతే కానీ మన ఇష్ట ప్రకారం అనుకున్న విధంగా జరగలేదని వాపోవటం అజ్ఞానం. సర్వమయుండైన ఆ ఈశ్వరుని ఆజ్ఞలేనిదే

ఆకుకూడా కదలదు. అందుకే విఘ్నాలు శివుని ఆజ్ఞలేనిదే చీమైనా చావదంటారు. నిజమేకదా ! .. మనము అనుకున్నవి కొన్ని జరగటం లేదంటే ఏమనాలి ? మన చేతిలో, మన చేతల్లో ఏమీ లేదని అనుకోవాలి. ఈ విచక్షణా జ్ఞానం కొంచెమైనా ఉంటేచాలు పరిస్థితులు మనల్ని లొంగదీసుకోలేవు. కారణం ! మనం చేయవలసినదల్లా ప్రయత్నమే గాని ఫలితమును నిర్ణయించే సత్తా మన చేతిలో లేదనే వివేకం కల్గి ఉండడం వలన. ఏ సమయంలో ఏం చేస్తే మంచి జరుగుతుందో మనకు తెలియదు కానీ ఆయనకు (ఈశ్వరునికి) ఎరుకే. అందుకే ఏమి జరిగినా చూసి ఊరుకోవలసినదే కానీ పరిపరివిధముల ఆలోచించి ఇలా జరిగిందెందుకు అని అనుకుంటే మరింత చింత, చికాకు తప్ప ఫలితం శూన్యం. రాముడు తండ్రి మాటను కాదని శాంతిపాలన అందించడం కోసం లక్షలాది ప్రజలకోసం ఉండలేదు. కారణం ! ఆయన అడవికి వెళ్ళుటయే దైవ నిర్ణయం. ఆయన అడవులకు వెళ్లి ఉండకపోతే తపోధనులకు రాక్షసుల వలన తీవ్ర భంగము ఏర్పడుతుంది. వారు హింసిస్తారు, తమ నిత్య కృత్యాలకు, అనుష్టానానికి ఆవరోధం కల్గిస్తారు. రాక్షసులను హతమార్చాలి, రాక్షసత్వంతో తన భక్తుడైన విభీషణున్ని బాధపెడుతున్న రావణున్ని హతమార్చి, విభీషణున్ని ఆదుకోవాలి, భక్తురాలైన శబరిని అను గ్రహించాలి.

అహల్యను శాప విముక్తురాలిని చేయాలి. వానరులను భక్తులుగా మలచాలి. ఇన్ని కార్యాలు రామునిచే చేయవలసి ఉంటే ఆయన వాటన్నింటిని ప్రక్కకు నెట్టి సింహాసనంపై కూర్చొని రాజ్యమెలా ఏలగలడు. ఇంకొక్క విషయం తాను దేహపరంగా అడవులకు వెళ్లినా తన కృప, ధర్మ దృష్టి అయోధ్య ప్రజలపై ఉంది కనుకనే, నిర్గుణంగా తను ఉండి నడిపించాడు గనుకనే భరతుడు ధర్మపాలనను గావించాడు. కనుక ఆయా సమయాలలో ఆయా పనులు చేయించడం ఆయన

తన కరుణను ప్రసాదించుట కొరకే. రాముడే అయోధ్యలో ఉండి పరిపాలన గావిస్తే ఆయన ధీరత్వం, సమర్ధత్వం, శాంతిగుణం, ధర్మ లక్షణం మానవలోకానికి తెలిసి ఉండేది కాదు. కనుకనే మనపై కరుణచేతనే దైవం ఆ సమయంలో ఆ విధంగా చేసి కరుణించింది.

శ్రీకృష్ణ పరమాత్మ రధసారధ్యమును వహించి బారులు తీరిన కురుసేన మధ్యకు రథాన్ని తోలుకుపోయి అక్కడ నిలిపాడు, గురువును, తాతను, సన్నిహితులను, బంధువులను చూసి వైరాగ్యం ఉదయించింది అర్జునునిలో. ఆ యుద్ధం ప్రారంభ సమయంలోనే గీత ప్రబోధించాడు శ్రీ కృష్ణుడు అర్జునునికి. అర్జునుని కర్తవ్యాన్ని చెప్పి నిమిత్తమాత్రున్ని చేసి యుద్ధం చేయించాడు. భూభారమైయున్న దుష్టులను దునుమాడాడు. ఆ సమయంలో అర్జునునికి గీతోపదేశం చేయకపోతే అర్జునుడు యుద్ధం చేయడు. పాండవులకు ధర్మ విజయం సంభవించదు. క్షత్రియ ధర్మాన్ని సకల యోగములను తెలియజేస్తూ ‘‘నన్ను (ఈశ్వరున్ని) అనన్య చింతన చేసేవాడి యోగ క్షేమాలు చూస్తాను’’ అన్నాడు, అలా అభయాన్ని గీతాచార్యుడు ఇచ్చి ఉండకపోతే మన చీకటి బ్రతుకులకు ధైర్యం దొరకదు. వెలుగు ప్రసరించదు, సకల శాస్త్రాలసారమైన గీత మనకు లభించదు. కనుకనే యుద్ధ సమయమందు అర్జునునికి గీత చెప్పుటమే ఆయన నిర్ణయించిన సమయం. ఆ గీత మనకందించడమే ఆయన కరుణ.

కనుక ఏమి జరిగినా ఆయన కరుణతోనే జరుగుచున్నది అని అంగీకరించి, భావించి, జీవిస్తే ఆయన కరుణకు పాత్రులం కాగలం.

శ్రీ పరాత్పరికీ జై !!

తప్పుని తెలసీ చెయ్యటం తప్పించుకోలేక

మనమేమి చేసినా మన అంతరాత్మకు తెలుస్తుంది. మనం చేసినది తప్పో ఒప్పో అని తెలిసి చేసే పనిలో మనకు చికాకు, భయం, భీతి ఉండవు. దాని వలన లభించిన ఫలితాన్ని కూడా ఆనందంగానే స్వీకరిస్తాము. దానివలన మనం ఏ అశాంతికి గురికాము. కానీ అదే తప్పు ! అని తెలిసికూడా ఆపని మనం చేస్తే బాహ్యానికి ఏమి అంటనట్లు, ఏమీ ఎరుగనట్లు కనిపించినా, భావములలో అది చేసినందుకు బాధ మిగిలిపోతుంది. ఎంతో అశాంతికి గురి చేస్తుంది. క్షణ క్షణం భయాన్ని కలిగిస్తుంది. శాంతికి దూరం చేస్తుంది. కనుక తప్పని తెలిసీ చేయకుండా ఉండడం అనేదే ఉత్తమలక్షణం.

కొన్ని సందర్భములలో తప్పని ఖచ్చితముగా తెలిసినా చేస్తాము. ఎందుకంటే అది చెయ్యక తప్పదు. అంతటి పరిస్థితి తన చుట్టూ అలుముకున్నప్పుడు తనచే బలవంతంగానైనా చేయిస్తుంది ఆపరిస్థితి. అహంకారపూరితమై ఉన్న వ్యక్తిలో విజృంభిస్తున్న వికార గుణములు తన చేత ఎన్నో తప్పులు, నేరాలు ఘోరాలు చేయిస్తాయి. దీనికి మూలం ఆ వికార రూపమైన అహంకారం నుండి తప్పించుకోలేక.

ప్రతీ ఉదయం కోటి శివలింగాలను అర్చించిన పరమ భక్తుడుగు రావణుడు గొప్ప రాజనీతిజ్ఞుడు, ఇంత గొప్ప భక్తి ప్రపత్తులను కల్గిన వ్యక్తి పరాయిస్త్రీ, రాముని భార్య అయిన సీతను అపహరించి, ఆశోక వనంలో ఉంచి, ఎంతఘోరానికి వడికట్టుకున్నాడు రావణాసురుడు. ఆ భక్తి ఏమయ్యింది ? ఆ భక్తివలన కల్గిన జ్ఞానం ఏమయ్యింది ? రావణబ్రహ్మ బిరుదును ఆపాదించుకున్న తన గొప్పతనం ఏమయ్యింది?

ఎంత భక్తుడైనప్పటికీ ఎంత రాజ నీతి వేత్త అయినప్పటికి తనలో అహంకారం చావలేదు.

ఏ ఈశ్వరుని అభిషేకించి, అర్థించాడో ఆ ఈశ్వరుడు సర్వమయుడనే జ్ఞానాన్ని పొందలేదు. అహంకారం ఉన్నంతవరకూ మొహం పోదు. అందుకే మోహపూరితుడై ఆ తల్లిని అపహరించాడు. కారణం ! పరాయి స్త్రీని అపహరించడం తప్పు అనే ఇంగితజ్ఞానం కూడా లేనివాడు కాదు రావణుడు. అలా చేయడం తప్పు అని తెలుసు అయినా అహంకార సహితుడై, దేహమోహితుడై ఉన్న రావణుడు అహంభావం చేత తప్పని తెలిసినా తప్పించుకోలేకపోయాడు. అందుకే ఆ పని చేశాడు. తన చేత తనలో ఉన్న అహంకారమే ఆ పని చేయించింది. విభీషణుడు రాముని యొక్క ఔదార్యమును, దివ్యత్వమును కొలువులో చెప్పినా కోపించి తన్నాడు తన తమ్ముణ్ణి. రావణుడు ఆ పని చేయడం మహా నేరం అయినా తన అహంకారము వలన చేయడం తప్పలేదు. చివరకు ఏమయ్యాడు ?! మట్టిపాలయ్యాడు.

ఇంటిగుట్టు చెప్పకూడదనే వివేకం విభీషణునిలో ఉన్నను తన అన్న రావణుని మరణ మర్మాన్ని రామునికి చెప్పాడు కారణమేమిటి ?! ధర్మము నుండి తప్పించుకోలేక.

కనుకనే తప్పని తెలిసినా తన ఇంటి గుట్టును రామునికి అందించాడు రావణుని తమ్ముడు. అందువలననే అహంకారపూరితుడైన మనిషికి సుఖముండదు. అహంకారరహితుడైన మనిషికి శోకముండదు. అంతా శాంతిమయమే. ఆనందమయమే !

శ్రీ పరాత్పరికీ జై !!

అడగకుండా అమ్మైనా పెట్టదు కాదు ! అడగకుండా పెట్టేదే అమ్మ.

నవమాసములు మోసి, పురిటి నొప్పులు ఓర్చి, మనల్ని కన్న అమ్మకంటే ప్రత్యక్షదైవం వేరేలేదు. అందుకే తల్లిని మించిన దైవం వేరొకటి లేదని పెద్దలన్నారు. ఆమె మన కోసం తిండిని, తనవంటిని మరచి, మనల్ని తన కళ్లల్లోనింపుకొని వాడిపోకుండా పెంచుతుంది. ఆమె తన నెత్తురునే పాలుగా మార్చి తనగుండె సంచులలో దాచి మన ఆకలిని తెలిసికొని అక్కున చేర్చుకుని మన కడుపునిండుగా పాలుపోసి తన ఆకలినే మరిచిపోతుంది. తన ఆనందాన్నంతా, తన ఆశనంతా మనపైనే ఉంచుకుంటుంది. మన బుగ్గలోని చిరునవ్వుచూసి మురిసిపోతుంది. సర్వాన్ని మరచిపోతుంది. ఆమెది అర్పణప్రేమ. తన సుఖాలను మన కోసం త్యాగం చేసుకుంటుంది. ఏడిస్తే బుజ్జగిస్తుంది. చందమామను చూపి బువ్వపెడుతుంది. తన వంటిలో సత్తువ సన్నగిల్లినా మనల్ని ఎత్తుకొనటమూ మానలేదు. మన వంటికినలతగుంటే తన కంటికి నిదుర గానదు. మనకడుపు వెలితిగుంటే తన తిండిని మనకిచ్చిన త్యాగమూర్తి. అమ్మ జోలపాడి నిదురపుచ్చటమే కాదు, వ్రేలు పట్టి నడిపించడం నేర్పుతుంది, పిలుపులు నేర్పుతుంది, పలకరింపులు చెబుతుంది, మన లేత మనస్సును రజింపజేసేందుకు చిన్ని చిన్ని కథలను ఎన్నెన్నో బోధించింది. మనం బాల్యాన్ని గుర్తుకు తెచ్చుకుంటే మనమిలా ఉండడానికి ఆమె శ్రమ, త్యాగం ఎంతుందో మనకే అర్థమవుతుంది. ఆమె ప్రేమఒడిలో ఎన్ని బుద్ధులు నేర్చుకున్నామో, మన చదువులకై ఆమె శరీరం ఎంతగా శ్రమించిందో ఇదంతా ఎందుకు చేసింది ?! మనమేదో గొప్పవాళ్ళమై ఆమెను ఉద్ధరిస్తామనే స్వార్థబుద్ధితో కాదు.

ప్రేమరూపమే అమ్మ కనుక. ఆమెకు తన బిడ్డపై ప్రేమ తప్ప ఏనాడు ద్వేషముండదు. మనమెంత విసిగించినా తను కోపగించుకోదు. మనం మారాం చేస్తే, అలకపూనితే తన దగ్గరకు తీసుకుని , వెన్ను నిమిరి ఎంత బ్రతిమాలుతుందో .... ఇదంతా గమనిస్తే ఆమె రుణం మనమెలా తీర్చుకోగలం ?! ఎప్పటికీ తీర్చుకోలేమా ?! ఆమె మనల్ని ఎంత నీతిమంతులుగా బ్రతకమని చెప్పిందో పదిమందిలో గౌరవప్రదంగా బ్రతకమని చెప్పిందో .. అవన్ని ఆచరిస్తే అమ్మ రుణం కొంచెమైనా తీర్చవచ్చేమో ! మనల్ని కన్నతల్లికే ఇంతప్రేమత్యాగం ఉంటే సర్వాధారిణి, సర్వజగద్రూపిణి అయిన ఆ జగన్మాతకు ఎంత ప్రేమ ఉంటుంది ! సర్వంతానై సర్వజీవుల యెడల ప్రేమతో సర్వసంపదలను, సకల సౌఖ్యాలను, సకల శుభాలను ప్రసాది స్తున్నఆ జగన్మాత ఎంత త్యాగం జేసింది. జగత్ శక్తే మన అమ్మ ద్వారా ప్రేమ, లాలన, పాలన, పోషణ, రక్షణ అందిస్తుంది. ఆమెయే సుఖ దుఃఖాలలో పడి నలుగుతున్న మనల్ని అక్కున జేర్చి, సేదతీర్చి, ధైర్యాన్నిచ్చి నీకెందుకు భయం నాన్నా ! భయమెందుకవమ్మా ''నేనున్నాను'' అని జిల్లెళ్ళమూడి అమ్మ, ఆనందమయి అమ్మ, అమృతానందమయి అమ్మ, మొదలగు స్త్రీమూర్తుల రూపములలో ప్రకటమై, కంటతడి తుడిచి, ఆర్తుల, దీనుల, అర్భకుల జీవితములలో ఆనందపు పంటలను పండిస్తున్నది ఆ జగన్మాతయే.

అమ్మను మనం ఏమీ అడగవలసిన అవసరం లేదు. మనకి ఎప్పుడు ఏం కావాలో తనే సమకూర్చి సమయానికి మనకు అందిస్తుంది. మనం అడగకుండానే, ఆకలిని ఎరిగి చెప్పకుండానే మనకు బువ్వపెడుతుంది. మనం కోరకుండానే క్రొత్త బట్టలుకొని మనకు కట్టింది. మనం చెప్పకుండానే బడికి పంపి చదువు నేర్పించింది. అమ్మకు మన అవసరాలూ తెలుసు, మనల్ని ఆనంద పెట్టడమూ తెలుసు. అందుకే

''అడిగితే గాని అమ్మైనా పెట్టదంటారు''. అది సరియైనది కాదు. అడగకుండా పెట్టేదే అమ్మ అని అనసూయా దేవి ప్రవచించారు.

సువిశాల జగానికి ఆధారమై ఉన్న, శ్రీ పరాత్పరియైన జగన్మాతకూడా మనమేమి కోరకుండానే మన దుఃఖాన్ని తృంచేందుకు, దయను చూపి ఆనందాన్ని పంచేందుకు అమ్మలాంటి రూపములలో వచ్చి అనుగ్రహిస్తూ ఉంటుంది.

ఆ అపార అనుగ్రహాన్ని పొంది, ఆనందాన్ని పొందిన మనము నిరంతరం ఆమెకు జోహార్లర్పించి, మనుగడసాగించుకోవాలి. అప్పుడే మన జీవితానికి నిండుదనం వస్తుంది.

శ్రీ పరాత్పరికీ జై !!



శుభం

అమ్మ

1. జిల్లెళ్లమూడి అమ్మగ
చల్లని దీవెనల నిచ్చు చక్కని తల్లీ
ఎల్లలు దాటిన ప్రేమతొ
చల్లని నీఒడికి చేర్చి సాకితివమ్మా!

2. ఏదారియు లేని జనులు
ఆధారము నీవటంచు అర్థించకనే
నీదరికిన్ మము జేర్చియు
వేదన తొలగించు నిన్ను వేడెదమమ్మా!

3. చూసేదంతయు నీవే
చేసేదంత తమలీలచె జరుగునమ్మా
వేసారిన జీవితమున
నీ సన్నిధి రక్షణిచ్చు నిజముగ జననీ!

శ్రీ పరాత్పరికీ జై !!

జయజయజననీ

పల్లవి : జయ జయ జననీ జయ జగజ్జననీ

ఓంకార రూపిణి ఓ విశ్వజననీ (2)

చరణము : అమృత వర్షిణి ఆనందదాయిని

అనుగ్రహవర్షిణి అనురాగ దాయిని (2)

అభయప్రదాయిని భవభయహరణి

అజ్ఞాన నాశిని సుజ్ఞాన దాయిని

ఓం మాతా నమో నమో శ్రీమాతా నమో నమో (2) ॥జయ జయ॥

చరణము : చల్లని నీ ఒడిలో పిల్లలమమ్మా

లాలనపాలన నీవేనమ్మా (2)

ఎల్లర బ్రోచెడి ఈశ్వరివమ్మా

భవబంధ ముడిని తొలగించుమమ్మా

ఓం మాతా నమో నమో శ్రీమాతా నమో నమో (2) ॥జయ జయ॥

శ్రీ పరాత్పరికీ జై !!

సత్యము శివము సుందరము నిత్యము శుభము మంగళము

నేను అమ్మను - మీరు బిడ్డలు



జిల్లెళ్ళమూడి అమ్మ

నన్నొక ఉపకరణం చేసి
నాపై అపార కరుణను
కురిపించుచున్న
"అమ్మ" చరణాలకు
అనంత ప్రణామాలర్పిస్తూ......

- రామకృష్ణ



DHARMATEJA OFFSET, GWK. ☎ 514985